




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

శుక్రవారం 26.01.2024 | సంపుటి : 12 సంచిక : 196 | పేజీలు : 12 వెల: రూ. 4/- | Follow :

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







# గెలుపేలక్ష్యంగా పనిచెయ్యండి



## భాజపా బెదిరింపులకు భయపడొద్దు

## మోడీ హామీలను పార్లమెంట్‌లో నిలదీస్తాం

- రెండుకోట్ల ఉద్యోగాల హామీని విస్మరించిన మోడీ
- ఎంపీలను సస్పెండ్ చేస్తూ అప్రజాస్వామిక చర్యలు
- విపక్ష ప్రభుత్వాలకు దర్యాప్తు సంస్థలతో బెదిరింపులు
- ఇలాంటి వాటిపట్ల రేవంత్ రెడ్డి అప్రమత్తంగా ఉండాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బూత్ కమిటీల పని
- బూత్‌కమిటీల భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

" గతంలో మోదీ గ్యారంటీ అని పత్రికలలో ప్రకటనలు ఇచ్చారు.. మరి రెండు కోట్ల ఉద్యోగాల గ్యారంటీ ఏమైంది? వెనక్కు తెప్పిస్తా అన్న నల్లధనం ఎక్కడ? దేశంలో ఏ ఒక్కరికీ పనులు లేకుండా మోదీ చేశాడు. పని లేకపోతే ప్రజలకు ఉపాధి ఎలా..? వారి కడుపు ఎలా నిండుతుంది.మోదీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారు"

– మల్లికార్జున్ ఖర్గే

హైదరాబాద్(జనంసాక్షి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన అన్ని హామీలపై ప్రశ్నిస్తామని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. గతంలో మోదీ గ్యారంటీ అని పత్రికలలో ప్రకటనలు ఇచ్చారు.. మరి రెండు కోట్ల ఉద్యోగాల గ్యారంటీ ఏమైంది... నల్లధనం వెనక్కు తెప్పిస్తాం అన్నాడు ఏమైందని ప్రశ్నించారు. దేశంలో ఏ ఒక్కరికీ పనులు లేకుండా మోదీ చేశారని ధ్వజమెత్తారు. పని లేకపోతే ప్రజలకు ఉపాధి ఎలా..? వారి కడుపు ఎలా నిండుతది అని ప్రశ్నించారు. మోదీ ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తున్నాం అంటూ బలహీన పరుస్తున్నాడని మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు.పార్లమెంట్‌లో సమస్యలపై మాట్లాడితే ఎంపీలను సస్పెండ్ చేస్తారని మండిపడ్డారు. గురువారం నాడు ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ బూత్ లెవల కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ... మొన్న పార్లమెంట్‌లో 146 ఎంపీలను సస్పెండ్ చేశారన్నారు. మోదీ పదేళ్లుగా అన్ని సంస్థలను నాశనం చేశారని తీవ్ర

మిగతా 2లో..



# రాష్ట్ర పునర్నిర్మాణ మేస్త్రీని

## వచ్చే నెలలో రైతుభరోసా

## జీతాలు ఇవ్వలేని దుస్థితికి తెలంగాణను తెచ్చారు

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెట్టాల్సిందే
- కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి కృషి చేయాలి
- కాంగ్రెస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్



"రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించి, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి గత పాలకుల వైఖరే కారణం తెలంగాణను పునర్నిర్మించే క్రమంలో నేను మేస్త్రీనే.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెల్చుకుని రాహుల్‌ను ప్రధానిని చేయడమే మనముందున్న లక్ష్యం"

– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణను పునర్నిర్మించే క్రమంలో తాను మేస్త్రీనేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఆర్థక విధ్వంసం సృష్టించి, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి గత పాలకులు తీసుకుని వచ్చారని మరోమారు ధ్వజమెత్తారు. ఈ క్రమంలో బిఆర్ఎస్‌ను బొందపె ట్టాల్సిందేనని, కెసిఆర్ పీక పిసికే కార్యక్రమం కాంగ్రెస్ చేపట్టిందని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెల్చుకుని రాహుల్‌ను ప్రధానిని చేయడమే మనముందున్న లక్ష్యమన్నారు. కార్యకర్తల శ్రమవల్లే తెలంగాణ లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన బూత్‌స్థాయి కన్వీనర్ల సదస్సులో ఆయన ఆవేశంగా ప్రసంగించారు. రాహుల్‌గాంధీ పాదయాత్రతోనే కర్ణాటకలో, తెలంగాణలో అధికారంలోకి వచ్చాం. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం. అధికారంలోకి వచ్చి 50 రోజులు కాలేదు.. హామీలు అమలు ఎక్కడ అని భారాస నేతలు అడుగుతున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో మరో రెండు హామీలు అమలు చేస్తాం. ఫిబ్రవరి

మిగతా 2లో..



# టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

ఐదుగురు సభ్యులుగా అనిత రాజేంద్ర, పాల్వాయి రజిని కుమారి, అమిర్ ఉల్లా ఖాన్, యాదయ్య, వై. రామ్మోహన్ రావు

జీవో విడుదల చేసిన గవర్నర్ తమిళిసై




హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ గా మాజీ డీజీపీ ఎం. మహేందర్ రెడ్డితో పాటు మరో అయిదుగురు సభ్యులు నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోద ముద్ర వేశారు. ఆయనతో పాటు టీఎస్పీఎస్సీ సభ్యులుగా ఐఏఎస్ అధికారి అనిత రాజేంద్ర, పాల్వాయి రజిని కుమారి, అమిర్ ఉల్లా ఖాన్, యాదయ్య, వై. రామ్మోహన్ రావులను నియమించారు. సభ్యుల నియామకాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వీటిని పరిశీలించిన సర్కార్.. మహేందర్ రెడ్డి పేరును ఖరారు చేసింది. సభ్యుల నియాకం కూడా పూర్తి కావడంతో త్వరలోనే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చే అవాకశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మహేందర్ రెడ్డితోపాటు సభ్యులుగా అనితా రాజేంద్ర (రిటైర్డ్ ఐఏఎస్), పాల్వాయి రజిని కుమారి, అమిర్ ఉల్లా ఖాన్, యాదయ్య, వై రామ్మోహన్ రావులను నియమించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం టీఎస్పీఎస్సీ ప్రతిష్టను దెబ్బ తీసింది. దీనిపై సిట్ విచారణ సైతం జరిగింది. గ్రూప్ 1 పరీక్ష మూడుసార్లు రద్దు కావడంతో నిరుద్యోగులకు కమిషన్ మీద నమ్మకం పోయింది. మొత్తం 20 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీక్ కావడంతో వాటన్నింటినీ

మిగతా 2లో..

# విడతలవారీగా సర్పంచుల బిల్లులు

## సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో అసాధ్యం:మంత్రి సీతక్క

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచులకు సంబంధించిన బిల్లులు దఫలవారీగా చెల్లిస్తామని, ఈనెల చివరితో సర్పంచుల పదవీకాలం ముగిస్తున్న సర్పంచ్ ల ఎన్నికలు ఇప్పట్లో సాధ్యం కాదనీ పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం రాత్రి ఆమె తన కుటుంబ సభ్యులతో వేములవాడకు చేరుకొని గురువారము ఉదయము శ్రీ రాజరాజేశ్వర స్వామిని తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభముతో స్వాగతం పలికారు. ఆలయంలో

మిగతా 2లో..



## ఎమ్మెల్సీలుగా

# కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్



- గవర్నర్ కోటాలో నియామకం
- ఎంపిక చేసిన తమిళిసై సౌందరరాజన్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలను తమిళిసై సౌందరరాజన్ ఎంపిక చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్‌ల ఎంపికకు ఆమె ఆమోదం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు సంబంధించి ప్రతిపాదనలు పంపింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరామ్, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమరుల్లా ఖాన్ పేర్లను గవర్నర్ ఆమోదించారు. వీరిద్దరినీ ఎమ్మెల్సీలుగా నియమిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. వీరి నియామకానికి గవర్నర్ ఆమోదం తెలుపగా.. గవర్నర్ కార్యాలయం గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, మరొకరి పేరును ప్రభుత్వం ప్రతిపాదించగా.. గవర్నర్ తిరస్కరించారు. దాంతో ఆ రెండు స్థానాలు అలాగే ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు ఈ స్థానాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇద్దరు పేర్లను ప్రతిపాదించగా.. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆమోద ముద్ర వేశారు.



# నితీశ్ భాజపావైపు చూపు

తిరిగి బీజేపీ గొడుగు కిందకు చేరే యత్నాలు

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్నతో మారిన పరిస్థితులు

పాట్నా(జనంసాక్షి): విపక్షాల ఇండియా కూటమికి మరో షాక్ తగలడం ఖాయంగా కనిపిస్తోంది. రెండు రోజుల వ్యవధిలోనే ముచ్చటగా మూడవ కీలక నేత కూటమికి గుడ్‌బై చెప్పబోతున్నారనే ప్రచారం సాగుతోంది. బీహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్

మిగతా 2లో..

# రాష్ట్రప్రగతిలో పారిశ్రామిక వేత్తలు భాగంకండి

## తెలంగాణ ప్రగతే మా విజన్



- మూసీని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతాం
- స్థిరాస్థి రంగం అభివృద్ధికి ప్రోత్సాహం
- ఐటి,పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రగతే మా విజన్ అని ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హోటల్ ఐటిసి కాకతీయలో సిఐఐ తెలంగాణ ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ సదస్సును మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు ప్రసంగించారు. గత ప్రభుత్వం చేపట్టని ప్రగతి పనులను ముందుకుతీసుకెళ్తామని స్పష్టం చేశారు. మూడు దశాబ్దాలుగా స్థిరాస్తి రంగం ఎంతో అభివృద్ధి

మిగతా 2లో..

# 420 హామీలు నెరవేర్చేవరకు కాంగ్రెస్‌ను వదలబోం

## హైకోర్టుకు వంద ఎకరాలు ఎలా ఇస్తారు!



- కొత్తగా మళ్లీ క్యాంపు కార్యాలయం కడతారా!
- త్వరలోనే కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తారు
- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కాంగ్రెస్ సర్కార్ స్థలం కేటాయించడాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ తప్పుపట్టారు. హైకోర్టు భవన నిర్మాణానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుండటంపై కేటీఆర్ స్పందించారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. మేము సచివాలయం కడితే అభ్యంతరం చెప్పారు. కొత్త అసెంబ్లీ కడతామంటే వద్దు అన్నారు. కానీ వాళ్లు వంద ఎకరాల్లో హైకోర్టు కడతామని

మిగతా 2లో..



జోడో న్యాయ్ యాత్రకు

# స్వల్ప విరామం

## ఢిల్లీకి రాహుల్

కూచ్‌బెహర్(జనంసాక్షి): 'ఇండియా' కూటమి నుంచి ప్రతిపక్ష పార్టీ నేతలు ఒక్కొక్కరుగా దూరమవుతున్నారు. కాంగ్రెస్ తో పొత్తు ఉండదని టీఎంసీ ఆప్‌లు ఇప్పటికే ప్రకటించాయి. జేడీయూ అధ్యక్షుడు, బిహార్ సీఎం నీతీశ్ కుమార్ కూడా భాజపాతో కలిసి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. తాజా రాజకీయ

మిగతా 2లో..

## రణరంగంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ

- హైకోర్టు నిర్మాణానికి అగ్రివర్సిటీ భూములు
- ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల ఆందోళన
- ఉద్రిక్తంగా చలో వర్సిటీ

2లో

# ఎంసెట్ ఇకపై ఈఏపీసెట్

పేరు మారిన ప్రవేశ పరీక్ష



ప్రకటన విడుదల చేసిన ఉన్నతవిద్యామండలి

హైదరాబాద్(జనంసాక్షి):ఎంసెట్ పేరు ఈఏపీ సెట్‌గా మారింది. మెడికల్ ఎంట్రెన్స్‌ను నీట్ ఆధారంగా ఎంపిక చేయడంతో దీనిని మార్చారు.

మిగతా 10లో..

## మాలి బంగారుగనిలో ఘోర ప్రమాదం

70 మంది మృత్యువాత

2లో

కొనసాగుతున్న సహాయక చర్యలు

## మాలి బంగారుగనిలో ఘోర ప్రమాదం

**70 మంది మృత్యువాత ● కొనసాగుతున్న సహాయక చర్యలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మాలిలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బంగారుగని కూలి 70 మందికి పైగా మరణించారు. గనిలో చిక్కుకున్నవారి కోసం సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఈ మృతుల సంఖ్య మరింత పెరుగనుందని తెలుస్తోంది. మాలిలోని నైరుతి కౌలికోరో ప్రాంతంలోని కంగబా జిల్లాలో గోల్డ్ మైన్ తవ్వుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అక్కడ ప్రభుత్వ జాతీయ జియాలజీ అండ్ మైనింగ్ డైరెక్టరేట్‌లోని సీనియర్ అధికారి కరీమ్ బార్తే తెలిపారు. అంతేకాదు నాలుగు రోజుల క్రితమే ఈ దారుణం జరిగినట్లు ధృవీకరించారు. మీడియా కథనాల ప్రకారంగత శుక్రవారం సంభవించిన ప్రమాదానికి కారణమేమిటో ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. గనుల మంత్రిత్వ శాఖ మంగళవారం ఈ ఘటనపై ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ దారుణ ప్రమాదంలో మరణించిన వారిలో ఎక్కువగా మైనర్లు ఉన్నట్లు వెల్లడించారు. బంగారు గని కుప్పకూలిన సమయంలో అందులో 150 నుంచి 100 మంది వరకు ఉన్నట్లు.. గనిలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు సహాయక చర్యలు వేగంగా సాగుతున్నట్లు తెలిపారు. ఆఫ్రికాలోని మూడవ అతిపెద్ద బంగారు ఉత్పత్తి దేశమైన మాలిలో ఇటువంటి ప్రమాదాలు సర్వసాధారణం. దీంతో గోల్డ్ మైన్స్ తవ్వే సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై తరచుగా విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. అధికారులు భద్రతా చర్యలను విస్మరిస్తున్నారని తరచుగా ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే రాష్ట్రం ఈ ఆర్టిసానల్ మైనింగ్ రంగంలో ఆర్డర్ తీసుకురావాలని బార్తే అన్నారు. గనుల మంత్రిత్వ శాఖ స్పందిస్తూ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మైనర్లు, మైనింగ్ సైట్ల సమీపంలో నివసిస్తున్న కమ్యూనిటీలు భద్రతా అవసరాలు పాటించాలని కోరింది.

## నితీశ్ భాజపావైపు చూపు

కుమార్ లోక్‌సభ ఎన్నికల ముందు యూ-టర్న్ తీసుకొని బీజేపీతో జట్టు కట్టనున్నారని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' అవార్డును ప్రదానం చేయాలని నిర్ణయించిన సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీకి నితీష్ కుమార్ ధన్యవాదాలు తెలిపిన మరుసటి రోజే ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. గత రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కీలక నేతలు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో, ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పాయి. నితీష్ కుమార్ కూడా దూరమైతే కూటమికి భారీ ఎదురుదెబ్బని చెప్పక తప్పదని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా కూటమిని మార్చడం నితీశ్ కుమార్‌కు పరిపాటిగా మారింది. ఈసారి కూటమి మారితే ఐదవసారి కానుంది. 2013లో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య ఆయన ఊగిసలాడారు. అయితే సీఎం పదవిని ఎలాంటి ఇబ్బంది ఉండకుండా చూసుకుంటున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో పాల్గొనాలంటూ హస్తం పార్టీ పంపిన ఆహ్వానానికి కూడా ఆయన స్పందించలేదంటూ వార్తలు వస్తున్నాయి. ఇండియా కూటమి ఎన్నికల సన్నాహాల్లో స్పష్టత లేకపోవడం, ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆమోదం లేకపోవడంతో నితీశ్ కుమార్ కలత చెందారని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకాల చర్చల్లో జాప్యం కూడా ఇందుకు కారణంగా విశ్లేషించాయి.

## రణరంగంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ

**హైకోర్టు నిర్మాణానికి అగ్రివర్సిటీ భూములు**

**ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల ఆందోళన.. ఉద్రిక్తంగా చలో వర్సిటీ**

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ రణరంగంగా మారింది. అగ్రికల్చర్ యూనివర్సిటీ ముట్టడికి ఏబీవీపీ యత్నించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. యూనివర్సిటీ 100 ఎకరాల భూమిని హైకోర్టు నూతన భవనాల నిర్మాణానికి కేటాయించడాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీవో 55ను రద్దు చేయాలని ఏబీవీపీ సైతం డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో యూనివర్సిటీ వంద ఎకరాల భూమిని పరిశీలించేందుకు వచ్చిన ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. యూనివర్సిటీ ముట్టడికి ఏబీవీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఏబీవీపీ కార్యకర్తల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. దీంతో వారు అడ్మిన్ బ్లాక్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. నిన్న ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సిని జుట్టు పట్టి ఈడ్చిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ల్యాండ్‌ను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ గత కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. పరిశోధనకు ఉపయోగపడే మొక్కలు ఉన్నాయని.. కావున ఆ భూములను తీసుకోవద్దంటూ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. అయితే యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ.. జీవో నెంబర్ 55ను రద్దు చేయాలంటూ ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. బుధవారం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సమయంలో మహిళా ఏబీవీపీ కార్యదర్శి పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు సంచలనం రేపుతోంది. ఆందోళన చేస్తున్న మహిళా కార్యకర్తను.. బైక్‌పై వెళ్తున్న ఓ మహిళా పోలీసు జుట్టుపట్టి ఈడ్చుకెళ్లింది. దీంతో సదరు కార్యకర్త కింద పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా పలువురు నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

## విడతలవారీగా సర్పంచుల బిల్లులు

మంత్రి సీతక్క ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఆమె వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నారు. స్వామివారి దర్శన అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో వేదొక్త ఆశీర్వచనం నిర్వహించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి చిత్రపటనీ శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచులకు చెల్లించాల్సిన బిల్లులను రూ1200 కోట్లు గత ప్రభుత్వం పక్క దారి మళ్ళించిందన్నారు.వారు చేసిన అభివృద్ధి పనులకు ఎప్పటికప్పుడు బిల్లుల్లు చెల్లిస్తే ఇలాంటి ఇబ్బందికర పరిస్థితి ఉండేది కాదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు చెల్లించడానికి కూడ అక్కడ ఏమీ లేదన్నారు.ఉద్యోగులకు ప్రతి నెల 5 లోగా జీతాలు , పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదన్నారు.మా ప్రభుత్వం ఎక్కడ కూడ ప్రభుత్వ నిధులను కట్టడాలకు తమ సొంత అవసరాలకు వృధాగా ఖర్చు చేయడం లేదనీ, ప్రజల సంక్షేమం కోసం నిధులను వెచ్చిస్తున్నట్లు ఆమె అన్నారు. జనవరి చివరిలో సర్పంచుల పదవి కాలం ముగుస్తున్న క్రమంలో సర్పంచ్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాదనీ, ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రి ఆధ్వ ర్యంలో నిర్ణయం తీసుకుంటమాన్నారు. సర్పంచులకు దఫలవారీగా బిల్లుల ను చెల్లిస్తమని, రాష్ట్రంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తమాన్నా రు. సర్పంచుల బిల్లులు చెల్లించాలని మేము ప్రతిపక్ష పార్టీగా అసెంబ్లీలో గొంతు ఎత్తితే సర్పంచులకు ఒక రూపాయి చెల్లించమని గత బారాస ప్రభుత్వం పేర్కొంద న్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా 6 గ్యారంటీ పథ కాలను అమలు చేసి తీరుతమనీ,మహాలక్ష్మి పథకంలో భాగంగా మహి ళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తుంటే బారస నాయకులు గగ్గోలు పెడుతున్నరన్నారు. ఆ పార్టీ వారు తమ గ్రూపులను పంపి బస్సుల లో గొడవలు చేయిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు విషయాన్ని జరుగుతున్న పరిణామాలను గమనించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయ డంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందనీ,త్వరలోనే ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి అధ్యక్షతన,ప్రభుత్వ విపు ఆది శ్రీనివాస్ తో కలిసి ఆలయ అభివృద్ధిపై సమావేశం నిర్వహిస్తామన్నారు.రాజన్న ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామనిఅన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ డిఎస్పి నాగేం ద్ర చారి, ఆర్డీవో, తహసిల్దార్ మహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గెలుపేలక్ష్యంగా పనిచెయ్యండి

ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ కుట్రలను బహిర్గతం చేయాలన్నారు. మొన్న మోదీ అయోధ్యలో ఒక్కరే గర్భ గుడిలో పూజలు చేశారని.. అద్వానీ, మనోహర్ జోషిలను ఎందుకు లోపలికి రానివ్వలేదని ప్రశ్నించా రు. దేశంలో దేవుడు ప్రతి ఇంట్లో ఉన్నాడు.. కానీ దేవుడు తమ దగ్గరే ఉన్నట్టు మోదీ ప్రచారం చేసుకుంటున్నాడని దుయ్యట్టారు. ఆకలి అయినవాడికి అన్నం పెట్టాలని.. ఉపాధి లేని వారికి ఉద్యోగం ఇవ్వాలని.. కానీ మోదీ ఎన్నికల రాజకీయాలు, ప్రచారంతోనే కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ప్రజల సొమ్ముతో మోదీ ప్రచారం చేసుకుంటున్నాడని మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు. రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని.. బూత్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పనిచేయాలని సలహాలు ఇచ్చారు. వారు చేసిన కృషి ఫలితంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి వచ్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇచ్చామని.. అప్పుడే రెండు గ్యారంటీలు అమలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం అన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో యువత ఉందని.. వారికి ఉపాధి లేదన్నారు. రాహుల్ మణిపూర్ నుంచి భారత్ న్యాయ యాత్ర ప్రారంభించారని.. దిగ్విజయంగా సాగిస్తున్నారని తెలిపారు. ప్రజలంతా బాగుండాలని రాహుల్ యాత్ర చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ యువత, మహిళ, దళిత, గిరిజన ప్రజల కోసం కష్ట పడుతున్నారని వివరించారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ క్యాడర్ కష్టపడి, రాహుల్ గాంధీ కృషి వల్ల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ మీరంతా కష్టపడి ఎలాంటి ఫలితాలు తెచ్చారో దేశంలో కూడా అలాంటి ఫలితాలను తేవాలని ఆకాక్షించారు. ఇక్కడ ప్రభుత్వ పనితీరు, రేవంత్ రెడ్డి పనితీరు ఆదర్శంగా ఉందని అభినందించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడ ప్రభుత్వాలు పడగొట్టేందుకు కుయుక్తులు పన్నుతారని మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు. తెలంగాణలో గతంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు లేదని.. చాలా పటిష్టమైన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మోదీ, షాలు ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి దాడులు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులంతా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని.. కానీ బీజేపీకి తెలంగాణలో ఎవరు భయపడరని చెప్పారు. కేసీఆర్ బీజేపీపై ఎప్పుడు ఆరోపణలు చేయలేదని.. ఆయన బీజేపీకే మద్దతిస్తారని.. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను కాంగ్రెస్ రాష్ట్రంలో ఓడించిందని.. లోక్‌సభ ఎన్నికల్లో వారిని ఓడిస్తామని తేల్చిచెప్పారు. ఇక్కడ కాంగ్రెస్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. క్యాడర్ లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పనిచేస్తే విజయం సాధిస్తామని చెప్పారు. నెహ్రూ ఒకసారి ఇలా అన్నారని 'మనం ప్రజల మధ్య ఉంటే గెలుస్తాం... లేకపోతే ఓడిపోతాం' అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. క్యాడర్ గ్రామ, బూత్ స్థాయిలో పని చేయాలని సూచించారు. మీ శక్తి అంత గ్రామ, బూత్ స్థాయిలో పని చేసి రాబోయే పార్లమెంట్, తదితర ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా పని చేసి విజయం సాధించాలని ఖర్గే పిలుపునిచ్చారు.

# రాష్ట్ర పునర్నిర్మాణ మేస్త్రీని

ఆఖరు వరకు రైతు భరోసా నగదు అందిస్తాం. భారాస ఇచ్చిన హమీలు అమలు చేశారా అని అంటూనే.. పదేళ్లలో కేసీఆర్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దాలి. కొందరు నన్ను మేస్త్రి అని విమర్శిస్తున్నారు. అవును.. తెలంగాణను పునర్‌నిర్మించే మేస్త్రీనేనని అన్నారు. అవినీతిపరులు, కోటీశ్వరులను కేసీఆర్ రాజ్యసభకు పంపించారు. బలహీన వర్గాల బిడ్డలు మందు శామ్యూల్, వెడ్మ బొజ్జుకి కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చి గెలిపించింది. రైతు బిడ్డనైన నేను కాంగ్రెస్‌లో సీఎం అయ్యాను. కాంగ్రెస్ పార్టీలో అందరికీ అవకాశాలు ఉంటాయి. లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకం. భారాసను మొన్న ఎన్నికల్లో ఓడించాం.. పార్లమెంట్ ఎన్నికల్లో తరిమికొడదాం. పులి వస్తుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. పులి వస్తే బోనులో పెట్టి బొందపెడతాం. మోదీ, కేసీఆర్ వేరువేరు కాదు. అభ్యర్థులను మారిస్తే గెలిచే వాళ్లమని భారాస నేతలు అంటున్నారు. మార్చాల్సింది అభ్యర్థులను కాదు.. కేసీఆర్ కుటుంబాన్ని అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు తాను ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'సీఎం పదవి అనేది గుంపు మేస్త్రి పాత్ర వంటిద'ని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎలా విమర్శలొచ్చాయో అందరికీ తెలుసు. ఇప్పటికీ సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తూనే ఉన్నారు. తాజాగా ఈ ట్రోల్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తాను మేస్త్రినే అని, మీరు విధ్వంసం చేసిన తెలంగాణను పునర్నిర్మాణం చేస్తున్న మేస్త్రినంటూ బీఆర్‌ఎస్‌పై రేవంత్ ధ్వజమెత్తారు. మిమ్మల్ని ఘోరీ కట్టే మేస్త్రిని కూడా తానేనంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ నెలలోనే ఇంద్రవల్లి వస్తాను. కాస్కోండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణ సంపదను దోచుకున్న వాళ్లకు కేసీఆర్ రాజ్యసభ సభ్యులను చేశారని.. రూ. 50 వేలు కూడా లేకున్నా 52 వేల మెజార్టీతో గెలుపొందిన మందుల శామ్యూల్‌కి తాము టికెట్ ఇచ్చామని ఆయన చెప్పారు. గతంలో మార్చి వరకు రైతుబంధు ఆపిన సన్నాసులే ఇప్పుడు మాట్లాడుతున్నారు.. కార్యకర్తల కష్టంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. వారి చెమటతో నేను సీఎం అయ్యానని అన్నారు. మా ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు కాలేదు.. వాళ్ల పాలనలో ఏమీ చేయలేని సన్నాసులు.. బిల్లా రంగాలు ప్రభుత్వంపై దుష్ప్రచారాని కి బయల్దేరారు అని రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని గత పాలకులు తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో త్యాగం అంటే గాంధీ ఫ్యామిలీదేనని అన్నారు.. రాజీవ్ వీర మరణం తర్వాత ప్రజలకోసం సోనియాగాంధీ ముందుకు వచ్చారన్నారు. గాంధీ కుటుంబం త్యాగాలు చేసినప్పుడు ప్రధాని మోదీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. దేశంలో పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దేశాన్ని కాపాడటం కోసం ఇందిరాగాంధీ ప్రాణ త్యాగం చేశారన్నారు. ఎన్నో పదవులు సోనియా గాంధీ త్యాగం చేసిందన్నారు. 2004, 2009లో ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా సోనియా గాంధీ పదవి వదులుకున్నారని చెప్పారు. యువతకు కంప్యూటర్లు, 18 యేళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదే అన్నారు. సోనియాగాంధీ,రాహుల్ ను వేధించేందుకే ప్రధాని మోదీ ఈడీ, సీబీఐ కేసులు పెడుతున్నారని ఆరోపించారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీని లోక్ ఎన్నికల్లో గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు వేస్తామని, అందులో అందరికీ అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖర్గే తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

రద్దు చేసింది. హైకోర్టులో కేసు నడిచింది. ఇందుకు బాధ్యులైన వారు జైలు పాలయ్యారు. పలువురు నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే అప్పటి చైర్మన్ జనార్దన్ రెడ్డి, సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని భావించారు. కమిషన్ చైర్మన్ బాధ్యతలను విశ్రాంత ఐపీఎస్‌కు అప్పగించాలని నిర్ణయించారు. ఇందుకోసం చైర్మన్, సభ్యుల నియామకాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. చైర్మన్ పదవి కోసం సుమారు 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. చివరికి మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని ప్రభుత్వం ఖరారు చేసి గవర్నర్ కు పంపింది. ఇవాళ గవర్నర్ తమిళిసై ఆమోద ముద్ర వేసింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామంలోని ఓ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో 1962 డిసెంబర్ 3న జన్మించిన మహేందర్ రెడ్డి 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కిష్టాపురంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలోనే ఆయన బాల్య విద్య సాగింది. రామగుండం ఏఎస్పీగా, నిజామాబాద్, కర్నూలు ఎస్పీగా పనిచేశారు. ఐదేళ్లపాటు ఎన్పీఏలో బాధ్యతలు నిర్వర్తించారు. చంద్రబాబు హయాంలో ఏర్పాటైన సైబరాబాద్ కమిషనరేట్‌కు మొదటి కమిషనర్‌గా విధులు నిర్వహించి అనేక సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత గ్రేహౌండ్స్, పోలీసు కంప్యూటర్స్ విభాగాల్లోనూ పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక హైదరాబాద్ కమిషనర్‌గా నియమితులయ్యారు. స్నేహపూర్వక పోలీసింగ్ పేరుతో అనేక ప్రయోగాలు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్లను ఆధునికీకరించడంలో తనదైన భూమిక పోషించారు. 2017 నవంబర్‌లో తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్ రెడ్డి 2022 డిసెంబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు.



## గాయపడ్డ మైనింగ్ సర్దార్ సమ్మి రెడ్డికి చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ పరామర్శ

(ప్రత్యేక ప్రతినిధి - జనంసాక్షి )

రామగుండం-1 ఏరియాలోని జీడీకే-2 ఇంక్లైన్ లో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డిని సంస్థ చైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ గురువారం రాత్రి 8 గంటలకు పరామర్శించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఆయనకు సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. మొదటగా ఐసీయూలో ఉన్న సమ్మిరెడ్డిని కలిసి త్వరలోనే కోలుకుంటావని మనో ధైర్యాన్ని ఇచ్చారు. అనంతరం వైద్యం అందిస్తున్న డాక్టర్ల బృందంతో మాట్లాడారు. యశోద ఆసుపత్రి ఎండీ జి.ఎస్.రావుతో ఫోన్లో మాట్లాడిన మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఆ తర్వాత సమ్మి రెడ్డి కుటుంబ సభ్యులను కలసి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, ఖర్చుకు వెనకాడకుండా మెరుగైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, అన్ని విధాలుగా అండగా ఉంటామని.. త్వరలోనే సమ్మిరెడ్డి పూర్తిగా కోలుకుంటారని భరోసా ఇచ్చారు. సమ్మి రెడ్డి కి అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని డివైసీఎంవో డాక్టర్ బాలకోటయ్యను ఆదేశించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచిన యాజమాన్యానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. యశోద ఆసుపత్రి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపి కృష్ణ, సింగరేణి డివైసీఎంవో డాక్టర్ బాలకోటయ్య సీఎండీ వెంట ఉన్నారు.సింగరేణి చరిత్ర లో ఇలా ఆసుపత్రికి వెళ్లి కార్మికుడిని పరామర్శించిన సీఎండీ బలరాం ఒక్కడే! కావడం విశేషం!కీప్ ఇట్ అప్ బలరాం సార్!

### రాష్ట్రప్రగతిలో పారిశ్రామిక వేత్తలు భాగంకండి

చెందిందని కొనియాడారు. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. దావోస్ పర్యటనలో మౌలిక వసతులపై కూడా చర్చించామని, సుస్థిరమైన విధానంలో స్థిరాస్తి రంగం అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. విధానపరమైన నిర్ణయాల్లో పారిశ్రామికవేత్తల సహకారం అవసరమని శ్రీధర్ బాబు తెలియజేశారు. అలాగే గత ప్రభుత్వం చేపట్టిన ప్రగతి పనులను కాంగ్రెస్ సర్కార్ నిలిపివేయదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రగతే తమ విజన్ అని చెప్పారు. అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి రాష్ట్రం హైదరాబాద్ వైపు చూస్తున్నదని వెల్లడించారు.

## 420 హామీలు నెరవేర్చేవరకు కాంగ్రెస్‌ను వదలబోం

అంటున్నారు. మరి దీన్ని ఏమంటారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవు అంటున్నారు... మరి సీఎంకు కొత్త క్యాంప్ కార్యాలయం కడుతున్నారు.. అవసరమా? అంటూ ప్రశ్నలు సధించారు. సీఎంలు మారినప్పుడల్లా కొత్త క్యాంప్ కార్యాలయాలు కడతారా అని నిలదీశారు. రైతు భరోసా ఇస్తున్నట్లు రేవంత్ రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని మండిపడ్డారు. అబద్ధం చెప్పిన సీఎం తెలంగాణ రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రేపు కేసీఆర్ పార్లమెంటరీ సమావేశం పెట్టారని.. గాయం తర్వాత కేసీఆర్ మొదటి సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. 27 తెలంగాణ భవన్‌లో మైనార్టీ సెల్ సమావేశం ఉంటుందన్నారు. శనివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్ష సమావేశాలు ఉంట ాయన్నారు. గ్రామ పంచాయితీ భవనాలు ప్రారంభం చేయకుండా ప్రభుత్వం ఆపుతోందని మండిపడ్డారు. సర్పంచ్‌ల మనోభావాలను దెబ్బ తీస్తోందన్నారు .దమ్ముంటే ఎన్నికలు పెట్టాలని లేదంటే ఉన్న సర్పంచ్‌లకు పొడిగింపు ఇవ్వాలన్నారు. 80 శాతం బీఆర్‌ఎస్ సర్పంచ్‌లే ఉన్నారని ప్రభుత్వం దురాలోచనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌల్తాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదాలో కూర్చున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సలహాదారులు ఉండొద్దని గతంలో కోర్టుకు వెళ్లిందే రేవంత్ రెడ్డి అని గుర్తుచేశారు. మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు పెట్టిన చోట విప్ జారీ చేశామని.. విప్ ధిక్కరిస్తే చర్యలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతామని మంత్రులు అంటున్నారు. లేని రైతు భరోసా గురించి మాట్లాడడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. రేవంత్ రెడ్డి 45 రోజుల్లో సాధించింది ఢిల్లీ పర్యటనలు మాత్రమే. తెలంగాణ పరిపాలన ఢిల్లీ నుంచి జరుగుతుంది. సీఎంకు కొత్త క్యాంపు కార్యాలయం ఎందుకో ప్రజలకు చెప్పాలి. ప్రభుత్వాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు అమలు చేసేలా వెంటపడుతాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎంపీ స్థానాల వారిగా నిర్వహించిన సమావేశాలు విజయవంతం అయ్యాయని కేటీఆర్ తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో కార్యకర్తలు మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. త్వరలో 30 వేల మంది సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తాం. స్వల్ప ఓట్ల తేడాతో 14 అసెంబ్లీ స్థానాలను కోల్పోయాం. కాంగ్రెస్ ప్రభుత్వంపై స్వల్ప కాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కాంగ్రెస్ చెప్పిన మాటలను ప్రతిపక్షంగా గుర్తు చేస్తున్నాం. కేసీఆర్‌పై కుట్ర పన్నేందుకు 2 జాతీయ పార్టీలు ఏకమయ్యాయి. అందులో భాగంగానే ఆదానీతో రేవంత్ రెడ్డి జత కట్టారు. ఆదానీ సంస్థలతో ఇప్పుడు ఎలా ఒప్పందాలు చేసుకున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దుబాయ్ జైల్లో మగ్గుతున్న నలుగురు సిరిసిల్ల వాసులు త్వరలో విడుదలవుతారని కేటీఆర్ తెలిపారు. 2009 నుంచి వారి విడుదల కోసం ప్రయత్నిస్తున్నాను. 17 ఏండ్ల తర్వాత నలుగురు సిరిసిల్ల వాసులు వస్తున్నారని చెప్పారు. గజ్వేల్‌లో గెలిచిన కేసీఆర్ ఇప్పటికీ వరకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేదు. కొద్దిరోజుల క్రితం ఫాంహౌస్ బాత్రూమ్‌లో కేసీఆర్ జారి పడటమే అందుకు ప్రధాన కారణం. అనారోగ్యం కారణంగా ఇప్పటి వరకు కేసీఆర్ ఎమ్మెల్యేగా అనారోగ్యం కారణంగా ఇప్పటి వరకు కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేదు. త్వరలోనే కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. అందుకోసం మంచి ముహూర్తం చూసి తేదీ నిర్ణయిస్తారని వెల్లడించారు. త్వరలో కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకార తేదీ ఉంటుందని ప్రకటించారు. అలాగే ఫిబ్రవరి 17న తన బర్త్ డే రోజున కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వస్తారని కేటీఆర్ వెల్లడించారు.ఎంపీలుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పోటీ చేస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్లారిటీ ఇచ్చారు. అదంతా ఫేక్ అని.. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని కేటీఆర్ కొట్టిపారేశారు. తమకైతే ఎంపీగా పోటీ చేసే ఆసక్తి లేదని కుండబద్దలు కొట్టేశారు. కేసీఆర్ పోటీ విషయంపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.

## జోడో న్యాయ్ యాత్రకు స్వల్ప విరామం

పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు రెండు రోజులు తాత్కాలిక విరామం ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గురువారం ఉదయం అస్సాం నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్ జిల్లాలోకి యాత్ర ప్రవేశించింది. ఇక్కడ రోడ్ షో నిర్వహించిన అనంతరం ప్రత్యేక విమానంలో ఆయన దిల్లీకి వెళ్లారు. రెండు రోజుల తర్వాత జనవరి 28 నుంచి యాత్ర తిరిగి ప్రారంభమవుతుందని కాంగ్రెస్ తెలిపింది.ఇండియా కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన నీతీశ్ కుమార్ తిరిగి భాజపా వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భాజపా, జేడీయూ నేతలు ఒకే విమానంలో పట్నా నుంచి దిల్లీకి వెళ్లినట్లు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నీతీశ్‌ను శాంతింపజేసేందుకు ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ఆయన్ను ఫోన్‌లో సంప్రదించినట్లు తెలుస్తోంది. మరోవైపు లాలూ కూడా పార్టీ ముఖ్య నేతలతో అత్యవసరంగా సమావేశమైనట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీంతో కూటమిని నీతీశ్ వీడితే మిగిలిన పార్టీలతో కలిసి అనుసరించాల్సిన కార్యాచరణపై పార్టీ ముఖ్య నేతలతో చర్చించేందుకు రాహుల్ దిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది.

పశ్చిమబెంగాల్‌లోకి రాహుల్ న్యాయయాత్రం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొనసాగిస్తున్న 'భారత్ జోడో న్యాయయాత్ర' గురువారం అస్సాం నుంచి పశ్చిమబెంగాల్‌లోకి ప్రవేశించింది. అయితే, చివరి నిమిషంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముందుగా ప్రతిపాదించినట్లు కాకుండా ఉత్తరాది జిల్లాల మీదుగా యాత్రను త్వరగా ముగించి బిహార్ రాష్ట్రంలోకి వెళ్లేలా మార్గాన్ని మార్చారు. వారం రోజుల్లోగా 'న్యాయయాత్ర' మళ్లీ బెంగాల్‌లోకి ప్రవేశిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. పార్టీకి మంచి పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ నియోజకవర్గాల్లో తరువాత యాత్ర కొనసాగుతుందని సమాచారం. సీపీఐ(ఎం)తో పాటు ఇండియా కూటమిలోను భాగస్వాములుగా ఉన్న ఇతర పార్టీల నేతలు ఈ యాత్రలో పాల్గొన్నారు. కానీ, తృణమూల్ నాయకులు మాత్రం ఎక్కడా కనిపించలేదు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ ఒంటరిగానే పోటీ చేస్తుందని బుధవారం ఆ పార్టీ అధ్యక్షురాలు, సీఎం మమతా బెనర్జీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే న్యాయయాత్ర మార్గంలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

## నేడు కేసీఆర్ అధ్యక్షతన బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నేడు బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుంది. రానున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కేసీఆర్ సమావేశం కానున్నారు. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ వైఖరిపై భేటీలో చర్చించనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగుతున్న చివరి సమావేశాలు కావడంతో కీలక బిల్లులు సహా ఇతర అంశాల్లో పార్టీ అనుసరించబోయే వైఖరి కీలకం కానుంది. ఈ పరిస్థితుల్లో పార్టీ విధానం, సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై ఎంపీలకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.ఈ సమావేశంపై ఆ పార్టీ ఎంపీ రంజిత్ రెడ్డి స్పందించారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ అధినేత కేసీఆర్ శు క్రవారం దిశానిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మధ్యాహ్నం పార్లమెంటరీ పార్టీ సమావేశం ఉందని వెల్లడించారు. ఈ క్రమంలోనే బడ్జెట్‌పై కేంద్రం ఎంత మేరకు సీరియస్‌గా ఉందో చూడాలన్న ఆయన, కేవలం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కే పరిమితం అవుతారా, పూర్తి స్థాయి సమావేశాలు నిర్వహిస్తారా వేచి చూడాలన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్‌ఎస్ ఉందన్న రంజిత్ రెడ్డి, పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను ప్రస్తావిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే తనపై ఎందుకు కేసు పెట్టారో మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డినే అడగాలన్న ఆయన, ఆ తర్వాత తాను స్పంది స్తానని చెప్పారు. 60 ఏళ్ల జీవితంలో ఇప్పటి వరకు తనపై ఒక్క ఎఫ్?ఐఆర్ కూడా నమోదు కాలేదని, తనకు సంస్కారం ఉందని రంజిత్ రెడ్డి వ్యాఖ్యానిం చారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నేడు మధ్యాహ్నం పార్లమెంటరీ పార్టీ సమావేశం ఉంది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. బడ్జెట్‌పై కేంద్రం ఎంత మేరకు సీరియస్‌గా ఉందో చూ డాలి. కేవలం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కే పరిమితం అవుతారా, పూర్తి స్థాయి సమావేశాలు నిర్వహిస్తారా వేచి చూడాలి. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్‌ఎస్ ఉంది. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను ప్రస్తావిస్తామని జి.రంజిత్ రెడ్డి, తెలిపారు.

## ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పట్ల
## పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో సంబరాలు





**హనుమకొండ, జనవరి 25 (జనంసాక్షి) :** పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ ఆధ్వర్యంలో కేయూ క్రాస్ రోడ్డులో ఉద్యమ నేత ఆచార్య కోదండరాంకు ఎమ్మెల్సీ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ బాణాసంచా పేల్చి, స్వీట్ల పంపిణీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ సందర్భంగా డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ శాంతి దూత ఆచార్య కోదండరాంకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవిని నామినేటెడ్ చేయడం పట్ల చాలా సంతోషం వ్యక్తం చేసి మేధావులైనటువంటి కోదండరాం లాంటి వారిని, అదే విధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించినటువంటి ఎందరో మేధావులకు ఈ రకంగా వారికి సముచిత స్థానాన్ని కల్పించడం తెలంగాణ అమరవీరుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతూ ఉండడం చాలా శుభసూచకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి పెద్ద ఎత్తున కేయూ క్రాస్ రోడ్డులో బాణాసంచా పేల్చి స్వీట్ల పంపిణీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ మంద వీరస్వామి, పూలే ఆశయ సాధన సమితి నాయకులు డాక్టర్ నల్లని శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, అప్పని సతీష్, బోళ్ళ వీరప్రతాప్, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ నాగేశ్వర్ రావు, తాళ్ల పెల్లి నరేష్, గుండేటి సుమన్, డాక్టర్ వి.శివ నాగయ్య,ఆర్. రామమూర్తి, నీలం ప్రనూప్, సురేష్ నాయక్, సింగతి వెంకటేష్, శివకృష్ణ,ప్రభాకర్, వినయ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# సంతలో అంతా కల్తీమయం

- అనారోగ్యాలన పాలవుతున్న జనం
- మామూళ్ల మత్తులో ఫుడ్ సేఫ్టీ అధికారులు



**మర్పల్లి, జనవరి 25 (జనం సాక్షి) :** మర్పల్లి మండల కేంద్రంలో కల్తీ ఫుడ్‌తో జనం అనారోగ్యాలన పాలవుతున్న సంబంధిత అధికారులు మాత్ర అసలు పట్టించుకోవడంలేదు. మండలంలో ఫుడ్ ఇన్ స్పెక్టర్ల తనిఖీలు నామ్ కే వాస్తేగా జరుగుతున్నాయి. దీంతో ఎక్కడ చూసిన ఫుడ్ కల్తీమయమవుతుంది. కిరాణా దుకాణాలు మొదలుకొని హెూటల్స్, స్వీట్ షాపులు, బేకరీల్లో క్వాలిటీ లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. కల్తీని అరికట్టేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అవసరమున్నప్పటికీ సంబంధిత అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోవడంలేదు. ఇష్టానుసారంగా తనిఖీలు జరిపి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తనిఖీలు నిర్వహించేందుకు ఫుడ్ ఇన్ స్పెక్టర్లు వస్తున్నప్పటికీ సంబంధిత వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. వ్యాపారస్తుల నుంచి అధికారులకు నెలనెల మాముళ్లు అందుతుండటంతోనే తనిఖీలు నామమాత్రంగా చేస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. మండలంలో కల్తీ ఆహారం తిని ఎంతోమంది ఆస్పత్రుల పాలవుతున్నారు. మండలకేంద్రంలో జరిగే వారంతపు మార్కెట్లో కల్తీ నూనె, పప్పు, ఉప్పు తో పలు నకిలీ వస్తువులు విక్రయించినప్పటికీ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కల్తీ వస్తువులను అరికట్టి ప్రజలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా అధికారులకు ఎలా ఫిర్యాదులు చేయాలనేది కూడా అక్కడక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలని అంటున్నారు.

# జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

హైదరాబాద్ లోని ప్రభుత్వ సిటీ కళాశాల, సామాజిక శాస్త్రాల కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి గా ఆచార్య వాయునందన రావు పూర్వ ఉపకులపతి ఆచార్య మోహన్ రావు ప్రముఖ విద్యావేత్త, విశిష్ట అతిథిగా ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు మరియు రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆ తర్వాత అదే కాలేజీలో చదివిన విద్యార్థిగా అక్కడే చదువుకున్నాడు కాబట్టి ఆ విశ్వాసంతో ఉప్పల శ్రీనివాస్ గుప్త తన వంతు సహాయంగా తాను చదువుకున్న కాలేజీ కి సహాయం చేయాలని సదుద్దేశంతో ఫ్లోరింగ్ మ్యాట్‌ని ఉచితంగా అందజేయడం జరిగింది. ఈ సదస్సుకు సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య.పి.బాల భాస్కర్ అధ్యక్షత వహించారు. తదుపరి ఈ సందర్భంగా సిటీ కాలేజ్ యాజమాన్యం వారిని శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. తదనంతరం ఈ సందర్భంగా శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత పాత్ర కీలకం,డబ్బుకు లొంగకుండా నిజాయితీగా పని చేసేవాళ్ళను, మంచి గుణగణాలను, పాలనా దక్షతను అభివృద్ధి ని చూసి ఓటు వేయాలని ఓటరు లను చైతన్య వంతం చేయడానికి సోషల్ మీడియాను పదునైన ఆయుధంగా ఉపయోగించుకోవాలి.సర్పంచ్ దగ్గర నుండి ప్రధాన మంత్రి వరకు మంచి నాయకులను గెలిపించు కుంటే ప్రజలకు మేలు



జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో డా. శంకర్, డా. కృష్ణ వేణి, డా.భాస్కర్, కళాశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణా తరగతులు ప్రారంభం**

దిల్సుఖ్ నగర్ లో ఉన్నటువంటి లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్లో శ్రీ సత్య సాయి ధ్యాన మండలి పూజ్య శ్రీ బిక్షమయ్య గురూజీ చే నిర్వహించబడుతున్నటువంటి ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి ఈ శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆత్మీయ అతిథులుగా ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ విశిష్ట అతిథిగా డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ యోగ సాధన ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని తను అతి చిన్న వయసు నుంచే ప్రతిరోజు యోగ సాధనను కొనసాగించడం వల్ల ఆరోగ్యంగా జీవిస్తున్నానని తెలియజేశారు శ్రీ సత్య సాయి ధ్యాన మండలి పూజ్య శ్రీ బిక్షమయ్య గురూజీ 20 సంవత్సరాలుగా చేస్తున్నటువంటి సేవలు వెలకట్టలేవని ప్రతి ఒక్కరూ ఈ అంతర్ముఖ యోగ శిక్షణలో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక రంగంలో భిక్షమయ్య గురూజీ వెంట నడుస్తూ ఎంతో జ్ఞానాన్ని సంపాదించామని ఆ జ్ఞానం ద్వారానే సర్వసాధారణమైనటువంటి జీవితాన్ని గడుపుతున్నామని తెలిపారు. డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ దిల్సుఖ్ నగర్ నందు ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహించడానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసి కొన్ని వేల మందిని గురూజీ ఇక్కడ తీర్చిదిద్దినందుకు చాలా సంతోషంగా ఉందని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ అంతర్ముఖ యోగ శిక్షణా తరగతులు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కోఆర్డినేటర్ శ్రీ ఇస్మాయిల్ గురూజీ తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రముఖులతో పాటుగా జాగృతి అభ్యుదయ సంఘం భావన శ్రీనివాస్ వేణుమాధవ్ రామచంద్రరావు సంపత్ గురూజీ మధుమాల మాతాజీ తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీ అధ్యాపక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** ఇటీవలే కేబినెట్ ర్యాంక్‌తో కూడిన పదవి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ లీడర్ షబ్బీర్ అలీని ప్రభుత్వ మైనార్టీ అధ్యాపక సంం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సయ్యద్ జబీ తదితర సభ్యుతో కలిసి శుభాకాంక్షు తెలిపారు. ఈ సందర్భంఆ సంఘం క్యాఎండర్‌ను షబ్బీర్ అలీ ఆవిష్కరించారు.

## పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 25 (జనం సాక్షి) :** ఫిబ్రవరి లో జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించుటకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 7650, ఒకేషనల్ విద్యార్థులు 1500 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 8034 కాగా ఒకేషనల్ విద్యార్థులు 1110 మంది పరీక్షలకు హాజరగుచున్నారని అన్నారు. ఫిబ్రవరి 1 నుండి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు రెండు సెషన్స్ లలో ఉదయం, మధ్యాన్నం జరుగుతాయని అన్నారు. 16 న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్,19న ఎన్విరాన్మెంట్ పరీక్షలు జరుగుతాయన్నారు. అదేవిధంగా థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి మార్చ్ 14 వరకు జరుగవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద లలో 50 కేంద్రాలలో నిర్వహించనున్నామని అన్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షల కొరకు సమయానుకూలంగా బస్సులు నడపాలని, విద్యుత్ లో అంతరాయం కలగకుండా చూడాలని, పరీక్ష పత్రాలు, జవాబు పత్రాల రవాణాలో పోలిసు భద్రత కల్పించాలని, ప్రథమ చికిత్సకు తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమవేశంలో ఎస్పీ సింధు శర్మ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్ సలాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎంఐఎం కృషి

- బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పణ
- సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



**కరీంనగర్, జనవరి 25 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2024 గైడ్స్ ను కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుదినవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 20 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరఫున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగరంలో ఎంఐఎం పార్టీ నగర శాఖ కలిసికట్టుగా నగరవ్యాప్తంగా అనేకమైనటువంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం దారుస్సలాం వేదికగా ప్రజా సమస్యల ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి దారి చూపడం అభినందనీయమన్నారు ఎంఐఎం పార్టీ కరీంనగర్ నగర శాఖ చేస్తున్న ప్రజా సేవల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొనసాగించడానికి బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషి చేస్తున్నారన్నారు. ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలని సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 30 పాఠశాలలను స్థాపించి, 30 వేల మంది విద్యార్థులకు ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత చెడు వ్యసనాలను మాని ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ మాట్లాడుతూ సాలరే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జిహెచ్ఎంసి నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఖైరుద్దీన్, సదర్ ఖాజీ మొఖయ్యార్ షాఖాన్, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, ముఫ్తి యూసుఫ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు హాఫిజ్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్, ఆతిన, ఖాజా, కోశాధికారి ఇబ్రహీం, కార్పొరేటర్ అఖీల్ ఫిరోజ్, నాయకులు అలిబాబా, అజర్ దబీర్, టూట అధ్యక్షుడు ముత్తహరుద్దీన్, కార్యదర్శి అబ్దుల్ మాజీద్, సీనియర్ సిటిజన్ నసీముద్దీన్, సర్వర్ షా బియబాని తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండ సురేఖ



**వరంగల్ ఈస్ట్, జనవరి 25 (జనం సాక్షి) :** గణతంత్ర దినోత్సవం (జనవరి 26) సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో వీరుల పోరాట ఫలితంగా సాధించుకున్న స్వరాజ్యానికి, రాజ్యాంగం అమలు ద్వారా దశ దిశ చేకూరి దేశం అఖండ శక్తిగా పురోగమించిందని మంత్రి అన్నారు. నాడు బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించడమే లక్ష్యంగా పోరాడిన కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు యావత్ దేశం 'పూర్ణ స్వరాజ్' దినోత్సవంగా పాటించిన 1930 జనవరి 26 తేదీ గుర్తుగా, 1950 నుంచి ప్రతి ఏటా జనవరీ 26న గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ తో పాటు, రాజ్యాంగ కూర్పులో భాగస్వాములైన ఇతర సభ్యుల సేవలను మంత్రి స్మరించుకున్నారు. భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ సాంఘిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని అందించడానికి కాంగ్రెస్ పార్టీ అవిరళ కృషి చేస్తున్నదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛను సంరక్షిస్తూ, అన్ని వర్గాలకు సమాన అవకాశాలను కల్పిస్తూ, జాతీయ సమైక్యత సంరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. ఆత్మగౌరవ పోరాటాలకు మారుపేరుగా నిలిచే తెలంగాణ బిడ్డలు 'గణతంత్ర' స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, నియంతృత్వ ప్రభుత్వాన్ని కూల్చి, ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని ఆకలింపు చేసుకొని, రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవడంతో పాటు, దేశ ప్రగతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు అట్టడుగు వర్గాలకు చేరే వరకు కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కోసం ఇన్చార్జిల నియామకం



**వరంగల్ ప్రతినిధి, జనవరి 25 (జనం సాక్షి) :** రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో నూతన ఓటరు నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ఓటర్ నమోదు ప్రక్రియను చేపట్టడానికి దుగ్గొండి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల నమోదు ఇంచార్జిగా ఎన్ఆర్ఐ ప్రతినిధి శానబోయిన రాజ్ కుమార్, యాదగిరి సుధాకర్లను నియమించినట్లు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలు ఆయన తెలిపారు 2020 నవంబర్ లోపు డిగ్రీ పాసైన ప్రతీ ఒక్కరూ ఓటును తప్పనిసరిగా నమోదు చేయించి వారిని చైతన్య పరచాలని అర్హులైన ప్రతి ఒక్క ఓటరును ఓటర్ల జాబితాలో చేర్చడానికి కృషి చేయాలన్నారు. గతంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ మరల కొత్తగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఓటు నమోదుకు చివరి ఫిబ్రవరి ఆరో తేదీ వరకు నమోదు చేయించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుల పర్యవేక్షణలో ఓటర్ నమోదు కార్యక్రమం ప్రతీ గ్రామంలో విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రకటించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
26 జనవరి 2024

# కూటమిలో కుంపట్లు



**సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలు ఎవరి దారి అవి చూస్తుకుంటున్నాయి. ఇప్పటికే ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీపార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయి. తాజాగా లోక్‌సభ ఎన్నికలకు ఒంటరిగానే వెళ్తామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. బెంగాల్‌లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని, ఫలితాల అనంతరమే పొత్తుపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. మమతా ఒంటరిగానే వెళ్తామని ప్రకటించిన కొద్దిసేపటికే పంజాబ్‌లో ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తామని ఆ రాష్ట్ర సీఎం భగవంత్‌మాన్ వెల్లడించారు. పంజాబ్‌లోని 13 నియోజకవర్గాల్లోనూ ఆప్ బరిలోకి దిగుతుందన్నారు. దీనికోసం 40 మంది అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేశాం. సర్వే చేసిన తర్వాత అభ్యర్థులను ఖరారు చేస్తామన్నారు.**

ఆప్ పంజాబ్‌లో ఒంటరిగానే పోటీ చేయడానికి సిద్ధపడింది అంటే ఢిల్లీలోనూ ఆపార్టీ అదే విధానాన్ని అనుసరిస్తుంది. ఎందుకంటే ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు తెలియకుండా భగవంత్‌మాన్ ఆ ప్రకటన చేయలేరు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలతో కాంగ్రెస్ పార్టీ సంప్రదింపులు చేస్తున్నది. అయితే మమతా బెనర్జీ మొదటి నుంచి ఒకటే ప్రతిపాదన చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ 300 స్థానాల్లోనే పోటీ చేయాలని, బెంగాల్‌లో తనకు, పంజాబ్, ఢిల్లీలో కేజ్రీవాల్ కు, యూపీలో అఖిలేశ్‌కు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ క్రమంలో బెంగాలోని 42 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్లు మాత్రమే ఇవ్వాలని టీఎంసీ భావించింది. దీనికి కాంగ్రెస్ పార్టీ నిరాకరించింది. అలాగే ఈ విషయంపైనే కాంగ్రెస్, టీఎంసీల మధ్య మాటల యుద్ధం జరుగుతున్నది. ఈ వివాదం కొనసాగుతున్న సమయంలోనే ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదర్ 'ఆమె అవకాశవాది అని, మమతా సహాయంతో మేము ఎన్నికల్లో పోటీ చేయం . సొంతంగా పోటీ చేయడం ఏమిటో మా పార్టీకి తెలుసు. కాంగ్రెస్ పార్టీ సహకారంతోనే మమతా అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తించుకోవాలి' అని మమతా బెనర్జీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అధీర్ వ్యాఖ్యలను రాహుల్ గాంధీ తప్పుపట్టారు. 'మమత తనకు అత్యంత ఆత్మీయురాలని, మా వాళ్లు కొన్నిసార్లు ఏదోఏదో మాట్లాడుతుంటారు. వాటిని పట్టించుకోవాల్సిన పనిలేదని' సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అధీర్ రంజన్ మమతా బెనర్జీపై వ్యాఖ్యలు చేయడం ఇవ్వాల కొత్తకాదు. కొంతకాలంగా విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆయనను కట్టడి చేయలేదు. ఫలితంగా పరిస్థితి ఇక్కడి దాకా వచ్చింది. ఇప్పుడు మమత లేకుండా ఇండియా కూటమిని ఊహించలేని ఆ పార్టీ అంటున్నది. కానీ ఎస్పీ, టీఎంసీ, ఆప్‌లు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వంతో సఖ్యతతోనే ఉంటున్నా ఆయా రాష్ట్రాల కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుల వ్యవహారశైలి వల్ల ఆ పార్టీలు కాంగ్రెస్‌కు దూరంగా జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోనూ కమల్‌నాథ్ వ్యవహారశైలి వల్లనే ఎస్పీ, కాంగ్రెస్ పొత్తు కుదరలేదు. ఈ విషయాన్ని రాహుల్ గాంధే పరోక్షంగా ప్రస్తావించారు.

కేంద్రంలో బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్ అధిష్ఠానం కూటమిలోని భాగస్వాములతో సీట్ల సర్దుబాటుపై సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నది. సాధ్యమైనంత వరకు ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నచోట సీట్ల త్యాగం చేయడానికి సిద్ధపడుతున్నది. కానీ ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వాల దూకుడు చర్యల వల్ల పొత్తులకు విఘాతం కలుగుతున్నది. బీజేపీ కోరుకుంటున్నట్టే కొంతమంది కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారు. ఇండియా కూటమిలో విభేదాలకు ప్రాంతీయ పార్టీల కారణం ఎంతున్నదో అంతకంటే ఎక్కువగా కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతల వ్యాఖ్యలే కారణమన్నది ఇటీవల జరుగుతున్న పరిణామాలను బట్టి తెలుస్తోంది. నిజానికి బీజేపీ నేరుగా ఎదుర్కొని అధికారంలోకి రాగలిగే సత్తా కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికైతే లేదు. ఎందుకంటే యూపీ, బెంగాల్, పంజాబ్, ఢిల్లీ, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీలు, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాల్లో వామపక్షాలు బలంగా ఉన్నాయి. అక్కడ బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను కలుపుకుని వెళ్లకుండా ఒంటరిగా పోటీ చేస్తే త్రిముఖ పోరులో అంతిమంగా కాషాయపార్టీ లబ్ధి పొందుతున్నదని గత రెండు సార్వత్రిక ఎన్నికల సందర్భంలోనే కాదు, అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ తేలింది. ఇండియా కూటమి ఛైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేనే ఎన్నుకున్నాయి. దీంతో కూటమిలో విభేదాలు పరిష్కరించడం, సీట్ల సర్దుబాటుపై ఆపార్టీ పైనే ఎక్కువ బాధ్యత ఉన్నది. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీలోని నాయకులు ఏది పడితే అది మాట్లాడటం వల్ల కూటమి లోని పార్టీలో ఒక్కొక్కటిగా సొంతంగా పోటీ చేయడానికి సిద్ధపడుతున్నాయి. ఇప్పటికే ఎస్పీ, ఆర్ఎల్‌డీ, టీఎంసీ, ఆప్‌లు నిర్ణయానికి వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ నాటికి కూటమిలో విభేదాలు పరిష్కరించుకుని, సీట్ల సర్దుబాటుపై అన్నిపార్టీలు ఒక అభిప్రాయానికి రావాలి. దానికి కాంగ్రెస్ పార్టీనే కృషి చేయాలి. అప్పుడే బీజేపీని నిలువరించడం సాధ్యమౌతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా కూటమిలోని పార్టీలు ఒంటరిగా వెళ్తే నష్టం జరుగుతుందని అంటున్నారు.



**ఆసరి రాజు**
సీనియర్ జర్నలిస్ట్

# జారిపడింది! ఇగ లేసుడు కష్టమే!



బిఆర్ఎస్ పార్టీ జారిపడింది.ఇక లేచి మనుగడ సాధించడం కష్టంగానే కనిపిస్తుంది. ఏ కోణం నుంచి చూసినా అధికారం తమకే స్వంతం, శాశ్వితం అనుకున్న ఆ పార్టీ నేతలకు వారి మాటలు చూస్తుంటే, చింత చచ్చినా అనే చందాన, ఇంకా దింపుడు కల్లం ఆశలు చావనట్లు కనిపిస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రం లో ఏ మూల నుంచి చూసినా బిఆర్ఎస్ కు భవిష్యత్తు కనిపించడం లేదు.పది ఏండ్లు తెలంగాణ లో పాలన చేసిన మాజీ సీఎం కేసీఆర్ పట్ల జనం లో వచ్చిన వ్యతిరేకత ఇంతా, అంతా కాదు.ఉద్యమం సందర్భంగా, ఆ తర్వాత కెసిఆర్ ను నెత్తినెక్కించుకున్న జనం పది ఏండ్ల తర్వాత ఆయనను నేలకేసి కొట్టిన తీరు లో ఒక ఆత్మభిమానం దాగి ఉన్నది. నిరంకుశత్వ పాలన పై దిక్కారం కనిపించింది.బిఆర్ఎస్ ను ఓడించి కాంగ్రెస్ పార్టీ ని తెలంగాణ ఓటర్లు గెలిపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రభుత్వం పట్ల జనం లో ఆదరణ, అభిమానం పెరిగింది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో బిఆర్ఎస్ కు మంచి రోజులు వచ్చే పరిస్థితి ఉన్నదా? అంటే ఎక్కడ కూడ ఆ పరిస్థితి కనిపించడం లేదు.పార్టీ కి ఇప్పటి నుంచే కష్టాలు మొదలు అయిపోయాయి. మున్సిపాలిటీ లలో బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోనికి జంప్ జిలానీలు వెళ్లి పోతున్నారు. వలసలు స్పీడుగా కొనసాగుతున్నాయి. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు బిఆర్ఎస్ లో ఉండడానికి ససేమిరా అంటున్నారు.అవిశ్వాస తీర్మాణాలు విజయ వంతం అవుతున్నాయి. బిఆరెస్ కుప్ప కూలే పరిస్థితి వచ్చేసింది. టిఆర్ఎస్ ను బిఆర్ఎస్ గా మార్చడం, జాతీ య స్థాయిలో పార్టీ ని విస్తరించే కేసీఆర్ నిర్ణయం లాంటివి కూడ ఒక రకంగా నిర్మాణం లేని పార్టీ ఉట్టికి ఎగిరినట్లు అయ్యింది. కెసిఆర్ తన పాలనలో సమిష్టి నిర్ణయం కోసం కనీసం ప్రయత్నం చేయలేదు. తన వ్యక్తిగత అభిప్రాయం నే ఆయన అమలు చేస్తూ వచ్చారు. క్యా బినెట్ లో నిర్ణయం అయినా, ఆయన నిర్ణయమే అంటే అతిషయోక్తి కాదు. ప్రముఖ నటుడు కమల హాసన్ చాలా కలలు కంటాడు అంటారు,కలపడితే చాలు దానిని కథగా మలిచి ఒక సినిమా తీస్తాడు, అంటారు. మన మాజీ సీఎం కెసిఆర్ కూడ కొన్ని పథకాలు అలాగే అమలు చేశారు అంటారు. ఇందులోనే ఆయన సక్సెస్ కం ఫెయిల్యూర్ దాగి ఉంది అంటారు. ఈ రెండింటి నడుమ అహం, గర్వం, జనం ను కలువక పోవడం, ప్రజల్లోకి కేవలం ఎన్నికల నాడే వెళ్లడం, అవే ముచ్చటలు చెప్పుడు, వచ్చుడు, ఎమ్మెల్యే లకు, మంత్రులకు సైతం కనీసం ఏదైనా విషయం చెప్పడానికి ఇంటర్వ్యూ ఇవ్వక పోవడం, లాంటివి వెరసి ఓటమికి కారణంగా పేర్కొనవచ్చు. ఓడిన తర్వాత కూడ మాజీ మంత్రి కేటీఆర్ లాంటి వారి అహం మాటలు, హామీలు నెరవేర్చక పోతే బట్టలు ఊడదీసి కొడుతాదట, ఇవేం మాటలు? ఇంత అసహనం ఎందుకు? విపక్షం మర్యాదలు కాపాడే మాటలేనా? ఇవి!బిఆర్ఎస్ సమీక్ష సమావేశాల్లో ఎందుకు తాము అసెంబ్లీ ఎన్నికల్లో వోడారో, జనం లో పచ్చి పులుసు పరిస్థితి ఎందుకు వచ్చింది? అనేది గుర్తించకుండా, బిఆర్ఎస్ కన్నా అద్భుతంగా పని చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద అర్థం, పర్థం లేని, పూర్తి ఓర్వలేని తనం వాసన తో కూడిన ఆరోపణలు, విమర్శలు చూసి జనం నవ్వుకునే పరిస్థితి ఉన్నది అంటే అతిషయోక్తి కాదు. నేల మీది నిజం ను ఏమాత్రం అంగీకరించని, అంగీకరించే ధైర్యం లేని పిరికి తనం ను ఏమనాలి?కాంగ్రెస్ ప్రభుత్వం పడి పోతుందని, వాళ్లలో వాళ్ళు కాంగ్రెస్ లో కొట్లాడుకుంటారని, మళ్ళీ కెసిఆర్ సీఎం అవుతారని కేటీఆర్ మాట్లాడడం ను ఏమం టాము? ఇంత అసహనం దేనికి? ఎందుకోసం? నలుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యే లు సీఎం రేవంత్ రెడ్డి ని వెళ్లి కలిస్తేనే ఝులక్ తింటున్నారు. రేపు పార్లమెంట్ ఎన్నికలు అయ్యాక ఎంత మంది బిఆర్ఎస్ లో మిగిలి ఉంటారో చూసుకోండి, అనాలని అనిపిస్తున్నది. అంచనాలు, ఆలోచనలు ఎప్పుడు ఇతరులకు సంబంధించి వాస్తవానికి దగ్గరగా ఉండకుంటే ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ఇతర మనుషుల పట్ల ఏమాత్రం గౌరవం లేని అధినేతల కుటుంబ పార్టీ బిఆర్ఎస్!

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక వాదం పట్ల గౌరవం లేని మాజీ సీఎం కెసిఆర్ కు అటు కేంద్రంలో పీఎం నరేంద్ర మోడీకి, వాళ్ళ ముచ్చట్లు, మాటలకు, ఆచరణకు, మరీ ముఖ్యంగా వ్యక్తి గత తానా షాహీ గిరి కి చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల లో బిఆర్ఎస్ పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ మనుగడ కష్టంగానే నేల మీద చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. అనవసరంగా ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల మీద నోరు పా రేసుకోవడం మాని, బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి మీద దృష్టి సారిస్తే మంచిదేమో!అప్పుడు మీ పాలన లోని అంతర్గత ప్రజాస్వామ్యం, ఇప్పటి పాలన లో ప్రజాస్వామ్యం ను ఒక్కసారి కాస్త మానవీయ దృష్టి తో చూస్తే నిజం అర్థం అవుతుంది. నిజం చెప్పాలంటే చాలా మంది మేధావి, విద్యార్థి, యువత, కార్మిక, రైతు, కూలీల, మహిళల దృష్టిలో ఇప్పుడే తెలంగాణ వచ్చింది అనే చర్చ ఉంది. ఒక సంతోషం, సంతృప్తి ఉంది. బిఆర్ఎస్ పదేండ్ల పాలన అంతా ఒక నిరంకుశ,ఒక పీడ కల గా టాక్ ఉంది. ఇదీ గ్రౌండ్ రియాలిటీ, ఈ నిజాన్ని అర్థం చేసుకోండి! ప్రస్తుతం జనంలో బిఆర్ఎస్ పట్ల ఏమాత్రం ఆదరణ లేదు! అధికారం లో ఉంటేనే, పార్టీ ల కు మనుగడ అనుకునే బిఆర్ఎస్ లాంటి పార్టీ లకు చివరికి శేషమే మిగులుతుంది!



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

# ప్రజలే ప్రభుత్వం.. ప్రజాస్వామ్యమే గణతంత్రం

**భారతదేశ చరిత్రలో భారతీయులందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అతి ముఖ్యమైన రోజు జనవరి 26, 1950వ సంవత్సరం. దాదాపు 200 ఏండ్లు బ్రిటిష్ పరిపాలనలో ఉన్న మన దేశానికి ఎందరో మహానుభావుల త్యాగాలు, కృషి ఫలితంగా ఆగస్టు 15, 1947న స్వాతంత్రం వచ్చింది. అప్పటివరకు మన దేశ పరిపాలన విధానం పూర్తిగా బ్రిటిష్ రాజ్యాంగం ప్రకారం జరిగింది. వారిని మన దేశం నుండి వెళ్లగొట్టిన తర్వాత మన దేశాన్ని మనం పరిపాలించుకునేందుకు ఒక రాజ్యాంగాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మన దేశానికి రాజ్యాంగం తయారు చేయడానికి 1947 ఆగస్టు 29న రాజ్యసభ మేధావులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 284 మంది సభ్యులుగా ఒక కమిటీని వేయడం జరిగింది. దీనినే రాజ్యాంగ పరిషత్ అంటారు లిఖిత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయడానికి కమిటీకి అధ్యక్షులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సభ్యులుగా అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్, కె ఎం మున్షి, బి ఎల్ మిట్టల్, ఎస్ గోపాల స్వామి, ఎండి సాదుల్లా, టి టి కృష్ణమాచారి, పండిత్ గోవింద్ వల్లబ్ పంత్ లను నియమించారు.**



అంబేద్కర్ ఆధ్వర్యంలో కమిటీ అహర్నిశలు శ్రమించి ఒక లిఖిత రాజ్యాంగ ప్రతిని తయారుచేసి 1947 నవంబర్ 4 తేదీన అసెంబ్లీకి సమర్పించారు. 166 రోజులపాటు సామాన్య పౌరులు కూడా పాలుపంచుకోవడానికి వీలు కల్పించి, అసెంబ్లీ సమావేశాలలో భారత రాజ్యాంగ లిఖిత ప్రతి పై ఎన్నో సుదీర్ఘమైన చర్చోప చర్చలతో సవివరమైన సవరణలు ప్రతిపాదించి మార్పులు, చేర్పులు చేశారు. అనంతరం ఆంగ్ల భాషలో, హిందీ భాషలో రాసిన రెండు లిఖిత రాజ్యాంగ ప్రతుల మీద 1950 జనవరి 24వ తేదీన 284 మంది అసెంబ్లీ సభ్యులు తమ సంతకాలు చేశారు. ఒక దేశపు రాజ్యాంగ అమలు ప్రారంభమైన రోజున ఆ దేశం గణతంత్ర దేశంగా ప్రకటించుకుని, జరుపుకునే దినోత్సవమే గణతంత్ర దినోత్సవం.

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం. దీనిలో ఎన్నో దేశాల మేలైన లక్షణాలు కలవు. ఒక్కో దేశ రాజ్యాంగం నుండి ఒక విధానం చొప్పున 10 దేశాలలో విజయవంతమైన వాటిని స్ఫూర్తిగా తీసుకున్నారు. బ్రిటన్ నుండి పార్లమెంటరీ ప్రభుత్వం, చట్టాల రూపకల్పన ప్రక్రియ , ఏక పౌరసత్వం, మంత్రిమండలి వ్యవస్థ, పార్లమెంటరీ అధికారాలు, ద్వి సభల విధానం, స్పీకర్ వ్యవస్థ ఆదేశ సూత్రాలు, రాష్ట్రపతి ఎంపిక విధానం మొదలగునవి. ఐర్లాండ్ నుండి రాజ్యసభకు సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేసే విధానం. అమెరికా నుండి రాష్ట్రపతి ఉపరాష్ట్రపతి కార్యకలాపాలు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపు, ప్రాథమిక హక్కులు, న్యాయవ్యవస్థ, స్వేచ్ఛ రాజ్యాంగ ప్రవేశిక స్వీకరించారు. కెనడా నుండి శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వ సమాఖ్య వ్యవస్థ , కేంద్రం రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ, కేంద్రానికి విశిష్ట అధికారాలు, గవర్నర్ల నియామకం. ఆస్ట్రేలియా నుండి ఉమ్మడి జాబితా అంశం, ఉభయ సభల సంయుక్త సమావేశం, దేశంలోని రాష్ట్రాల మధ్య స్వేచ్ఛ వాణిజ్యం. రష్యా నుండి ప్రాథమిక విధులు, పంచవర్ష ప్రణాళిక విధానం. ఫ్రాన్స్ నుండి రిపబ్లిక్ సమానత్వం, స్వేచ్ఛ సౌభ్రాతృత్వ భావనలు. జర్మనీ నుండి అత్యవసర పరిస్థితులలో ప్రాథమిక హక్కుల రద్దు, ఆ సమయంలో కేంద్రానికి అదనపు అధికారాలు. దక్షిణాఫ్రికా నుండి రాజ్యసభ ఎన్నిక, రాజ్యాంగ సవరణలు. జపాన్ నుండి న్యాయ సూత్రాలను స్వీకరించాము. మారుతున్న పరిస్థితులతో పాటు ఎదురవుతున్న సవాళ్లు, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగం లోని మౌలిక సూత్రాలకు భంగం కలుగకుండా వివిధ లక్ష్యాలతో రాజ్యాంగాన్ని ఇప్పటివరకు సవరిస్తున్నారు.

మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన 26 జనవరి 1950 ను గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ప్రజాస్వామ్యానికి మూల గ్రంథం లాంటిది రాజ్యాంగం. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వమే ప్రజాస్వామ్యం. గణతంత్ర రాజ్యం అంటే ప్రజలే ప్రభుత్వం, ప్రభుత్వమే ప్రజలు అని అర్థం. డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ మొట్టమొదటి రాష్ట్రపతిగా, జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో భారతదేశం పూర్తి గణతంత్ర దేశం అయింది. ఆ రోజు నుండి భారతదేశం సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ అవతరింపబడింది. అప్పటినుండి ఇప్పటివరకు మనం జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం లో జరుపుకుంటున్నాము. మన దేశ రాజధాని ఢిల్లీలో భారత రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఈ గణతంత్ర వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. అదే విధంగా రాష్ట్ర రాజధానుల్లోనూ వివిధ కార్యక్ర మాలను నిర్వహిస్తారు. మనమందరం కూడా రాజ్యాంగ అమలు దినోత్సవ వేడుకలలో పాల్గొని రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం.



**వేదాంతం హరికుమార్**
హనుమకొండ

# కోదండరాంకు సముచిత గౌరవం!





తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన,జేఏసీ ఛైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం సార్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం ద్వారా తెలంగాణ సమాజాన్ని కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి గౌరవించినట్లు నట్లు అయ్యింది. కోదండరాం తో పాటు సియాసత్ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీ ఖాన్ ను కూడ ఎమ్మెల్సీ గా నియమించారు.ఈ ఇద్దరిని గవర్నర్ కోటాలో ప్రభుత్వం సిఫార్సు మేరకు నియమించడం సంతోషం గా ఉంది.తెలంగాణ అంతటా కోదండరాం ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేశారు. ప్రభుత్వం లో మంత్రి వర్గం లో కూడ కోదండరాం కు సముచిత స్థానం ఇవ్వనున్నారని తెలుస్తున్నది. కోదండరాం కు విద్యా శాఖ మంత్రిగా అవకాశం ఇచ్చే అవకాశం మెండుగా ఉన్నది. నిజానికి కోదండరాం కాంగ్రెస్ పార్టీ కి మద్దతు ఇవ్వడం వల్ల ఆ పార్టీ కి చాలా ప్రయోజనం జరిగింది. ఒక రకంగా చెప్పాలంటే టిజెఎస్ అధ్యక్షులు గా ఉన్న కోదండరాం వల్లనే బిఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలు అయ్యిందనే వాదన ఉంది. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను గత రెండు ఏండ్లుగా కోదండరాం తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు.ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సదస్సులు, ఆందోళనల ఫలితమే ప్రస్తుతం ప్రజలు కోరుకున్న మార్పు, అనకు తప్పదు!బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పలు మార్లు కోదండరాం ను అరెస్ట్ చేయడం, కేసులు పెట్టడం, ఇంటి మీద దాడి చేయడం లాంటి దాడులు జరిగాయి. కోదండరాం జేఏసీ అధ్యక్షుడి గా తెలంగాణ ఉద్యమం సందర్భంగా మిలియన్ మార్చ్ తో పాటు, సాగరహారం, సకల జనుల సమ్మె లకు కోదండరాం నాయకత్వం వహించారు. ఇలాంటి ప్రధాన కారణాల మూలకంగా కేంద్రం కేంద్రం మీద ఒత్తిడి పెరిగింది. తెలంగాణ వచ్చింది. పార్లమెంట్ లో బిల్లు పాస్ అయ్యింది. దాదాపు 1200 మంది తెలంగాణ బిడ్డల బలిదానాలు,మాజీ సీఎం అప్పటి ఉద్యమ నేత కెసిఆర్ దీక్ష తదితరముల కారణాల వల్ల కేంద్రం తెలంగాణ ఇవ్వడానికి సిద్ధం అయ్యింది.ఈ అన్నీ సందర్భాలలో మాజి మంత్రి హరీష్ రావ్ పాత్ర చాలా కీలకం అయ్యింది, అనకు తప్పదు! హరీష్ ఉద్యమం కు, బిఆర్ ఎస్ పార్టీ కి ఒక ఎస్సెట్ అనక తప్పదు!అప్పటి కాంగ్రెస్ ఎంపీ లు గడ్డం వివేకానంద్ వెంకటస్వామి, మధు యాష్కి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి లాంటి వారి కృషి, మాజీ మంత్రి తన్నీర్ హరీష్ రావ్, మాజీ ఎంపీ విజయ శాంతి,మాజీ ఎంపీ వినోద్ కుమార్ లాంటి వారి ఎందరో కృషి, అన్నింటి మించి సింగరేణి కార్మికుల సుదీర్ఘ సమ్మె పోరాటం తెలంగాణ ఏర్పాటుకు కారణంగా పేర్కొనవచ్చు!కోదండరాం, జయశంకర్ సార్, మాజీ కేంద్ర మంత్రి కాకా గడ్డం వెంకటస్వామి తదితరుల సమావేశాలు,సిడబ్ల్యూసి సమావేశం ను తెలంగాణ కోసం బహిష్కరించిన ప్రభావం, జర్నలిస్టుల పోరు ఢిల్లీ జంతర్ మంతర్ వరకు కొనసాగిన ఆందోళన తెలంగాణ ఏర్పాటు కు కారణంగా అయినప్పటికీ తెలంగాణ ఏర్పాటు తర్వాత కోదండరాం సహా రియల్ తెలంగాణ ఉద్యమ కారులను అధికారం లోకి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోలేదు. కనీసం అప్పోయిన్మెంట్ లు ఇవ్వలేదు. చాలా నిర్లక్ష్యం చేశారు.ఈ విధానాలు అన్నీ వెరసి బిఆర్ఎస్ ఓటమి పాలు అయ్యింది. అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ ఇప్పుడు అధికారం లోకి రాగానే కోదండరాం సార్ కు సముచిత స్థానం కల్పించారు. సార్ ను ప్రభుత్వం లో భాగస్వామ్యం ఇస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశన సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తారని ఆశిద్దాం! అల్ ది బెస్ట్ మా తెలంగాణ ప్రజల అందరి ఆకాంక్ష కోదండరాం సార్, ముబారక్ అమీర్ భాయ్!

**-ఎండి. మునీర్, సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకులు, 9951865223,**

## గణతంత్ర పతాకావిష్కరణ

రాజ్యాంగ ముసాయిదా కమిటీ విరచితం
మంత్రాంగం తంత్రం భారత రాజ్యాంగం
అదే సర్వసత్తాక సామ్యవాదం
లౌకిక ప్రజాస్వామ్యం
నిడివి రచన కాలం సుదీర్ఘం
భారత జాతీయ పండుగ విశేషం
తొలి పౌరుడు రాష్ట్రపతిచే
పతాకావిష్కరణం
పరేడ్లు సాంస్కృతిక కృత్యాల సమాహారం
త్రివిధ దళాల కవాతు ప్రదర్శనం
విశేష భారతరత్న పద్మా అవార్డుల
వితరణం
ప్రభుత్వ పాఠశాలల అలంకరణం
దీనిలో విద్యార్థులు ఉపాధ్యాయులే
కీలకం
జాతీయ పతాకంలో మువ్వన్నెలు
త్యాగం కాషాయం
శాంతికి శ్వేతం సమృద్ధికి హరితం,
ధర్మానికి సూచిక అశోకచక్రం
జాతీయ జెండా జాతీయ చిహ్నాలు
జాతీయగీతం
స్వాతంత్ర్య సమర యోధుల గౌరవం
పౌరుల తొలి విధిగా రాజ్యాంగ
బోధనం
మువ్వన్నెల పతాక రెపరెపలు
చిన్నారుల మదిలో స్వతంత్ర భావనకు
తొడుగు రెక్కలు
అవి బలపడితే భారతదేశ రక్షణ
అభివృద్ధి ధ్యేయంగా గైకొంటారు శిక్షణ
అనుకోరు రిపబ్లిక్ డే ఒక సాధారణ
సెలవని
గుర్తిస్తారు అది తమ బాధ్యతలకు
నెలవని
హుందాగా బాలలే రేపటి పౌరులుగా.

**సంధ్య సుత్రావె,**
**9177615967,**
**హైద్రాబాద్.**

## దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
స్వాతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని ప్రతి
పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!!
మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!!
నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో
వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగిన
అంటారు
నా భారతదేశం!!!



**దేవులపల్లి రమేశ్,**
**నంగునూర్,**
**సిద్దిపేట జిల్లా**
**9963701294**

## ఓటు ప్రజాస్వామ్యానికి పూనాది

**ఓటే జాతిమనుగడ**
**నమోదులో అలసత్వం వద్దు**
**వేయడం లో వదులు మత్తు**
**నోటు తో చేయకు చేటు**
**మత్తు తో వద్ద చెయ్యద్దు**
**భవిత చిత్తు**
**అలిచించు**
**దేశ భవిత నీ హస్తం లోనే**
**ఓటు ప్రజాస్వామ్యానికి ఊపిరి**
**వెయ్యి బాధ్యతతో ఓటు**
**రెండు అక్షరాలు కాది**
**ఒక జాతి జీవన ప్రవంతి**

**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్ ఇన్ పొలిటికల్ సైన్స్**
**జి.జె. సి.దోమకొండ**
**9440408080**

# అక్రమాస్తుల అనకొండ శివబాలకృష్ణ

## వంద ఎకరాల

## భూపత్రాలు..డబ్బుల కట్టలు

## భారీగా నగలు, నగదు స్వాధీనం

## కొనసాగిన ఎసిబి సోదాలు



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** అక్రమాలతో ఎదిగిన అధికారి సంపాదన వెలుగులోకి వస్తోంది. ఒకటి రెండు కాదు ఏకంగా నాలుగైదు వందల కోట్లు ఆస్తులు వెనకేసుకున్నట్టు అవినీతి నిరోధక శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. 30 గంటలకు జరుపుతున్న సోదాలు, విచారణలో మైండ్ బ్లాంక్ అయ్యే సంపద వెలుగు చూస్తోంది. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్, రేరా డైరెక్టర్‌గా ఉంటూ అక్రమ సంపాదనతో ఎదిగిన శివబాలకృష్ణ ఇంట్లో భారీగా ఆస్తులు బయట పడుతున్నాయి. మార్కెట్ విలువ ప్రకారం 400 కోట్లకుపైగానే ఆయన సంపాదన ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నగలు, నగదు ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నానక్‌రామ్‌గూడలోని బాలకృష్ణ ఇంట్లో రూ. 84 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో విల్లాలు, ప్లాట్లు నగర శివారు ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ ల్యాండ్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ అధికారులకు దొరికాయి. దాదాపు 100 ఎకరాల ల్యాండ్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కొడకండ్లలో 17 ఎకరాలు, కల్వకుర్తిలో 26 ఎకరాలు, యాదాద్రిలో 23 ఎకరాలు, జనగామలో 24 ఎకరాల భూములు ఉన్నట్టు పత్రాలు లభ్యమయ్యాయి. ఇవన్నీ కూడా బినామీల పేర్లతో ఉన్నాయి. మొత్తం 20 చోట్ల సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు..2 కిలోలకుపైగా బంగారు ఆభరణాలు, భారీగా వెండి వెలికి తీశారు. 80కి పైగా అత్యంత ఖరీదైన వాచ్‌లు గుర్తించారు. పెద్ద మొత్తంలో ఐఫోన్ల సీజ్ చేశారు. జనాలను అడ్డదిడ్డంగా తొక్కేసి వచ్చినదంతా మెక్కేసి అక్రమార్జనకు అలవాటు పడిన శివబాలకృష్ణ ఇన్నాళ్లకు చిక్కాడని ఆయన బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పైసా లేనిదే ఆయన అపాయింట్‌మెంట్ కూడా దొరకదని... పని చేయాలంటే లంచం ముట్టచెప్పాల్సిందేనంటున్నారు. అలా ఆయన బాధితులు వేల సంఖ్యల్లో ఉన్నరని సమాచారం. శివ బాలకృష్ణ భారీగా అక్రమ కట్టడాలకి కూడా అనుమతులు ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అందుకే అవినీతి నిరోధక శాఖాధికారులు వారిపై కూడా దృష్టి పెట్టారట. ఆయన హయాంలో అనుమతులు పొందిన కట్టడాలు సేకరిస్తున్నారు. రూల్స్ వ్యతిరేకంగా ఉంటే వాటికి ఎలా అనుమతులు వచ్చి ఉంటాయనే దిశగా కేసును విచారణ చేపట్టనున్నారు. హైదరాబాద్‌లో ఏసీబీకి చిక్కిన అవినీతి అనకొండను అధికారులు అరెస్టు చేశారు. శివబాలకృష్ణ నివాసాల్లో బుధవారం ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో బారీగా అక్రమ ఆస్తులు వెలుగు చూశాయి. దీంతో ఆయన్ని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. అక్రమాస్తుల చిట్టా చూసిన జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఓ సాధారణ ప్రభుత్వ ఉద్యోగి వందల కోట్లు ఆస్తులు సంపాదించారంటే ముక్కున వేలేసుకుంటున్నారు. బుధవారం ఆయన నివాసాల్లో దాడులు చేసిన ఏసీబీ అధికారులకు దిమ్మదిరికే ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. వంద కోట్లకుపైగా ఆస్తులు వెలికి తీశారు. శివబాలకృష్ణ నివాశాల్లో సుమారు 14 బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఆయనకి ఉన్న ఇళ్లు, బంధువులు ఇళ్లల్లో కూడా సోదాలు జరిపారు. ప్రస్తుతం అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం వంద కోట్లపై ఆస్తులు గురించారు. ఇంకా చాలా ఆస్తులు మదింపు చేయాల్సి ఉంది. బ్యాంకు లాకర్లు తెరవలేదని అంటున్నారు. అవి తెరిస్తే ఇంకా ఎన్ని కోట్ల రూపాయల ఆస్తులు వెలుగులోకి వస్తాయో అన్న అనుమానం ఉంది. బుధవారం ఉదయం మొదలైన తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. ఆయన ఇంట్లో క్యాష్ కౌంటింగ్ యంత్రాలు పెట్టి మరీ డబ్బులు లెక్కించారు. తవ్వే కొద్ది వెలుగులోకి వస్తున్న ఆయన అక్రమాస్తుల గుట్టలను చూసిన అధికారులు షాక్ తిన్నారు. చివరకు ఆయన్ని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. లెక్కిస్తున్న కొద్దీ నోట్ల కట్టలు బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.40లక్షల నగదు, రెండు కిలోల బంగారం, 60 ఖరీదైన వాచ్ లు, 14 విలువైన మొబైల్ ఫోన్లు, 10 ల్యాప్‌టాప్‌లు గుర్తించారు. దీంతో పాటు స్థిర, చరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాంకు లాకర్లు, బంధువుల ఇళ్లలో సోదాలు ముగిసిన తర్వాత ఆస్తుల వివరాలను చెబుతామని అధికారులు తెలిపారు. రాజకీయ నేతల అండదండలతో పాటు ఉన్నతాధికారుల సహాకారంతోనే కోట్లకు పడగలెత్తినట్లు తెలుస్తోంది. 14 బృందాలు 20 చోట్ల చేపట్టిన ఈ సో దాలు బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మణికొండలోని ఆదిత్యపోర్ట్ వ్యూలో విల్లా నంబర్ 25లో శివబాలకృష్ణ నివాసం ఉంటున్నారు. 2018 నుంచి 2023 వరకు హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, ఆరు నెలల క్రితం రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ ఆథారిటీ) కార్యదర్శిగా బదిలీ అయ్యారు. మెట్రోరైల్ ప్లానింగ్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివబాలకృష్ణపై అవినీతి ఆరోపణలు రావటంతో ఆయన ఆస్తుల చిట్టాపై ఇటీవల ఏసీబీ ఆరా తీసింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆధారాలు సేకరించి.. సోదాలు నిర్వహించింది. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చ నున్నట్టు వివరించారు. శివబాలకృష్ణ ఇంట్లో ఏసీబీ సోదాలు హెచ్ఎండీఏలో కలకలం రేపాయి. ఏసీబీ దాడుల సమాచారంతో అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్ లోని హెచ్ఎండీఏ కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగం (ఎలానింగ్)లో నిశ్శబ్దం నెలకొన్నది. ఏసీబీ అధికా రులు కార్యాలయంలోనూ సోదాలు చేస్తారన్న ప్రచారంతో ఉన్నతాధికారులు ఆందోళనకు గురయ్యారు.

# ఓటర్లపై ఒత్తిడి తెచ్చే వారిపై కఠిన చర్యలు

**పాడి కౌశిక్ రెడ్డిపై చర్య తీసుకోవాల్సిందే - జాతీయ ఓటరు దినోత్సవంలో గవర్నర్ తమిళిసై**




**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి తీరుపై రాష్ట్ర గవర్నర్ తమిళి సై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను ఉద్దేశించి పాడికౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఓటర్స్ డే సందర్భంగా గవర్నర్ ప్రస్తావించారు. ఓటు వెయ్యకపోతే కుటుంబం తో ఆత్మహత్య చేసుకుంటానన్న పాడి కౌశిక్ వ్యాఖ్యలపై మండిపడ్డ గవర్నర్.. అలాంటి వాళ్లపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిం చారు. నేషనల్ ఓటర్స్‌డే సందర్భంగా జేఎన్‌టీయూలో నిర్వహించిన సభలో గవర్నర్ మాట్లాడుతూ... ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా అని ఓ అభ్యర్థి అన్నారని.. ఎలక్షన్ కమిషన్ అలాంటి వాళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను ఎవరూ ఒత్తిడి చేయవద్దన్నారు. ఓటుశాతం పెరగడానికి ప్రకటనలు ఒక్కటే ఉపయోగపడవు అనేది ఈసీ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఓట్ మోస్ట్ పవర్ ఫుల్ ఆయుధమని.. డెమొక్రసీ బతకాలి అంటే ఓటు వేయాలని స్పష్టం చేశారు. మంచి అభ్యర్థిని ఎన్నుకుంటే మంచి పాలన అందుతుందని... ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని గవర్నర్ కోరారు. ఓటు వేయడం అందరి హక్కు అని గవర్నర్ అన్నారు. స్టేట్ సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌కు మధ్య వారధిగా ఉండటం తన బాధ్యత అని చెప్పుకొచ్చారు. సాధారణ ఎన్నికలను విజయ వంతంగా జరిపినందుకు శుభాకాంక్షలు తెలిపారు. తొలిసారి హోం ఓటింగ్ మంచి పరిణామమన్నారు. ఓటింగ్ రోజు సెలవు సరదా కోసం కాదని యువత గుర్తించుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగం అనేది యుద్ధంలో పాల్గొన్నట్లు అనుకోవాలని.. ఓటర్ మార్క్ ప్రౌడ్‌గా ఫీల్ అవ్వాలన్నారు. నేను నోటా ఓటుకు వ్యతిరేకం అని కూడా గవర్నర్ స్పష్టం చేశారు. బరిలో ఉన్న ఎవరో ఒకరిని యువత ఎన్నుకోవాలని గవర్నర్ తమిళి సై సూచించారు.

# వరంగల్ బాలికకు జాతీయ పురస్కారం

**నేటి పరేడ్‌లో పాల్గోనున్న లక్ష్మీప్రియ**




**వరంగల్, జనవరి 25 (జనంసాక్షి):** జాతీయ స్థాయిలో వరంగల్ విద్యార్థిని సత్తా చాటారు. జిల్లాకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పెండ్యాల లక్ష్మిప్రియకు జాతీయ బాలల పురస్కారం దక్కింది. ఈ నెల 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అనంతరం ఈ నెల 23న ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన బాలికను ప్రశంసించారు. ఈ నెల 26న శుక్రవారం జరిగే రిపబ్లిక్ డే పరేడ్ లోనూ ఆమె పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మిప్రియను తల్లిదండ్రులు, గురువులు అభినందించారు. ఆమెకు పురస్కారం దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. కూచిపూడి నర్తకి పెండ్యాల లక్ష్మీప్రియ నేడు జరగబోయే బాల పురస్కార అవార్డు గ్రహీతలతో కలిసి రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొంటారు. బాల పురస్కార అవార్డు రావడం పట్ల లక్ష్మీ ప్రియ ఆనందం వ్యక్తం చేశారు. లక్ష్మీప్రియ ప్రస్తుతం కాజీపేట మాంట్ ఫర్డ్ స్కూల్ లో 10 తరగతి చదువుతోంది. భవిష్యత్‌లో తన కళను మరింత ముందు తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పించాలని ప్రధానిని కోరారు. హిందూ సంప్రదాయాన్ని, కళలను, సనాతన ధర్మాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని ప్రధానికి తెలిపారు.



# హిట్ అండ్ రన్ కేసులో ఐదుగురి అరెస్ట్

**మద్యం మత్తులో డ్రైవ్ చేసిన రిత్విక్ రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసు రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తెల్లవారుజామున బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో తారక్ అనే బౌన్సర్ మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ గురువారం మీడియాకు వివరించారు. హిట్ అండ్ రన్ కేసులో ఐదు మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఏ1గా కొవ్వూరి రిత్విక్ రెడ్డి, ఏ2గా వైష్ణవి, ఏ3గా పోలుసాని లోకేశ్వర్ రావు, ఏ4గా బుల్లా అభిలాష్, ఏ5గా అనికేత్ అరెస్ట్ అయినట్లు చెప్పారు. హిట్ రన్ కేసులో తారక్ రామ్ అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడని.. ఏసు రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. పోలీసులు పట్టుకుంటారనే భయంతో ఏ1 రిత్విక్ రెడ్డి పరారయ్యాదన్నారు. కారును బీహెచ్ఈఎల్‌లో దాచి పెట్టారని తెలిపారు. నిందితుల కోసం గాలించి.. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా అరెస్ట్ చేశామని ఏసీపీ వెల్లడించారు. రిత్విక్ రెడ్డి అమేజాన్‌లో జాబ్ చేస్తున్నాడని ఆఫీస్ చూపిస్తానని మిగిలిన ఫ్రెండ్స్‌ను తీసుకెళ్లాడన్నారు. రిత్విక్ రెడ్డి మద్యం మత్తులో ఉండి డ్రైవ్ చేశాడని.. అలాగే మద్యం మత్తులో ఉన్నాడని తెలిసి మిగిలిన వారు కారులో ప్రయాణించారన్నారు. దీంతో కారులో ప్రయాణించిన వారిని కూడా నిందితులుగా చేర్చామని చెప్పారు. ఈ హిట్ అండ్ రన్ కేసులో ఏ1 రిత్విక్ రెడ్డిపై 304 ( 2) కింద కేసులు నమోదు చేశామన్నారు. దీంతో పాటు 337 ఐపీసీ , 337, 187 ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరంతా తుకారం గేట్ వద్ద మద్యం కొనుగోలు చేసినట్లు ఏసీపీ హరిప్రసాద్ తెలియజేశారు.

# కోదండరామ్‌కు టిఎన్జీవోల అభినందనలు

**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరామ్‌కు టీఎన్జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడుమారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, పర్వతాలు, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, లక్ష్మణ్ తదితరులు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. తమిళిసై సౌందరరాజన్ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ను నియమించారు. తెలంగాణ జన సమితి వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియామకమయ్యారు. వీరిద్దర్ని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ రాజ్ భవన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరామ్ కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో కోదండరాం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారు. అందులో భాగంగా కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా ఖరారు చేసింది.

# తెలంగాణలో పోలీస్ రాజ్యం

**• జీవన రెడ్డి ప్రోద్బలంతో కేసులు • మీడియా సమావేశంలో కవిత విమర్శలు**



**జగిత్యాల, జనవరి 25 (జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. జగిత్యాల సబ్‌జైలులో హబ్సిపూర్ సర్పంచ రాజేశ్వర్ రెడ్డిని ఎంఎల్‌సి కవిత పరామర్శించారు. మెట్‌పల్లి బిఆర్ఎస్ కార్యాలయంలో ఎంఎల్‌సి కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తోందని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఎంఎల్ఏ జీవన్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో మహిళలు, విద్యార్థులు, రైతులకు రక్షణ కరువైందని విమర్శలు గుప్పించారు. జీవన్ రెడ్డి క్షకపూరిత చర్యలు పాల్పడితే ప్రజలు తిరగబడే రోజు వస్తుందని కవిత హెచ్చరించారు. ప్రజల కోసం జీవన్ రెడ్డి పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కానీ ఇతర పార్టీల నాయకులపై అక్రమ కేసులు పెడితే ఊరుకోమని, చట్ట పరంగా ఎదుర్కొంటామని సవాల్ విసిరారు. గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి బిఆర్ఎస్ పాలనలో జరిగిందని ప్రశంసించారు. తమ పాలనలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నా మని తెలిపారు. యూనివర్సిటీలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆడపిల్ల జట్టును మహిళ పోలీసులు లాగిన సంఘటనను కవిత ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఖాకీల రాజ్యం నడుస్తోందని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్, ఖాకీలపై పోరాటం చేసి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చి హామీలు ప్రజలకు చేరే వరకు పోరాటం చేస్తామని కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తుందని ఎమ్మెల్సీ కవితఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అన్యాయంగా అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గురు వారం కవిత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లిలో నిర్వహించిన మీడియా సమావేశం లో కాంగ్రెస్ తీరుపై నిప్పులు చెరిగారు. అభివృద్ధిని పక్కనపెట్టి, సాధ్యం కానీ హామీలిచ్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై ఘాటుగా స్పందిం చారు. జగిత్యాల రూరల్ మండలం హబ్సిపూర్ సర్పంచ్‌పై అక్రమ కేసులు ముమ్మాటికీ కక్ష్యపూరిత చర్యే అన్నారు. జీవన్ రెడ్డి 30 ఏళ్ల అధికారంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఎమ్మెల్యే సంజయ్ పదేళ్లలో చేసి చూపించారన్నారు. జరిగిన అభివృద్ధిని ఓర్వలేక అధికారం మారడంతో అక్రమ కేసులు మొదలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రలను రాజకీయంగా, చట్టపరంగా ఎదుర్కొంటా మని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తిరగబడతారన్నారు. అమలు కానీ వాగ్దానాలు ఇచ్చారు. వాటిని ముందు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కక్ష పూరిత చర్యలను ప్రజలు తిప్పి కొడతారన్నారు. యూనివార్సిటీ భూముల విషయంలో విద్యార్థిని జుట్టు పట్టుకొని లాక్కెళ్తున్న పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ తెలంగాణలో లేదని పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.

# పోలీసులు అదుపులో శివబాలకృష్ణ

**స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలు వెల్లడి**



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్ఎండీ మాజీ డైరెక్టర్, రేరా కార్యదర్శి శివబాలకృష్ణను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం బాలకృష్ణ ఇంట్లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు భారీగా నగదు, విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో బాలకృష్ణ ఇంట్లో పట్టుబడ్డ ఆస్తుల వివరాలను ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. గురువారం ఏబీసీ అధికారులు మీడియాతో మాట్లాడుతూ... బాలకృష్ణ ఆస్తులకు సంబంధించి వివరాలను తెలియజేశారు. బాలకృష్ణ ఇంటితో పాటు 16 ప్రదేశాల్లో సోదాలు చేశామని తెలిపారు. నిందితుడు బాలకృష్ణపై 13 (1) (బీ) , 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాలకృష్ణ ఇంటితో పాటు, బంధువులు, సహచరుల ఇళ్లల్లో సోదాలు చేశామన్నారు. బాలకృష్ణ ఇంట్లో 99.60 లక్షలు నగదు సీజ్ చేశామని.. బంగారం 1988 గ్రాములు, సిల్వర్ 6 కేజీలు సీజ్ చేసినట్లు చెప్పారు. 8.26 కోట్లు రూపాయలు విలువైన ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీజ్ చేసిన ఆస్తుల విలువ మార్కెట్ వ్యాల్యూలో ఇంకా ఎక్కువ ఉంటుందని తెలిపారు. మిగిలిన బినామీలపై విచారణ చేయాల్సి ఉందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# రామమందిరానికి రాష్ట్రపతిని ఆహ్వానించరా?

## సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** రామ మందిరంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రాష్ట్రపతి ముర్మును ప్రధాని మోదీని ఆహ్వానించకపోవడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తప్పు పట్టారు. ఆమెను ఎందుకు పిలవలేదు,ముత్తైదువ కాదనా? అని ప్రశ్నించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక మతానికి చెందిన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అన్నారు. రామ మందిర నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్న నారాయణ.. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మొత్తం మోదీ, యోగి ఈవెంట్ లా సాగిందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు దేశ ప్రయోజనాలను దెబ్బ తీస్తోందని విమర్శించారు. రామ మందిర నిర్మాణానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన జడ్జిలలో ఒకరికి రాజ్యసభ, మరొకరికి గవర్నర్ పదవులు కట్టబెట్టారని నారాయణ ఆరోపించారు. ఇండియా కూటమి బలోపేతం కోసం విశాల దృక్పథంతో కాంగ్రెస్ వ్యవహరించాలన్నారు. మోదీ బ్లాక్ మెయిల్ కి భయపడి కొందరు ఇండియా కూటమికి దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ... బీజేపీని కౌగిలించుకోవడం తోనే ఓడిపోయారని చెప్పారు. ఏపీలో జగన్ పాలన చివరి దశకు చేరిందన్నారు. చంద్రబాబు, జగన్ ఇద్దరు బీజేపీకి తానా అంటే తందానా అని పాడేవాళ్లేనని అన్నారు.

# జనం సాక్షి క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ బ్యూరో, జనవరి 25 (జనంసాక్షి)** జనం సాక్షి దినపత్రిక వరంగల్ జిల్లా క్యాలెండర్ను గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సకాలంలో వార్తలను అందించడం సకాలంలో వార్తలను అందించుటకు కృషి చేయాలని అన్నారు. అలాగే జనం సాక్షి దినపత్రిక ప్రజల ఆదరాభిమానాలు పొందేలా విలేకరులు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జనం సాక్షి ఇంచార్జి ఇంద్రసేనారెడ్డి, వరంగల్ జిల్లా బ్యూరో సురేష్ బాబు, జండా అంబయ్య, కత్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రలోభాలకు తావు లేని ఎన్నికల నిర్వహణకు

# ప్రజాప్రతినిధులు, ఓటర్లు కృషి చేయాలి

**ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి బ్యూరో జనవరి 25 (జనంసాక్షి)**

సమాజంలో కులం, వర్గం, ప్రాంతం, జాతి బేధాలు లేకుండా భారత రాజ్యాంగం ఓటు 18 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందని అన్నారు. అంతే బాధ్యతతో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగపరచుకుని నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. గురువారం 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐడిఓసి నుండి వనపర్తి పట్టణంలోని ప్రధాన కుడళ్ల గుండా జాతీయ పతాకాలు చేతబూని బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా కలెక్టర్ స్వయంగా బైక్ నడుపుచు నాయకత్వం వహించారు. ఈ బైక్ ర్యాలీలో అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ




బస్టాండ్, ఇందిరా పార్క్, రాజీవ్ చౌక్ మీదుగా సాగి.. తిరిగి కలెక్టర్ కార్యాలయంకు చేరుకుంది. అనంతరం కలెక్టరేట్‌లో ఎన్నికల స్వీప్ యాక్టివిటీ పై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకొని బలమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రలోభాలకు గురిచేయకుండా ఇటు ప్రజా పరిటినిధులు, అటు ప్రజలు ప్రలోభాలకు ఆశ పడకుండా నైతికత తో ఓటు వేసే విధంగా కృషి చేయాలని సూచించారు. వనపర్తి జిల్లాలోఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు అందరూ బాగా పని చేశారని, ఒక్క కేసు నమోదు కాకుండా ఎన్నికలు జరగడం అభినందనీ యమన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒకరి శ్రమ వల్లే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని అభినందనలు తెలి పారు. ఎన్నికల్లో మీడియా పాత్ర సైతం చాలా ప్రశంసనీయమైనదని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో సైతం ఫేక్ వార్తల పట్ల అందరూ అప్రమత్తంగ ఉండాలని ఏదైనా తప్పుడు వార్త వస్తే వెంటనే ఖండించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఓటరు అవగాహన ఫోరమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 'నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ వోట్ ఫర్ ష్యూర్' అనేది ఈసారి ఎన్నికల థీమ్ గా చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ ఎల్బీ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.. జనవరి 25న ఎన్నికల సంఘం ప్రారంభమైందని అందుకే ఈ రోజు ఓటరు దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్ తిరుపతి రావు జాతీయ ఓటరు దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం 18 ఏళ్లు నిండిన కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి, సీనియర్ సిటిజన్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, పాటలు, వ్యాసరచన తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ అదనపు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

## ప్రజల అవసరాలకు తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలు

**జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జనవరి 25(జనం సాక్షి):**



ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అసౌకర్యం కలగకుండా జిల్లాలో తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలను నేటి నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ తాహసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఒక ఆధార్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ప్రజలు ఆధార్ అప్డేషన్ కేవైసీ కోసం వస్తున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని నాగర్ కర్నూల్ ఎంపీడీవో కార్యాలయం బిజినపల్లి తాహసిల్దార్ కార్యాలయం తాడూరు తాహసిల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 31వ తేదీ వరకు తాత్కాలికంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆయా ఆధార్ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

## కార్మిక సంక్షేమ ద్వారా విద్యా ప్రోత్సహకం

**జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి)**



తెలంగాణ కార్మిక సంక్షేమ ద్వారా నారాయణపేట జిల్లాలోని దుఖానములలో మరియు వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్నా కార్మికులకు విద్యా ప్రోత్సాహకం అందజేయడం జరుగుతుందని జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ..దుకాణంలో మరియు వాణిజ్య సంస్థలో పనిచేస్తున్న అర్హులైనా కార్మికులకు వేయి నుండి 2,000 రూపాయలు వరకు స్కాలర్షిప్ అందజేయబడుతున్నాయని తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం వృత్తి విద్యా కోర్సులు చేస్తున్నా వారు నారాయణపేట లేబర్ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశం ఫిబ్రవరి 15నవ తారీకు లోపల లేబర్ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్మికుల పిల్లలు పదవ తరగతి ఐటిఐ ,ఇంటర్, పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ ,మెడిసిన్ తదితర వృత్తివిద్య కోర్సులు చదువుతున్న పిల్లలకు స్కాలర్షిప్లు మెరిట్ ప్రకారం అందజేయపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దుకాణము మరియు వాణిజ్య సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## గ్రామ పంచాయితీల అభివృద్ధికి కృషి చేస్తాం

**వెల్దుర్తి జనవరి 24 జనం సాక్షి:**

వెల్దుర్తి మండలంలోని కుక్కునూరు గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా 20 లక్షల రూపాయల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు నియోజకవర్గంలోని గ్రామపంచాయతీలు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని గ్రామాలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతున్న నానుడితో పనిచేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆమె చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమేష్ గౌడ్‌తో పాటు ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రీతి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

**సంగారెడ్డి టౌన్ జనం సాక్షి:**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే-ఐజేయు) రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరాహత్ అలీని సంగారెడ్డి జిల్లా శాఖ పక్షాన జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో అభినందించారు. హైదరాబాదులోని యూనియన్ కార్యాలయంలో విరాహత్ అలీని కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. సాధారణ జర్నలిస్టుగా ప్రస్థానం మొదలై రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విరహత్ అలీ నాయకత్వంలో జర్నలిస్టులకు మేలు జరుగుతుందని యాదగిరి పేర్కొన్నారు. మారు తున్న కాలంతో పాటు జర్నలిస్టులు పోటీపడుతున్నప్పటికీ అనేక సమస్యలు వేధిస్తున్నాయని చెప్పారు. విరహత్ అలీ నాయకత్వంలో ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. అనేక దశాబ్దాలుగా జర్నలిస్టుల కోసం విరాహత్ అలీ ఉద్యమించినందున ఆయన నాయకత్వంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ నిధి, సరైన శిక్షణ లభిస్తుందని యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ త్వరలో జర్నలిస్టులకు తీపి కబురు లభిస్తుందని, టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో కూడా మంచి సపోర్టు దొరుకుతుందని వెల్లడించారు. హెల్త్ కార్డుల కోసం చాలా రకాలుగా ప్రయత్నిస్తున్నామని... ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని చెప్పారు. అనేకమంది పేద, మధ్యతరగతి జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు హెల్త్ కార్డుల ద్వారా భరోసా లభిస్తుందని విరాహత్ అలీ వివరించారు.మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా దశలవారీగా కృషి చేస్తామని చెప్పారు. త్వరలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం గ్రామీణ ప్రాంతం లో నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ఎం ఏ కే ఫైసల్ ,జాతీయ కౌన్సిల్ సభ్యుడు మురళీధర్ శర్మ, సీనియర్ నాయకుడు పానుగంటి కృష్ణ, పటాన్చెరు ప్రాంత నాయకుడు నరసింహ పాల్గొన్నారు.



## షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన బాలికను అభినందించిన కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున ద్వితీయ బహుమతి( వెండి పతకం ) సాధించిన మక్తల్ ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహానికి చెందిన విద్యార్థిని శివమ్మ ను గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో గల కలెక్టర్ ఛాంబర్‌లో శివమ్మ ను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని బహుమతులు సాధించాలని సూచించారు. ముందు ముందు జరిగే షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా క్రీడాకారిణి శివమ్మ కు కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారిని కన్యా కుమారి, వసతి గృహ సంక్షేమ అధికారిని అనిత పాల్గొన్నారు.

## జర్నలిజం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలి

**జనంసాక్షి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వనపర్తి బ్యూరో జనవరి25 (జనంసాక్షి)**



జర్నలిజం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రం తిరుమల హిల్స్ ఎమ్మెల్యే నివాస సముదాయంలో జనంసాక్షి క్యాలెండర్‌ను వనపర్తి బ్యూరో డి. మాధవరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తాపత్రికలు ప్రజలకు ప్రభుత్వంకు వారధి గా ఉండాలని, నెత్తిక విలువలు ఉన్న వార్తలను సమాజానికి అందించాలన్నారు. జర్నలిస్టులు నీతి నిజాయితీతో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరాం తీసుకరావల న్నారు. జనంసాక్షి దిన పత్రిక అతితక్కువ కాలంలో ప్రజల మన్ననలు పొందారన్నారు. ఇటీవల ఎన్నికల సమయంలో నిక్కచ్చిగా సర్వే నిర్వహించి ముందే ఫలితాలను ప్రజలకు అందించారన్నారు. మరిన్ని మంచి కథనాలను అందించాలని ఆశిస్తున్నామన్నారు. జనంసాక్షి ప్రత్రికారంగంలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటసాయి ఆసుపత్రి వైద్యులు జనరల్ సర్జన్ డాక్టర్ తాటికొండ రవీంద్ర బాబు,ఆసుపత్రి సీఈవో ప్రవీణ్‌లు జనంసాక్షి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నేత బుచ్చన్న, దాచ హరీష్ కుమార్, జిల్లా ఫోటో గ్రాఫర్ మహేష్ సింగ్ పాల్గొన్నారు.

## పోలీసుల తీరు గర్హనీయం

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

హైద్రాబాద్ లో జరిగిన ఎబివిపి నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయం అని పోలీసుల దాడిని నారాయణపేట పట్టణ మహిళా మోర్చా అధ్యక్షులు అపిరెడ్డి పల్లి నర్సమ్మ రాము ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించడం అన్యాయమే అయినా అందుకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన ఎబివిపి నాయకులపై పోలీసులు దాడి చేయడమే కాకుండా రజాకార్ల లాగా జుట్టు పట్టుకుని లాక్కెళ్ళడం హీయమని అన్నారు. ఈ తీరు చూస్తుంటే బిఆర్ఎస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏమీ లేదని అన్నారు.తమది ప్రజా పాలన అని ప్రజల వద్దకే పాలన అంటూ ఉదర గొడుతున్న ముఖ్యమంత్రి ఈ సంఘటనకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవివిపి నాయకులపై దాడి చేసి అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే మహిళా మోర్చా ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.



## ఈనెల 28న జిల్లా కేంద్రానికి

# అమిత్ షా రాక

**సభా స్థలన్ని పరిశీలించిన బిజెపి జాతీయ, రాష్ట్ర నాయకులు**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

పార్లమెంటు స్థాయి సమీక్ష సమావేశం ఈనెల 28న పాలమూరు జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నా మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశానికి కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథులుగా హాజరవుతారని బిజెపి జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ముఖ్య నాయకులతో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి ,రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పరిశీలించారు.



## గణతంత్ర దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ యోగేష్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

గణతంత్ర దినోత్సవం పెరేడ్ ఏర్పాట్లను ఎస్పీ.యోగేష్ గౌతం గురువారం పరిశీలించారు. స్పెషల్ పార్టీ, ఏఆర్, సివిల్, హెూంగార్డ్,ఎన్ సి సి విద్యార్థులు, సిబ్బంది తో నిర్వహించే పరేడ్‌ను పరిశీలించారు.జనవరి 26, 75 వ గణతంత్ర దినోత్సవానికి నారాయణపేట జిల్లా పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సిద్ధమవుతోంది. భారతదేశానికి రాజ్యాంగం అమలు సందర్భంగా నిర్వహించుకునే అతిపెద్ద పండుగ గణతంత్ర దినోత్సవమని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. 2024 సంవత్సరం నారాయణపేట జిల్లాలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఐదు ప్లాటూన్ లతో రిజర్వ్ ఇన్స్పెక్టర్ శేఖర్ బాబు సారధ్యంలో అద్భుతంగా స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది, హెూమ్ గార్డ్స్, ఎన్‌సిసి విద్యార్థులతో పరేడ్ ను నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయిధ పోలీసుల కవాతును స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ. హెడ్ క్వార్టర్స్ ముఖ ద్వారం నుండి మైదానం వరకు ఇరువైపులా రంగురంగుల జెండాలతో ముస్తాబు చేయాలని, పరేడ్ మైదానంలో పరిశుభ్రతతో సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు,ఆర్ ఐ. శేఖర్ బాబు, ఆర్మ్యాడ్ రిజర్వ్ పోలీసులు మొదలగు వారు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో ప్రధానమైంది

- అదనపు కలెక్టర్ కుమార్ దీపక్.
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఘనంగా భారత ఎన్నికల వ్యవస్థాపక దినోత్సవం,14వ జాతీయ ఓటర్ల దినోత్సవం



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జనవరి 25(జనం సాక్షి):**

ప్రజాస్వామ్యం లో ఓటరుదే కీలకపాత్ర అని, దేశాభివృద్ధికి సుపరి పాలన అందించే మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటర్లకు ఉందని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భారత ఎన్నికల వ్యవస్థాపక దినోత్సవం,14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నాగర్ కర్నూల్ ఐడిఓసి ప్రజావాణి మీటింగ్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై అధికారులు సిబ్బందితో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. భారత ఎన్నికల సంఘం రూపొందించిన మై భారత్ హెూమ్ పాటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని, ప్రతి ఏడాది ఓటరు జాబితా సవరణ ఉంటుందని, 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలలో చదువుతున్న 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించి ఓటర్ నమోదును చేయించాలని సూచించారు.

**రెవిన్యూ అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ**

అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుకున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. భారత ఎన్నికల కమిషన్ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. అంతకుముందు నాగర్ కర్నూల్ ఆర్డిఓ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా మైదానం నుండి ప్రభుత్వ జర్నల్ ఆస్పత్రి వరకు ఓటర్ చైతన్య అవగాహనపై విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ నర్సింగ్ రావు, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణా, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, డిటి రఘు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఓటు వజ్రాయుధం**

**నాగర్ కర్నూల్ అర్‌డిఓ రాంరెడ్డి**

ఓటు వజ్రాయుధం అని నాగర్ కర్నూల్ అర్‌డిఓ రాంరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఇంటర్, డిగ్రీ కళాశాలలు విద్యార్థిని, విద్యార్థుల తో ఆయన భారీ ర్యాలీ నిర్వహింపజేశారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర మైదానము నుంచి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కూడలి వైపు నుంచి శ్రీపురం చౌరస్తా మీదగా పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పాత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌డిఓ ప్రసంగించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా ఆర్‌డిఓ రాంరెడ్డి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. బాలుర జూనియర్ కళాశాల వ్యాసరచన విజేత హెచ్ఈసీ కోర్సు కాశీగౌడ్‌కు బహుమతిని అందజేశారు. డిగ్రీ కళాశాలకు చెందిన పి. స్వాతి, సి. నరేష్ లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ గోవిందరాజులు, డి.పి.ఓ కృష్ణ, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# అపహాస్యం అవుతున్న ప్రజాస్వామ్యం

## డబ్బు ప్రభావం తగ్గించే చర్యలు అవసరం

### పక్కాగా ఎన్నికల నిర్వహణ జరగాలి

**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** ఎన్నికలు అపహాస్యం అవుతున్నాయి. డబ్బులతో ఓట్లను కొనుగోలు చేయడం అన్నది చిటికెలో పని అన్న చందంగా మారింది. గ్రామ పంచాయితీ మొదలు అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల విన్యాసం చూస్తుంటే ప్రజాప్రతినిధులు ఎన్నికలను పక్కా వ్యాపారంగా మార్చారు. డబ్బులు పెట్టి ఓట్లు కొనుగోలు చేసి, ప్రజలపై సవారీ చేసేలా తయారవుతున్నారు. గెలుపు లక్ష్యంగా విచ్చలవిడిగా డబ్బు,మద్యం ఖర్చు పెడుతున్న తీరు మన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేదిగా తయారయ్యింది. దీనిపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలి. ధనప్రవాహాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేయాలి. పక్కాగా ఎన్నికలు జరిగేలా చూడాలి. ఏటా ఓటరు దినోత్సవం జరుపుకోవడం...ఓటరు నమోదు చేపట్టడం ఓ ప్రహసనంగా మారింది. అలాగే దేశంలో ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకుంటూ గణతంత్రాలు జరుపుకుంటున్న వేళ మనలను మనం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలు కూడా డబ్బులు తీసుకుని ఓట్లు వేసినంత కాలం పాలకులకు లొంగి ఉండాల్సిందే అన్న నిజాన్ని గుర్తించాలి. వారు వచ్చింది మొదలు తమ స్వలాభం కోసం తప్ప ప్రజల కోసం పనిచేయరు. రాజ్యంగాన్ని సిద్ధం చేసుకుని అమలు చేసుకుంటున్న వేళ ధనరాజకీయాలు ఎంతవరకు సమంజసమో అన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమన్యాయం అందుతుందా అన్నది చూడాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. గతంలో ఎన్నడూలేని విధంగా ఇటీవలి కాలంలో ధన ప్రవాహం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఓటుకు రూ.వెయ్యినుంచి రూ. 5వేల వరకు చెల్లించడం చూస్తుంటే ఈ డబ్బులు ఎక్కడి నుంచి తెస్తున్నారు..ఎలా రాబడతార్న ఆలోచన ప్రజలు చేయాలి. బహిరంగంగా డబ్బులు పంచుతున్నా అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. విపక్ష పార్టీల అభ్యర్థులపై నిర్బంధం పెంచడం.. రెబల్స్ అభ్యర్థులను కట్టడి చేయడం వంటివి చేస్తూ అధికారం దక్కించుకోవడం కోసం నానాగడ్డీ కరుస్తున్నారు. మన ఎన్నికల విధానాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో ధనప్రభావం ఉన్నంత కాలం ప్రజలకు మేలు జరుగదు. రాజకీయ పార్టీలకు అధికారమే తప్ప ప్రజలు,ప్రజా సేవ అభివృద్ధి కనబడడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదు. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్ల డబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమానా తలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరే సుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది.దేశంలో ఇప్పటికీ సరైన ప్రాజరోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయ రంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. ఈ అసమాన తల తొలగింపునకు రాజకీయ సంకల్పం బలంగా ఉండాలి. అలాంటి నాయకులు రావాలి. అలాంటి వారితోనే ఈ దేశం బాగుపడుతుంది తప్ప అప్పటి వరకు గణతంత్రాలు ఎన్నయినా మార్పు రాదు.

### మేడారం మహా జాతర పనులను

# ఫిబ్రవరి 5వ తేదీలోగా పూర్తి చేయాలి

### మేడారం మహా జాతర 2024 జరుగుతున్న పనుల పురోగతిపై
### సివిల్ ఇంజనీరింగ్ విభాగాలతో ఐటిడిఎలో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన పిఓ..అంకిత్..

**ఏటూరునాగారం, జనవరి 25 (జనంసాక్షి):** ఐటిడిఎ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ ఐఏఎస్, మేడారం మహా జాతర 2024 జరుగుతున్న పనుల పురోగతిపై సివిల్ ఇంజనీరింగ్ విభాగాలతో ఐటిడిఎలో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.డిప్యూటెడ్ సిబ్బందికి వసతి కల్పించే పాఠశాలలో ప్రత్యేక మరమ్మతులపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీ రాజ్‌తో సమీక్షించి, రేపటిలోగా పనులు ప్రారంభించి, ఫిబ్రవరి 5వ తేదీలోగా తప్పకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని పార్కింగ్ ప్రదేశాలలో ఏర్పాట్లపై ఆరా తీశారు మరియు యాత్రికుల రద్దీ రోజురోజుకు పెరిగి పోతున్నందున అన్ని పార్కింగ్ ప్రదేశాలలో తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ పిఆర్ మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండోమెంట్‌లను ఆదేశించారు. అన్ని పార్కింగ్ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లకు సెక్టార్ వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి ఫిబ్రవరి 5వ తేదీలోగా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండోమెంట్స్‌ను ఆదేశించారు.ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ట్రైబల్ వెల్ఫేర్‌తో సమీక్షించి ఇంచర్ల, చల్వాయి, తాడ్వాయి ప్రాంతాల్లో కిచెన్-కమ్-డైనింగ్ హాళ్ల స్థితిగతులపై ఆరా తీశారు మరియు జనవరి 28 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉంచాలని మరియు సివిల్ పనులను వేగవంతం చేసి ఫిబ్రవరి 1వ వారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యూజి యం, ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో మర మ్మతులు, పెయింటింగ్ పనులను పర్యవేక్షించి జనవరి 28లోగా పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. మహ బూబాబాద్ జిల్లా పడిగిద్దరాజు, గుంజేడు ఆలయాల మరమ్మతు పనులపై దృష్టి సారించి ఫిబ్రవరి 2వ తేదీలోగా పూర్తి చేయాలని ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. నీటి పారుదల పనులపై సంబంధిత ఇంజినీర్లతో సమీక్షించి జంపన్నవాగు వెంబడి కుళాయిల ఏర్పాటు, పంపుసెట్లు, మోటార్ల బిగింపు, ఇసుక కాస్టింగ్, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడిక తీయ డం, పాడైపోయిన మెట్లు మరమ్మతు పనులు, లేడీస్ డ్రెస్‌లు మార్చుకునే కంపార్ట్‌మెంట్ల నిర్మాణం తదితరాలపై ఆరా తీశారు. కుళాయిలు, పంపుసెట్ల బ్యాటరీని ఏర్పాటు చేసి, జంపన్న వాగు వెంట ఇసుకను చదును చేసి, దెబ్బతిన్న మెట్లను ఇసుక బస్తాలతో నింపి జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదే శించారు.



డీటీఆర్‌ల ఏర్పాటు, పోల్స్ ఏర్పాటు పై డివిజనల్ ఇంజినీర్‌తో సమీక్షించి అన్ని పార్కింగ్ స్థలాల్లో సరైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఈఓ ఎండోమెంట్స్‌తో సమన్వయం చేసుకుని ఫిబ్రవరి 5లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (జి) జె వసంతరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ ఐటిడిఎ ఎం రాజ్‌కుమార్, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ములుగు ఎన్. రవీందర్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అజయ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఎ హేమలత, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండోమెంట్స్ రాజేందర్, ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సదయ్య, డివిజనల్ ఇంజనీర్ ఎన్‌పిడిసిఎల్ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి మీ ఓటే పునాది
# ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకండి

**గుడిహత్నూర్ జనవరి 25 (జనంసాక్షి):** మీ భవిష్యత్తును మార్చుకునేందుకు రాజ్యాంగం మీకు కల్పించిన అవకాశం ఓటు హక్కు పాలకులను ప్రశ్నించే అధికారం ఇచ్చేది ఓటు రాతియుగం నుంచి స్వర్ణయగం వైపు మమ్మల్ని నడిపించేది మంచి సమాజాన్ని నిర్మించేది ఓటు తహసిల్దార్ కవిత రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదుట అధికారులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతి ,యువకుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ప్రపంచ గతిని మార్చే శక్తి ఒక్క ఓటుకే ఉందన్నారు. ప్రతి ఓటరు తమ ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో భాగంగా ప్రతి ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ఎన్నికలలో ఓటు హక్కును ప్రలోభాలకు గురి కాకుండా నిజాయితీగా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత, తాసిల్దార్. భాగ్యలక్ష్మి, ఎంపిఓ. లింగయ్య, ఎంఈఓ. నారాయణ, ఎస్సై.సయ్యద్ ఇమ్రాన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు





దేవదాస్, ఆర్.ఐ అరుణ్, బివిఎల్ఓలు, అశోక్, ఛాయ, సంగీత, నాయకులు జాదవ్ రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ఓటర్ నమోదు కార్యక్రమం ప్రతీ గ్రామంలో విస్తృతంగా చేపట్టాలి..
వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం..



**వరంగల్ ప్రతినిధి జనవరి 25 (జనంసాక్షి):** పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు వరంగల్ గ్రాడ్యుయేట్ల నియోజకవర్గ ఓటర్ జాబితా తయారీ గురించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ వాసు చంద్ర ఎన్నికల విభాగం సూపరిండెంట్ విశ్వ నారాయణ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు హక్కు నమోదుపై భారత ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారం గతంలో ఓటు హక్కు కలిగి ఉన్నవారు మరల కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని వివరిస్తూ కొత్త ఓటర్ జాబితా ననుసరించి మాత్రమే ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు వేసేందుకు అర్హుత కలరని చెప్పారు. ఓటర్ జాబితా తయారీలో వేగం పెంచాలని పట్టభద్రుల నూతన ఓటు హక్కు నమోదుపై వారికున్న సందేహాలను నివృత్తి చేసి ఓటర్ నమోదును పెంచాలని కోరారు. పట్టభద్రుల ఓటు హక్కు నమోదుపై స్కూల్ ఎడ్యుకేషన్, టీచర్స్, ఎంప్లాయిస్ ,ప్రైవేట్ డిగ్రీ కళాశాల యూనివర్సిటీలలో సర్కులర్ జారీ చేసి ఓటరు జాబితా నమోదుకు కృషి చేయాలని ఆర్డీవో వాసు చంద్ర ను ఆదేశించారు. పట్టభద్రుల ఓటింగ్ శాతం నమోదు విషయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమన్వయం చాలా అవసరమని చెప్పారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు నిర్వహించేందుకు వరంగల్ జిల్లాకు సంబంధించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో వాసు చంద్ర నియమించామని తెలిపారు. 1 నవంబర్ 2023 నాటికి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ, డిప్లొమా, తత్సమాన విద్యార్హతను కలిగివున్న గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేట్లు ఆయా మండలంలోని తహశీల్దార్ కార్యాలయం లో అందజేయాలని తెలిపారు. ఆన్లైన్లో కూడా దరఖాస్తు ఫారాలు తీసుకోవచ్చని అన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫిబ్రవరి 6వ తేదీ ఆఖరు గడువని, ఫిబ్రవరి 24 డ్రాఫ్ట్ ప్రచురిస్తామని , ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫిబ్రవరి 24 నుండి మార్చి 14 వరకు అందజేయాలని తెలిపారు. ఫైనల్ జాబితా ఏప్రిల్ 4 న విడుదల చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు కాంగ్రెస్ నుండి ఈవి శ్రీనివాస్ బి ఆర్ ఎస్ నుండి నాగేశ్వరరావు , వివిధ పార్టీ ప్రతినిధులు వరంగల్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటింగ్ శాతం పెంచడానికి అవగాహన కార్యక్రమాలు

### వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**వరుణ్ బ్యూరో, జనవరి 25 (జనంసాక్షి):** ఓటింగ్ శాతం పెంచడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.గురువారం జాతీయ ఓటరు దినోత్సవం ( జనవరి 25)ను పురస్కరించుకుని వరంగల్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఐ ఎం ఎ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధి గా హాజరై సీనియర్ (సిటిజన్స్) ఓటర్ల ను శాలువా లతో సత్కరించి, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకొనున్న యువ ఓటర్ల కు ఎపిక్ కార్డ్ లను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నా షూర్" పేరు తో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఫలితం గా సుమారు 20 వేల మంది యువ ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకున్నారనీ, జిల్లా లో సీనియర్ సిటిజన్స్ 13 వేల వరకు ఉన్నారని వారు కూడా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవడం జరిగిందని, పి.డబ్ల్యు డి ఓటర్లు 14 వేల వరకు ఉన్నారని, దరఖాస్తు చేసుకున్న 600 మంది వృద్దులు,పి.డబ్ల్యు డి ఓటర్ల కు ఇంటి వద్దనే ఓటు వేసేలా హోం ఓటింగ్ అవకాశం కల్పించామని, ఓట్ ఫర్ స్యూర్ అనే నినాదం ప్రజల్లోకి బలం గా వెళ్లిందని, తద్వారా ఓటింగ్ శాతం పెరిగిందని, పట్టణ,రూరల్ ప్రాంతాల్లో విపరీతం గా స్పందన లభించి గత అసెంబ్లీ ఎన్నికల్లో 78% వరకు పోలింగ్ నమోదు కావడం జరిగిందని, 362 మంది ట్రాన్స్ జెండర్ లు ఓటర్లు గా ఉన్నారని, వరంగల్ (తూర్పు) నియోజక వర్గం లో ట్రాన్స్ జెండర్ లు ఎక్కువగా ఉన్నారని, ఇదే స్ఫూర్తి,ప్రేరణ తో ఇంట్లో ఉన్నవారు మాత్రమే కాకుండా,తమ చుట్టుపక్కల వారు, బంధువులను చైతన్య పరిచి ఓటింగ్ లో పాల్గొనేలా ప్రోత్సహించాలని, రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, గత ఎన్నికల్లో అధికారులు సమన్వయం తో పనిచేశారని కితాబిచ్చిన కలెక్టర్ రానున్న ఎన్నికల్లో ఇదే తరహా స్ఫూర్తి ని కొనసాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ యంగ్ ఓటర్లు 30-40 సం.ల పాటు తమ ఓటు ద్వారా సమర్ధ వంతమైన నాయకులను ఎన్నుకుంటా రని, కేవలం వారు మాత్రమే ఓటు వేయడమే కాకుండా సమాజం లో ఉన్న ప్రతి వ్యక్తి ఓటు వేసేలా తమవంతు బాధ్యత గా తీసుకొంటు, స్వేచ్ఛా యుత వాతావరణం లో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు.ఓటరు దినోత్సవం సందర్భం గా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ అందించిన సందేశాన్ని ప్రదర్శించి, కార్యక్రమం లో పాల్గొన్న వారి చే ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు.ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి,గత ఎన్నికల్లో ఓటరు చైతన్యం పై విస్తృతం గా కార్యక్రమాలు చేపట్టిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్, కమీషనర్, ఆడిషనల్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు జ్ఞాపిక ల ప్రధానోత్సవం జరిగింది.ఈ సందర్భం గా ఎం జీ ఎం కూడలి లో ఓటరు చైతన్యం పై విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది.అంతకు ముందు బల్దియా ప్రధాన కార్యాలయ అవరణ లో ఓటరు అవగాహన ర్యాలీ నీ బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్ భాషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎం జీ ఎం జంక్షన్ వరకు కొనసాగింది. ఇట్టి కార్యక్రమం లో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,డి ఈ ఓ వాసంతి,పరిశ్రమల శాఖ జీ ఎం నర్సింహ మూర్తి, జిల్లా సహకార అధికారి, జిల్లా ఇంటిర్మీడియట్ అధికారి మాధవ రావు, సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# త్వరలోనే బిజెపి అభ్యర్థుల ఎంపిక

- 28న తెలంగాణకు అమిత్ షా
- బిజెపి చీఫ్ కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక పూర్తవు తుందని, వచ్చే వారంలోనే బీజేపీ అభ్యర్థు ల ప్రకటన ఉండే అవకాశం ఉందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షు డు కిషన్‌రెడ్డి తెలిపారు. 28న అమిత్ షా తెలంగాణలో పర్యటించ నున్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌పై బీజెపి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు మజ్లీస్ పార్టీని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నాయంటూ కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిపై విచారణ చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన లేదన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను దోపిడీ దొంగల పార్టీలుగా అభివర్ణించిన కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దోషులకు శిక్ష పడుతుందనే విశ్వాసం ప్రజలకు లేదన్నారు. బీఆర్‌ఎస్ అవినీతిని కాంగ్రెస్ బయటకు తీస్తుందని ఆశిస్తే అది భంగపడ్డట్లే అవుతుందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యా నించారు. బీజేపీ అగ్గిలాంటి పార్టీ. బీజేపీపై మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని సూచిస్తున్నా. బీఆర్‌ఎస్-బీజేపీ ఒకటేనని, కాంగ్రెస్?బీజేపీ ఒక్కటేనని మాట్లాడే వాళ్లను చెప్పుతో కొట్టే రోజులు వస్తాయి. తాము ఏ పార్టీతో కలవాల్సిన అవసరం లేదు. హైదరాబాద్ పార్లమెంట్‌లో పోటీ చేయడం కోసం కాదు.. అసదుద్దీన్‌ను ఓడించడం కోసమే పనిచేయాలి. హైదరాబాద్‌లో ఉన్న ముస్లిం సోదరులు మజ్లీస్ పార్టీని ఓడించాలని చూస్తున్నారు. మజ్లీస్ పార్టీని వ్యతిరేకించే ప్రతిఒక్కరూ బీజేపీ వైపు రావాలి. లక్షమంది అసదుద్దీన్‌లు వచ్చినా... మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఓడినా రఘునందన్‌కు బుద్ధి రాలే

### దుబ్బాక ఎమ్మెల్యే విమర్శలు

**సిద్దిపేట, జనవరి 25 (జనంసాక్షి):** దుబ్బాక నుంచి అసెంబ్లీకి పోటీచేసి బొక్కబోర్లా పడ్డా రఘునందన్ రావుకు ఇంకా జ్ఞానోదయం కాలేదని, ఇష్టారీతిగా మాట్లాడితే సహించేది లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పెద్దమాసాన్‌పల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడారు.నాడు తెలంగాణ ఉద్యమంలో, నేడు తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఓటమి ఎరుగని నేత హరీశ్‌రావుపై రఘునందన్‌రావు ప్రేలానణలు చేయడం తగదన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో అత్తెసరు మెజార్టీతో గెలిచిన రఘునందన్‌రావు ఎన్నికల హామీల్లో ఒక్క పనైనా నెరవేర్చారా అని ఆయన ప్రశ్నించారు. నేను ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంటులో ఏం మాట్లాడానో, ఎన్ని నిధులు తెచ్చానో తెలుసుకున్న తర్వాత మాట్లాడాలని హితవు పలికారు. తాము సీఎం రేవంత్‌రెడ్డిని కలవడమే పాపమన్నట్లు మాట్లాడుతున్నారని, సీఎం కాంగ్రెస్ పార్టీకా, రాష్ట్రానికా తెలుసుకోవాలన్నారు. ప్రజలకిచ్చిన హామీల కోసం తాను బరాబరిగా సీఎంతో పాటు మంత్రులను కలుస్తామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా తెలంగాణ ఉద్యమానికి జీవ గడ్డ అని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ స్థానంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని, రఘునందన్‌రావుకు మరోసారి ఎన్నికల్లో ప్రజలు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.

# శివబాలకృష్ణకు 14 రోజుల రిమాండ్

### కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడకు తరలింపు



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను ఏసీబీ కోర్టులో అధికారులు హాజరు పర్చారు. కాగా.. ఆయనకు కోర్టు 14రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఫిబ్రవరి 8వరకు రిమాండ్ ఉండనుంది. పోలీసులు ఆయన్ను చంచల్ గూడా జైలుకు తరలించారు. బాలకృష్ణ ఇంటితో పాటు 16 ప్రదేశాల్లో సోదాలు చేశామని ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడు బాలకృష్ణపై 13 (1) (శి), 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాలకృష్ణ ఇంటితో పాటు, బందువులు, సహచరుల ఇళ్లల్లో సోదాలు చేశామని పేర్కొన్నారు. బాలకృష్ణ ఇంట్లో రూ. 99.60 లక్షలు నగదు సీజ్ చేశామని స్పష్టం చేశారు. 1988 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశామని తెలిపారు. 6 కేజీల సిల్వర్ స?వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రూ. 8.26 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సీజ్ చేసిన ఆస్తుల విలువ మార్కెట్ వ్యాల్యూ లో ఇంకా ఎక్కువ ఉంటుందని అన్నారు. మిగిలిన బీనామీలపై విచారణ చేయాల్సి ఉందని తెలిపారు. ఏసీబీ అరెస్టుతో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. పుప్పాలగూడ సర్వేనెంబర్ 447లో కోర్టు పరిధిలోని వివాదస్పద భూములకు అనుమతులు ఇచ్చారని సూర్యప్రకాష్ అనే బాధితుడు తెలిపాడు. తమకు కోర్టు డిక్రీ ఉన్నప్పటికీ హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టి పరిమిషన్ ఇచ్చాడని వెల్లడించాడు. రఘురామ్ ప్రదీప్ కన్స్ట్రక్షన్ కు హైరేస్ అపార్ట్ మెంట్స్ కు అనుమతులు ఇచ్చాడని పేర్కొన్నాడు. అక్రమ అనుమతులపై హైకోర్టుకు వెళ్తే కోర్టును తప్పుదోవ పట్టించి ఫేక్ అఫిడవిట్ వేశారని తెలిపాడు. ఆర్టీఏ ద్వారా సమాచారం అడిగితే ఇప్పటివరకు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా దాటవేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ. 400కోట్ల విలువైన 6.36 ఎకరాల భూమిలో అక్రమ పర్మిషన్ ఇచ్చాడని బాధితులు తెలిపాడు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఉన్నారని గతంలో తమను బెదిరించారని తెలిపారు. సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శివ బాలకృష్ణ హయాంలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరుతున్నారు.

# అదానీపై హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఏడాది..




### 7 షేర్లు ఇంకా దిగువనే!

**ముంబయి జనం సాక్షి:**

అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడుతోందంటూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసి ఏడాది గడిచింది. దేశ స్టాక్ మార్కెట్‌లో తీవ్ర కుదుపునకు కారణమైన ఈ ఉదంతంతో అదానీ గ్రూప్ కంపెనీ షేర్లు భారీ పతనాన్ని చవిచూశాయి. పదింటిలో ఇప్పటికీ ఏడు సంస్థల షేర్లు మునుపటితో పోలిస్తే దిగువనే ట్రేడవుతున్నాయి.

### మార్కెట్ క్యాప్ ఇంకా 24%..

స్టాక్ ఎక్స్ఛేంజీల డేటా ప్రకారం.. హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ముందు రూ.19.23 లక్షల కోట్ల వద్ద అదానీ గ్రూప్ మార్కెట్ క్యాప్ రికార్డు గరిష్ఠానికి చేరింది. 2024 జనవరి 24న స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి ఈ విలువ రూ.14.52 లక్షల కోట్లుగా ఉంది. అంటే గరిష్ఠం నుంచి ఇంకా 24 శాతం పుంజుకోవాల్సి ఉంది.

### ఇదీ షేర్ల పరిస్థితి..

అదానీ గ్రూప్‌లోని మొత్తం పది నమోదిత సంస్థల్లో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ పవర్, అంబుజా సిమెంట్స్ షేర్ల ధరలు మాత్రమే మునుపటి స్థాయికి చేరాయి. గత ఏడాది వ్యవధిలో అదానీ పవర్ 89 శాతం, అదానీ పోర్ట్స్ 47 శాతం, అంబుజా సిమెంట్స్ షేర్లు 5 శాతం రాణించాయి. మిగిలిన కంపెనీల షేర్లన్నీ ఇంకా దిగువ స్థాయిల్లోనే ట్రేడవుతున్నాయి. 2024 జనవరి 24 ముగింపు ధరలను పరిగణనలోకి తీసుకుంటే అదానీ టోటల్ గ్యాస్ షేర్లు 74 శాతం, అదానీ విల్మర్ 38 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 15 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 14 శాతం, ఎన్‌డీటీవీ 6 శాతం, ఏసీసీ 4 శాతం మేర పుంజుకోవాల్సి ఉంది. హిండెన్‌బర్గ్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన అదానీ గ్రూప్.. ఇన్వెస్టర్లలో విశ్వాసం నింపడం కోసం పలు చర్యలు చేపట్టింది. రుణ వాయిదాలను ముందస్తుగానే చెల్లించింది. కొత్తగా నిధులను సమీకరించుకుంది. మరోవైపు హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సెబీ దర్యాప్తు, ఆరోపణలపై ఇతర సంస్థల విచారణ అవసరం లేదంటూ ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల వంటి పరిణామాలూ షేర్లు కనిష్ఠాల నుంచి పుంజుకోవడానికి దోహదం చేశాయి.

### మరింత దృఢంగా మారాం: గౌతమ్ అదానీ

హిండెన్‌బర్గ్ ఆరోపణలు గత ఏడాది వ్యవధిలో తమని మరింత దృఢంగా మార్చాయని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఈ అనుభవం తమకు విలువైన పాఠాలు నేర్పిందని తాజాగా 'టైమ్స్ ఆఫ్ ఇండియా'కు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. సాధారణంగా షార్ట్ సెల్లర్ల ఆరోపణలు కేవలం ఫైనాన్షియల్ మార్కెట్లకు మాత్రమే పరిమితమవుతాయన్నారు. కానీ, అదానీ గ్రూప్‌పై వచ్చినవి మాత్రం రాజకీయ రంగు కూడా పులుముకున్నాయని ఆరోపించారు. నిరాధార ఆరోపణల వల్ల వేలాదిమంది రిటైల్ మదుపరులు నష్టపోవడం తనను తీవ్రంగా బాధించిందని గౌతమ్ అదానీ అన్నారు. తమపై ఆరోపణలు గుప్పించిన వారి ప్రణాళికలు పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదన్నారు. లేదంటే దేశంలో చాలా కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, విద్యుత్ ప్రాజెక్టులపై పెనుప్రభావం ఉండేదని వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులు తమకు కొత్త కాదని, ఇకపై ఆగుతాయన్న భ్రమలోనూ లేమని చెప్పారు.

**ఇవీ హిండెన్‌బర్గ్ ఆరోపణలు..**

అదానీ గ్రూప్ తమ నమోదిత కంపెనీల షేర్ల ధరల్ని కృత్రిమంగా పెంచిందని 2023 జనవరి 23న వెలువడిన నివేదికలో అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. అలా విలువ పెరిగిన షేర్లను తనఖా పెట్టి రుణాలను పొందిందని ఆరోపించింది. అకౌంటింగ్ మోసాలకు సైతం పాల్పడినట్లు పేర్కొంది. పన్నుల విషయంలో స్నేహపూరితంగా ఉండే కరేబియన్, మారిషస్‌ల నుంచి యూఏఈ దేశాల్లో అదానీ కుటుంబం పలు డొల్ల కంపెనీలను నియంత్రిస్తోందని తెలిపింది. వీటి ద్వారానే అవినీతి, అక్రమ నగదు బదలాయింపులకు పాల్పడుతోందని ఆరోపించింది. ఈ ఆరోపణల్ని అదానీ గ్రూప్ తీవ్రంగా ఖండించింది.

# ఇక అన్ని ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్.. నేటి నుంచే అమల్లోకి



**దిల్లీ జనం సాక్షి:**

ప్రైవేటు ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్‌కు సంబంధించి కీలక నిర్ణయం వెలువడింది. ఆరోగ్య బీమా తీసుకున్న వారు అన్ని ఆస్పత్రుల్లో 'క్యాష్‌లెస్' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. గురువారం నుంచే అందుబాటులోకి వచ్చినట్లు 'ది జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్' వెల్లడించింది. జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలతో సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఇన్సూరెన్స్ పాలసీ నెట్‌వర్క్ జాబితాలో పేరు లేని హాస్పిటల్‌లోనూ క్యాష్‌లెస్ సదుపాయాన్ని పొందొచ్చు. నెట్‌వర్క్ హాస్పిటల్ జాబితాలో లేని ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ సదుపాయం పొందేందుకు 48 గంటల ముందు ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేయాలి. అత్యవసర సమయాల్లో అయితే ఆస్పత్రిలో చేరిన 48 గంటల్లోపు సమాచారాన్ని చేరవేయాల్సి ఉంటుంది. ఇన్సూరెన్స్ పాలసీ షరతులు, నిబంధనల ఆధారంగా క్లెయిం వర్తిస్తుందని కౌన్సిల్ పేర్కొంది. ప్రస్తుతం ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో మాత్రమే క్యాష్‌లెస్‌కు అనుమతి ఉంది. క్యాష్‌లెస్ సదుపాయం లేని చోట ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చును జేబులోంచి చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండడం, రిఫండ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక నుంచి ఈ సమస్యలు తప్పనున్నాయి. 'క్యాష్‌లెస్' గురించి ఇప్పటికే ఆయా కంపెనీలు కస్టమర్లకు సందేశాలు పంపిస్తున్నాయి. "అన్నిచోట్ల క్యాష్‌లెస్ సదుపాయం కస్టమర్ల జీవితాలను మరింత సులభతరం చేయనుంది. ప్రస్తుతం 63 శాతం మంది క్యాష్‌లెస్ సదుపాయం ఎంచుకుంటుంటే.. మిగిలినవారు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. రిఫండ్ ప్రక్రియ వల్ల కస్టమర్లు ఆర్థికంగా ఒత్తిడితో పాటు క్లెయిం చేసుకునే విషయంలోనూ అవాంతరాలు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికే తాజా నిర్ణయం తీసుకున్నాం. మోసాలను అరికట్టి కస్టమర్ల విశ్వాసం పొందేందుకు ఇది ఉపకరిస్తుంది" అని కౌన్సిల్ ఎండీ, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈఓ తపన్ సింఘేల్ తెలిపారు.




# మెప్పించిన ఐఓసీ

## అక్టోబరు-డిసెంబరు లాభం రూ.8,063 కోట్లు

**దిల్లీ జనం సాక్షి:**

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.8,063.39 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.448.01 కోట్లతో పోలిస్తే ఇది చాలా రెట్లు అధికం. సెప్టెంబరు త్రైమాసిక లాభం రూ.12,967.32 కోట్లతో పోలిస్తే మాత్రం తగ్గింది. ముడిచమురు ధర పెరుగుతున్నా, దేశీయంగా పెట్రోల్-డీజిల్ రిటైల్ ధరల్లో సవరణ చేయకున్నా, ఐఓసీ రాణించడం గమనార్హం. కార్యకలాపాల ఆదాయం రూ.2.28 లక్షల కోట్ల నుంచి రూ.2.23 లక్షల కోట్లకు తగ్గింది. పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలపై పన్ను ముందు లాభం రూ.1,541.95 కోట్ల నుంచి రూ.11,428.88 కోట్లకు చేరింది. 2022 ఏప్రిల్-సెప్టెంబరు మధ్య పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను, ముడి చమురు ధరలకు అనుగుణంగా సవరించనందున ఐఓసీకి రూ.2,264.88 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఇదే కాలంలో రూ.26,717.76 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరం మొత్తంమీద ప్రకటించిన రూ.24,184 కోట్ల నికర లాభం కంటే ఇది ఎక్కువ కావడం విశేషం. 2023 ఏప్రిల్-డిసెంబరు మధ్య 9 నెలల కాలానికి ఐఓసీ రూ.34,781.15 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.1,816.87 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ఏప్రిల్-డిసెంబరు మధ్య ప్రతి బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం ద్వారా సంస్థ 13.26 డాలర్లను ఆర్జించింది. 2022-23 ఇదే కాలంలో స్థూల రిఫైనింగ్ మార్జిన్ (జీఆర్ఎం) 21.08 డాలర్లుగా నమోదైంది. స్థూల మార్కెటింగ్ మార్జిన్ లీటరుకు రూ.3.8గా లెక్కించింది. సమీక్షా త్రైమాసికంలో 23.32 మిలియన్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను కంపెనీ విక్రయించింది. 2022-23 ఇదే త్రైమాసికంలో 23.17 మి.టన్నులు, సెప్టెంబరు త్రైమాసికంలో 21.94 మి.టన్నుల అమ్మకాలు జరిగాయి.

# 3 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లోకి మైక్రోసాఫ్ట్




### ఎఐతో కంపెనీ షేర్లకు బూస్ట్!

**వాషింగ్టన్ జనం సాక్షి:** ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ మూడు ట్రిలియన్ డాలర్లు దాటింది. ప్రపంచంలో ఈ కీలక మైలురాయిని దాటిన రెండో కంపెనీ ఇది. సంస్థ షేరు విలువ బుధవారం 1.3 శాతానికి పైగా పెరిగి 404 డాలర్లకు చేరడంతో ఈ రికార్డు నమోదైంది. ఐఫోన్ల తయారీ కంపెనీ యాపిల్ గతేడాది జూన్‌లో మూడు ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ సాధించిన తొలి సంస్థగా నిలిచింది. బుధవారం ఓ దశలో యాపిల్‌ను దాటేసిన మైక్రోసాఫ్ట్.. షేర్లు కుంగడంతో కిందకు దిగొచ్చింది. 2023లో మైక్రోసాఫ్ట్ షేరు ధర 57 శాతానికి పైగా పుంజుకుంది. ఆ జోరు ఈ ఏడాది కూడా కొనసాగుతోంది. జనవరిలో ఇప్పటి వరకు ఏడు శాతానికి పైగా లాభపడింది. అదే సమయంలో నాస్‌డాక్ 100 సూచీ 4.6 శాతం పెరిగింది. కృత్రిమ మేధపై మైక్రోసాఫ్ట్ పెట్టుబడులే స్టాక్ రాణించడానికి కారణమని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఓపెన్‌ఏఐతో కలిసి ఇప్పటికే ఈ కంపెనీ కొత్త టూల్స్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రానున్న రోజుల్లో మరిన్ని అత్యాధునిక ఏఐ ఆవిష్కరణలపైనా పరిశోధనలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు కంపెనీ పనితీరుపై బలమైన విశ్వాసంతో ఉన్నారని నిపుణుల అంచనా. త్వరలో మైక్రోసాఫ్ట్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనుంది. ఆదాయం, లాభాలు అంచనాలను మించుతాయని భావిస్తున్నారు.

# ప్రాంగణ ఎంపికలు చేపడతాం

**ముంబయి జనం సాక్షి:**




ఈ ఏడాదిలో కళాశాలలను సందర్శించి, ప్రాంగణ నియామకాలు (ఫ్రెషర్లు) చేపడతామని టెక్ మహీంద్రా సీఈఓ మిలింద్ జోషి జోషి స్పష్టం చేశారు. సెప్టెంబరు చివరికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,50,604గా ఉండగా..డిసెంబరు ఆఖరుకు 1,46,250కు తగ్గిందని, డిసెంబరు త్రైమాసిక ఫలితాల సందర్భంగా తెలిపారు. అక్టోబరు-డిసెంబరులో టెక్ మహీంద్రా నికర లాభం రూ.510.4 కోట్లుగా నమోదైంది. 2022-23 ఇదేకాల లాభం రూ.1296.6 కోట్లతో పోలిస్తే ఇది 60% తక్కువ. ఆపరేటింగ్ లాభాల మార్జిన్లు 12% నుంచి 5.4 శాతానికి తగ్గడం ఇందుకు కారణం. కార్యకలాపాల ఆదాయం 4.6% తగ్గి రూ.13,101 కోట్లకు పరిమితమైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కొత్త ఒప్పందాలు 381 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. సంస్థాగత మార్పులను ఏప్రిల్‌లో వెల్లడిస్తామని, కొత్త ఆర్డర్లు పుంజుకోవడానికి 6-9 నెలల సమయం పట్టొచ్చని జోషి అన్నారు.

# వాహనాలు ఢీ .. సీసీటీవీలో రికార్డ్ అయిన భయానక దృశ్యాలు

చెన్నై జనం సాక్షి:

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకొంది. వరుసగా వెళుతున్న నాలుగు వాహనాలు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. సీసీ ఫుటేజీలో రికార్డు అయిన ఈ భయానక దృశ్యాలు వైరల్‌గా మారాయి. ధర్మపురి జిల్లాలోని తోప్పూర్ ఘాట్ రోడ్డుపై వరుసగా వాహనాలు వెళుతున్నాయి. వెనక నుంచి అతివేగంగా వస్తున్న ఓ ట్రక్కు ముందున్న వాహనాలను ఢీకొట్టింది. దీంతో మరో ట్రక్కు వంతెన పైనుంచి కిందకు పడింది. రెండు భారీ వాహనాల మధ్య చిక్కుకుని ఓ కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనాలకు మంటలు వ్యాపించడంతో ఆ దారిలో పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు.. క్షతగాత్రులకు రూ. 50వేల పరిహారం ప్రకటించారు.

## జాతీయం అంతర్జాతీయం



# జోడోయాత్రలో రాహుల్‌గాంధీ డూప్

## తీవ్ర విమర్శలు చేసిన అస్సాం సీఎం

**గువాహటి జనం సాక్షి:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర విమర్శలు చేశారు. యాత్రలో రాహుల్ డూప్‌ను వాడుతున్నారంటూ మీడియా కథనాలను ఉటంకించారు. బస్సులో ఒక గదిలో ఆయన కూర్చుంటున్నారని వ్యాఖ్యలు చేశారు. 'ఇదంతా నేనేమీ చూడలేదు. కానీ దీని గురించి వచ్చిన మీడియా కథనాలను మాత్రం చూశాను. మామూలుగా రాహుల్ బస్సులోనే కూర్చుంటారని కాంగ్రెస్ నేతలు కొందరు నాకు చెప్పారు. అలాంటప్పుడు రాహుల్‌లా ఉండి, మనకు కనిపిస్తోన్న వ్యక్తి ఎవరు..? అస్సాంలో ఈ యాత్ర జరిగిన ప్రతి ప్రాంతంలో భాజపా గెలుస్తుంది. అలాంటప్పుడు దీని ఉద్దేశం ఏమిటో..? మతపరమైన ఘర్షణలు సృష్టించడానికేనా..? కానీ అస్సాం ప్రజలు అలా జరగనివ్వలేదు' అని హిమంత విమర్శించారు. ఇదిలా ఉంటే.. యాత్రలో భాగంగా హింసాత్మక చర్యలకు పాల్పడ్డారంటూ రాహుల్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులపై గువాహటి పోలీసులు మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదుచేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులకు సంబంధించి లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తరవాత అరెస్టులు ఉంటాయని హిమంత వెల్లడించారు. దీనిపై కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఎందుకు లోక్‌సభ ఎన్నికల వరకు ఎదురుచూస్తున్నారు..? రాహుల్ గాంధీ చట్టాన్ని ఉల్లంఘించి ఉంటే.. మీరు ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? ఆయన నిజం మాట్లాడుతున్నారు కాబట్టి మీరు అలా చేయలేరు. మీ పొరుగున ఉన్న మణిపుర్ ప్రజల కోసం మీరు గళం విప్పలేదు. ప్రజల ఆవేదనను ఆయన వినిపిస్తుండటంతో మీకు భయం కలుగుతోంది' అని విరుచుకుపడ్డారు. దీనికి హిమంత కౌంటర్ ఇచ్చారు. 'ఎన్నికల సమయంలో రాహుల్ కావాలి' అని వ్యంగ్యంగా బదులిచ్చారు.

# 160 కి.మీ. వేగంలోనూ 'కవచ్' పనితీరు భేష్!

**దిల్లీ జనం సాక్షి:**



రైలు ప్రమాదాల నివారణకు అభివృద్ధి చేసిన కవచ్ వ్యవస్థ వేగంగా ప్రయాణించే సమయంలోనూ మెరుగైన ఫలితాలను ఇచ్చినట్లు ఉత్తర మధ్య రైల్వే తెలిపింది. గత వారం హరియాణాలోని పల్వాల్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర స్టేషన్ల మధ్య నడిచే సెమీ-హైస్పీడ్ రైలులో ఈ వ్యవస్థను ఏర్పాటుచేసి పరీక్షించినట్లు ఆగ్రా రైల్వే డివిజన్ ప్రతినిధి ప్రశస్తి శ్రీవాస్తవ తెలిపారు. గంటకు 160 కి.మీ. వేగం వద్ద ఇది సమర్థంగా పనిచేసిందని ఒక ప్రకటనలో వెల్లడించారు. "కవచ్ వ్యవస్థను పరీక్షించేందుకు రెడ్ సిగ్నల్ పడినప్పుడు బ్రేకులు వేయొద్దని లోకో పైలట్‌కు సూచించాం. 160 కి.మీ. వేగంతో వస్తున్నా.. సిగ్నల్ పడగానే 30 మీటర్ల ముందే కవచ్ ఆటోమేటిగ్గా బ్రేకులు వేసి రైలును ఆపింది. ఇందులో ఉపయోగించిన ప్యాసింజర్ కోచ్‌లు శతాబ్ది, గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌లో వాడతారు. త్వరలో ప్రయాణికులతో కూడిన రైలులో ఈ వ్యవస్థను పరీక్షిస్తాం" అని ప్రశస్తి తెలిపారు. దిల్లీ-ఆగ్రాల మధ్య ఉన్న 125 కి.మీ. నెట్‌వర్క్‌ను అధికారులు మూడు భాగాలుగా విభజించారు. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే నెట్‌వర్క్‌లో గరిష్ఠ వేగం 130 కి.మీ.లు కాగా.. దిల్లీ-ఆగ్రాల మధ్య మాత్రం 160 కి.మీ. గతేడాది డిసెంబరులో కవచ్‌ను ఈ మార్గంలో 140 కి.మీ. వేగం వద్ద పరీక్షించారు. వందే భారత్ వంటి సెమీ-హైస్పీడ్ రైళ్ల నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న క్రమంలో ఇలాంటి వ్యవస్థలు ప్రమాదాల నియంత్రణలో కీలకమవుతాయని అధికారులు తెలిపారు.

### కవచ్ ఎలా పనిచేస్తుందంటే?

కవచ్ వ్యవస్థను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ రూపొందించింది. రెడ్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా లోకో పైలట్ రైలును ముందుకుతీసుకెళ్లడం, పట్టాలు సరిగా లేనప్పుడు, ఎదురెదురుగా రైళ్లు వస్తున్నప్పుడు, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినా గుర్తించి ఇది ఆపుతుంది. వంతెనలు, మలుపులు ఉన్నచోట పరిమితికి మించిన వేగంతో రైలును నడుపుతుంటే స్పందించి నిర్దేశిత వేగానికి తగ్గిస్తుందని ఆర్‌డీఎస్‌వో అధికారులు తెలిపారు.

# గణతంత్ర వేడుకలు.. భారత్‌కు చేరుకున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు

**జైపూర్ జనం సాక్షి:**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ భారత్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం మధ్యాహ్నం ఆయన రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో అడుగుపెట్టారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, రాష్ట్ర గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, సీఎం భజన్‌లాల్ శర్మ ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం దిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు మెక్రాన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న విషయం తెలిసిందే.

### గణతంత్ర కవాతుకు భారీ బందోబస్తు

జైపూర్ సమీపంలోని ఆమెర్ కోటను మెక్రాన్ సందర్శించనున్నట్లు సమాచారం. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపుపొందిన 'జంతర్ మంతర్'



వద్దకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనతో కలిసి రానున్నారు. అనంతరం అక్కడినుంచి సంగనేరి గేట్ వరకు వీరిద్దరూ రోడ్ షోలో పాల్గొంటారు. మధ్యలో హవా మహల్ వద్ద జైపూర్ స్పెషల్ మసాలా చాయ్ ఆస్వాదించనున్నట్లు తెలుస్తోంది. అక్కడే యూపీఐ చెల్లింపుల ద్వారా హస్త కళాకృతులు కొనుగోలు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాంబాగ్ ప్యాలెస్‌లో మెక్రాన్ కోసం ప్రత్యేక విందు ఏర్పాటుచేశారు. గణతంత్ర వేడుకలకు తొలుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ఆహ్వానించగా, వివిధ కారణాల వల్ల ఈ కార్యక్రమానికి హాజరుకాలేనని బైడెన్ చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడిని ఆహ్వానించగా ఆయన అంగీకరించారు. గతేడాది జులైలో పారిస్‌లో నిర్వహించిన ఫ్రాన్స్ జాతీయ దినోత్సవ 'బాస్టిల్ డే' పరేడ్‌లో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.




## జమ్మికుంట మున్సిపల్ పై వీగిన అవిశ్వాసం

**రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్.**

జమ్మికుంట, జనవరి 25 (జనవరి): జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వర్ రావు పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. కరీంనగర్ జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతి ఆదేశాల మేరకు తేదీ 25-01-2024 రోజున ఉదయం 10 గంటలకు జమ్మికుంట మున్సిపాలిటీలో అవిశ్వాసం ఉన్నదని అట్టి అవిశ్వాస తీర్మానానికి రావాలని కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశామని రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్ తెలిపారు. కాగా జమ్మికుంట మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా ఒక్క ఎక్స్ అఫీషియో సభ్యుడు ఉన్నాడనీ అందులో వన్ బై తడ్ 21 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి హాజరు కావలసి ఉండగా ఒక్క పదవార్డ్ కౌన్సిల్ సభ్యురాలు పొనగంటి విజయలక్ష్మి మాత్రమే హాజరైందని మిగతా సభ్యులు హాజరు కాకపోవడంతో తిరిగి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పొడిగించామని అయినా సభ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో పొనగంటి మల్లయ్య పెట్టిన అవిశ్వాసం కోరం లేక వీగిందని పోయిందని రెవెన్యూ డివిజనల్ అధికారి గా వచ్చిన మహేశ్వర్ తెలిపుతు, మళ్లీ మున్సిపల్ చైర్మన్ గా తక్కళ్ళపల్లి రాజేశ్వరరావే కొనసాగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా హుజరాబాద్ ఏసిపి జీవన్ రెడ్డి నేతృత్వంలో జమ్మికుంట సిఐ బర్పాటి రమేష్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ,హుజురాబాద్ సిఐ బొల్లం రమేష్, జమ్మికుంట ఎస్సై రాజేష్, ఇల్లందకుంట ఎస్సై రాజ్ కుమార్,ఏ ఎస్ ఐ రాధాకృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదివరాహ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి గంగుల దంపతులు

కమాన్ పూర్, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ దేవస్థానమైన శ్రీ ఆదివరాహ స్వామిని గురువారం సాయంత్రం మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ డైరెక్టర్ దండే కనక రత్నం శాలువా కప్పి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, సర్పంచ్ నీలం సరిత, దేవస్థాన డైరెక్టర్ దండే కనకరత్నం, యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ దేశ భవిష్యత్తును ఓటుతో మార్చండి

**గల్లీలో ఎవరున్నా సరే ఢిల్లీలో మోదీ ఉండాల్సిందే ● మోదీ పాలనతో 5వ స్థానానికి చేరుకున్న భారత్**

**కరీంనగర్ నవ యువ ఓటర్ల సమ్మేళనంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్**

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :** గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ఉండాల్సిందేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. మోదీ లేని భారత్ ను ఊహించుకోలేమని, దేశ చరిత్రను మార్చే పనులన్నీ ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకోసం నేటి యువత పూర్తిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాస్ పోర్టు కంటే విలువైన వజ్రాయుధం ఓటు, ఓటు హక్కుతో మీ తలరాతతోపాటు దేశ భవిష్యత్తును కూడా మార్చుకునే సత్తా ఉందన్నారు. కానీ నేటి యువత ఆశించిన స్థాయిలో ఓటు హక్కు నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. నవ యువత ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. 10వ స్థానంలో ఉన్న భారత్ ను 5వ స్థానానికి చేర్చిన మోదీని మళ్లీ ప్రధానిగా ఎన్నుకోవాల్సిన అవసరం యువతపై ఉందన్నారు. మోదీ మళ్లీ ప్రధాని అయితే భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ గా మారడం తథ్యమన్నారు. గురువారం రోజు తిమ్మాపూర్ లోని చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో నమో నవ మత్ దాత (నవ యువ ఓటర్ల సమ్మేళనం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్ష ప్రసారాలను వీరంతా వీక్షించారు. అనంతరం బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... మీకు తెలుసా?? ఈరోజు చాలా గొప్ప రోజు, భారతదేశానికి ప్రాణవాయువుగా




భావించే రోజు అదేమిటో తెలుసా?... జాతీయ ఓటర్ల దినోత్సవం (నేషనల్ ఓటర్స్ డే) భారత దేశ పునాదులు దేనిమీద నిలబడ్డాయని ప్రజాస్వామ్య మనే పునాది మీద ఆప్రజాస్వామ్యంలో కీలకమైనది ఏది? ఓటు హక్కు అని ఈ దేశంలో అంబానీ నుండి ఆమ్ అద్మీ వరకు సమానమైన హక్కు కలిగిన ఉన్నది ఏది? ఓటు మాత్రమేనని ఎంత డబ్బున్నోడైనా, లేనోడైనా ఒకే ఓటు ఉంటుందని అంబేద్కర్ సామాన్యుడికి ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు అని అంతటి పవర్ ఫుల్ వెపన్ మీకొద్దా? అని విద్యార్థులను ఉద్దేశించింది మాట్లాడారు.ఓటుకున్న పవర్ ఏందో మీలో ఎంతమందికి తెలుసు?? బాధాకరమేందంటే? చదువుకున్నోడికంటే చదువురానోడే ఓటు హక్కును ఎక్కువగా వినియోగించుకుంటున్నారని చదువుండి, పైసలుండి, పోలింగ్ బూత్ కు వెళ్లి ఓటేసే శక్తి ఉన్నా ఓటేయని వాళ్లలో చదువుకున్నోళ్లే ఎక్కువ ఉన్నారని ఇంకా బాధాకరమేందంటే మీ లాంటి యువ ఓటర్లే ఎక్కువ మంది ఉన్నారు.దేశం తలరాతను మార్చే శక్తి యువతకే ఉందని కొండల్ని పిండి చేసే దమ్ము మీలాంటి యువతకే ఉందని ఈ దేశ తలరాతను మార్చిన భగత్ సింగ్ ఏ వయసులో పోరాడిండు? ఈ దేశ ఖ్యాతి, సంస్కృతి, సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద ఏ వయసులో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిండు?... మరి మీరేం చేస్తున్నారు? ఓటనే వజ్రాయుధాన్ని కల్పించినా మీరు ఉపయోగించుకోవడం లేదు? ఇది కరెక్ట్ కాదని మీరు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చేదెవరో ఎంచుకోవాలంటే ఓటు అనే వజ్రాయుధాన్ని వాడండని ప్రపంచంలో 10వ స్థానంలో ఉన్న భారత్ ను నెంబర్ వన్ గా చేయాలనే సంకల్పంతో అహర్నిశలు కష్టపడుతున్న నాయకుడెవరో గుర్తించి ఎంచుకోవాలంటే ఓటు అనే పవర్ ఫుల్ వెపన్ ను వాడండి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కాలేజీల చైర్మన్ రమేష్ రెడ్డి, బిజేపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**కరీంనగర్బ్యూరో(జనంసాక్షి):**గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలకపాత్ర వహించిన బూత్ లెవల్ ఏజెంట్లు, బ్లాక్ మండల పట్టణ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులతో గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బూతులు కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురుమళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన దాదాపు 300 బూత్ లెవెల్ కన్వీనర్లు బయలుదేరడం జరిగింది.టిపిసిసి అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడుతున్న ఇట్టి శిక్షణా కార్యక్రమానికి జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున కర్గే ముఖ్యఅతిథిగా హాజరుకానుండగా రాష్ట్రానికి చెందిన పలువురు ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈ శిక్షణ శిబిరంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రణాళికలపై కార్యకర్తలకు పార్టీ అధిష్టానం దిశా నిర్దేశం చేయనుంది. కరీంనగర్ అసెంబ్లీ శిక్షణ శిబిరానికి తరలి వెళ్లిన వాహన



శ్రేణిని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మడుపు మోహన్ పార్టీ జెండా ఊపి ప్రారంభించగా, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్, పిసిసి కార్యదర్శి వైద్యుడు అంజన్ కుమార్, కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కామెడీ రామిరెడ్డి, నాయకులు జీడి రమేష్, సిరికొండ శివప్రసాద్, బాలబద్రి శంకర్, హై అలి, గంటా వెంకటరెడ్డి, మహిళా నాయకులు జ్యోతి, ముల్కల కవిత, మహాలక్ష్మి తో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

**కాపాడవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది**

**బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.**

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):**స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధితో కూడిన సుస్థిర ప్రజాస్వామ్యాన్ని ఒక్క ఓటుతోనే సాధించుకోగలమని, అలాంటి ఓటింగ్ డే ను మనందరం పండుగల నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనదేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసారని, అలాంటి దేశ అభివృద్ధిని ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల చేత, ప్రజల కొరకు పరిపాలనను నడిపే వ్యక్తిని చట్టబద్ధంగా ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవడంలో అందరు ముందుండాలని అన్నారు. ఓటు నైతిక విలువలతో కూడినదని, దానిని ప్రలోభాలకు, స్వలాభాల కొరకు వినియోగించుకోకుడదని అన్నారు. జిల్లాలో అర్హులైన వారందరు తమఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా స్వీప్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ ల కొరకు హోం ఓటింగ్ విదానాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కొన్ని చోట్ల ఓటర్లలో చైతన్యం కొరకు, వికలాంగులు తమకు కల్పించిన హోమ్ హోటింగ్ ను సద్వినియోగం చేసుకోకుండా స్వయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికే అసక్తి చూపారని తెలిపారు. జిల్లాలో మొత్తం 10,64,129 మంది ఓటర్లు ఉండగా అందులో మొదటి సారి ఓటుహక్కును వినియోగించుకున్నవారు 44,434, దివ్యాంగులు 23804 మంది ఉన్నారన్నారు. అదే విధంగా రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో జిల్లా 2వ స్థానంలో నిలిచిందని100శాతం థర్డ్ జండర్ల ఓటింగ్ జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ నాడు ఓటువేసిన ఓటరు ఎడమచేతి చూపుడు వేలుకు వేసే సిరా భారతదేశంలో తయారవుతుంది దీనిని ఇతర దేశాలు కూడా మనదగ్గర నుండే తీసుకునీటాయని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, భారతరాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటుహక్కును ఎవరు ప్రలోబాలకు, వర్ణ బేషజాలకు తావులేకుండా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటుహక్కును సద్వినియెగం చేసుకోవడానికి ప్రభుత్వం తరపున అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. గతంలో జరిగిన అసెంబ్లి ఎన్నికలలో కరీంనగర్ అర్బన్ లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైనీదని, వచ్చే ఎన్నికలలో ఓటర్లందరు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోని జిల్లాను ముందంజలో నిలబెడదామని అందరు ప్రతిజ్ఞచేయాలని పిలుపు నిచ్చారు. ఓటు వేసేటప్పుడు ఆలోచించి వేసి అర్హులైన వారిని ఎన్నుకోవాలని అన్నారు. స్వేచ్ఛగా, బాధ్యతగా ఓటు వేయాలన్నారు. చివరగా సీనియర్ సిటిజన్ లను, వికలాంగులను సత్కరించి నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేశారు. థర్డ్ జండర్లను, ఎన్నికలలో అత్యుత్తమ సేవలను అందించిన తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఓటు ప్రతిజ్ఞను చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ పవన్ కుమార్, టౌన్ ఎసిపి నరేందర్, డిడబ్ల్యుఓ సరస్వతి, ఇంచార్జ మున్సిపల్ కమీషనర్ స్వరుపారాణి, ఏఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు పట్టాలకోసం డబ్బులు వసూలు

**కౌన్సిలర్ భర్త ఎండి షాకీర్ పై కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు**

**మెట్పల్లి , జనవరి 25,(జనంసాక్షి):**

పట్టణంలోని డిడి నగర్ టీచర్స్ కాలనీలతో పాటు మెట్పల్లి మండలం లోగల అర్బన్ కాలనీ (12)వ వార్డులలో ఇందిరమ్మ ఇండ్లను స్థలాలను మెట్పల్లి మున్సిపాలిటీ నుండి పట్టా ఇప్పిస్తానని అమాయకమైన ప్రజల దగ్గర నుండి వార్డ్ కౌన్సిలర్ భర్త ఎండి షాకీర్ డబ్బులు వసూలు చేస్తూ వారిని మోసం చేస్తున్నాడని , పట్టణానికి చెందిన మహమ్మద్ హకీమ్ గురువారం జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశాడు. అంతే కాకుండా వాటి అమ్మకాలు జరిపితే కొన్న వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాడని ఒకవేళ అయ్యని సమక్షంలో మున్సిపల్ అధికారులతో కలిసి బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆయన పరిధిలోని ఇండ్లలో కరెంటు మీటర్ పెట్టాలన్న కౌన్సిలర్ భర్త ఎండి షాకీర్ అనుమతి లేనిదే మీటర్లు పెట్టారని ఆ ఏరియాలో నూతన నిర్మాణాలు చేపడితే కౌన్సిలర్ భర్త పర్మిషన్ తీసుకొని డబ్బులు కట్టాలని లేదంటే మున్సిపల్ అధికారులతో కలిసి కుమ్మక్కై నిర్మాణాన్ని నిలుపుదల చేయించి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడంటూ లేఖ లో వివరించాడు. అయినా అతని మాట వినకుండా నిర్మాణాలు చేపడితే పోలీస్ వార్చే అక్రమ కేసులు పెట్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని గతంలో ఎన్నో సంవత్సరాల నుండి ఎలాంటి అక్రమాలకు దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతు ప్రతి అధికార కార్యక్రమానికి తానే కౌన్సిలర్ అంటూ దౌర్జన్యం చేస్తున్నాడని , అంతేకాకుండా ఎండి షాకీర్ అర్బన్ కాలనీలో ఉన్న ఎన్నో ఇందిరమ్మ ప్లాట్లను చట్ట వ్యతిరేకంగా అమ్ముకున్నాడని ,12వ వార్డ్ కౌన్సిలర్ భర్త ఎండి షాకీర్ పై చట్టరిత్య చర్యలు తీసుకొని కౌన్సిలర్ అయిన ఫర్జానా బేగం ని కౌన్సిలర్ గా అనర్హురాలు గా ప్రకటించి ఇందిరమ్మ ఇండ్లను ఎంక్వయిరీ చేయించి ఎండి షాకీర్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో కోరాడు. అయితే మెట్పల్లి పట్టణంలోనే అర్బన్ కాలనీలో ( అమ్మక్కపేట్ ) లో మొత్తం ఇందిరమ్మ ఇండ్లు దాదాపు 1400 ఫ్లాట్లు నిరుపేద వారికి అలట్ కాగా అక్కడ కేవలం 140 ప్లాట్ లలోనే ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని మిగతా ప్లాట్లు దాదాపు 800 పైగా ప్లాట్లు అక్రమానికి గురయ్యాయని ఈ విషయంలో కూడా సమగ్ర విచారణ జరిపి ఆ స్థలలను దళారుల నుండి కాపాడి నిరుపేద కుటుంబాలకు చెందే విధంగా చేయాలని కోరాడు.

## ఎంసెట్ ఇకపై ఈఏపీసెట్

అయితే ఎంసెట్ పేరును ఉన్నత విద్యామండలి మార్చింది. టీఎస్ ఈఏపీసెట్గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో 2024-25 విద్యాసంవత్సరానికి ఈఏపీ సెట్ సహా మరో ఆరు కామన్ ఎంట్రెన్స్ టెస్టుల తేదీలు ఖరారయ్యాయి. ఇక ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ను ఉన్నత విద్యామండలి గురువారం విడుదల చేసింది. మే 9 నుంచి 11వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహించున్నారు. మే 12, 13 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మాసీ ప్రవేశ పరీక్ష జరగనుంది. జేఎన్టీయూ హైదరాబాద్ ఆధ్వర్యంలో టీఎస్ ఎంసెట్ నిర్వహించనున్నారు. ఇక టీఎస్ ఈసెట్ ప్రవేశ పరీక్ష ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరగనుంది. ఈ ప్రవేశ పరీక్షను మే 6వ తేదీన నిర్వహించనున్నారు. బీఈడీ కోర్సులో ప్రవేశం కోసం ఉద్దేశించిన టీఎస్ ఎడ్ సెట్ ప్రవేశ పరీక్ష మే 23న జరగనుంది. నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఈ పరీక్షను నిర్వహించనుంది. 3 ఏండ్ల న్యాయవిద్య, 5 ఏండ్ల లా కోర్సులో ప్రవేశానికై నిర్వహించే టీఎస్ లా సెట్ ఎంట్రన్స్ టెస్ట్.. జూన్ 3వ తేదీన నిర్వహించనున్నారు. అదే రోజు? ఎల్ఎల్ఎం ఎంట్రెన్స్ టెస్టును కూడా నిర్వహించనున్నారు. లాసెట్, పీజీ ఎల్సెట్లను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది.ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్ష.. జూన్ 4, 5వ తేదీల్లో నిర్వహించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ నిర్వహణలో ఈ కామన్ ఎంట్రెన్స్ టెస్టు జరగనుంది. ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన టీఎస్ పీజీఈసెట్ పరీక్ష? జూన్ 6 నుంచి 8 తేదీల మధ్యలో నిర్వహించనున్నారు. హైదరాబాద్ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఈ కామన్ ఎంట్రెన్స్ టెస్టులు జరగనున్నాయి. బీపీఎడ్, డీపీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పీఈసెట్ పరీక్ష జూన్ 10 నుంచి 13వ తేదీల మధ్యలో నిర్వహించనున్నారు. ఈ ఎంట్రెన్స్ టెస్టును శాతవాహన యూనివర్సిటీ నిర్వహించనుంది.

# అల్ఫోర్స్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ఆఫ్ ఎక్సలెన్స్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 25 (జనంసాక్షి):**ఆంగ్ల భాషకు ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన గుర్తింపున్నదని పలు పోటి పరీక్షల విజయాలలో కీలకంగా వ్యవహరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ టైని టాట్స్ పాఠశాలలో విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్లో ప్రశంసనీయమైన ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిధిగా హాజరై వారు మాట్లాడారు.నేడు ప్రతి విద్యార్థి ఆంగ్ల సంబందిత పోటీ పరీక్షల గురించి తెలుసుకోవల్సిన అవసరం ఎంతగానో ఉన్నదని వారికి కావల్సిన అంశాలను తెలియచేయాలని తెలిపారు. ఆంగ్లం ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను సునాయసంగా ఉపయోగించవచ్చని పలు సంస్థల్లో చాలా సులభంగా నిర్వర్తించగలుగుతామని తెలిపారు. ఆంగ్ల భాషకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉండడం వలన ఉపాధి అవకాశాలు అత్యధికంగా ఉండడమే కాకుండా పెద్ద మొత్తం జీతాలతో ఉత్తమమైన జీవితాన్ని కొనసాగించవచ్చని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన యన్.ఓ.యఫ్ వారు నిర్వహింపబడిన అంతర్జాతీయ స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్లో పాఠశాలకు చెందినటువంటి బి.శ్రేయాన్స్,1వ తరగతి, ఎమ్.డి



ఆయానుద్దిన్, ఎమ్.డి. ఫరహానుద్దీన్, టి.విఘ్నేశ్వర సాయి, హైమద్, 2 వ తరగతి , తదితర విద్యార్థులు గోల్డ్ మెడల్స్ ఆఫ్ ఎక్సెన్స్ , ప్రశంసా పత్రాలను గెలుచుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్లో మరిన్ని విజయాలను నమోదుచేయాలని ఆకాంక్షించారు. విజేతలకు పుష్పగుచ్చాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన జీఎం శ్రీనివాస్.

**గోదావరిఖని, జనవరి 25, (జనంసాక్షి) :**

స్థానిక జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను త్వరితగతిన చేయాలని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్జీ-1 ఏరియా జీయం చింతల శ్రీనివాసు జవహర్లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ-1 ఏరియాలో నిర్వహించనున్న 75వ గణతంత్రదినోత్సవ వేడుకలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు.అన్ని గనులు, డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులు వారికి నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ వేడుకలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్టు మార్చ్ పాస్ట్, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, పలు సాంస్కృతిక కార్యాక్రమాలు ఉంటాయన్నారు.ఉదయం 9 గంటలకు కార్యాక్రమం ప్రారంభంకానున్నదన్నారు.ఉద్యోగులు, సూపర్ వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు,పట్టణ ప్రాంత పురజనులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్ఓ టు జీఎం ఎం.రామ్మోహన్, ఏజీఎం (పర్సనల్) లక్ష్మినారాయణ, డీజీఎం (సివిల్) నాగేశ్వర్రావు, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, డీజీఎం (ఏరియా వర్క్షాప్) మదన్మోహన్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ పిఒ బంగారు సారంగపాణి, డివైఎస్.ఈ.వసంత్కుమార్,ఇతర అధికారులు జీఎం వెంట ఉన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి)** :గణతంత్ర దినోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను సందర్శించి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చి వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... ఘనంగా వేడుకలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ రాజు, ఆర్డీవో మహేశ్వర్, ఏసిపిలు ప్రతాప్, నరేందర్, ఇంచార్జ మున్సిపల్ కమిషనర్ స్వరూప రాణి, డిఈఓ జనార్ధన్ రావు, డిడబ్ల్యుఓ సరస్వతి, తాహసిల్దార్లు రాజేష్, నవీన్ కుమార్, సురేష్, ఆర్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.






## క్రీడాకారులకు దుస్తులు పంపిణీ..

**గోదావరిఖని, జనవరి 25, (జనంసాక్షి) :**

సింగరేణి ఆర్జీ-1 ఏరియా పరిధి జవహర్లాల్నెహ్రూ క్రీడామైదానంలో 2022-23 సంవత్సరానికిగాను ఆర్జీ-1 ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ) ఆధ్వర్యంలో 'నియర్ బై ఏరియా'లలో నిర్వహించిన వివిధ క్రీడలలో ఎంపికైన క్రీడా కారులకు కార్పోరేట్ నుంచి వచ్చిన క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రామానికి ముఖ్యఅతిథిగా ఆర్జీ-1 ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ హాజరయ్యారు.జీఎం చేతుల మీదుగా క్రీడాకారులకు దుస్తుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడలలో పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు.ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడలలో పాల్గొనాలని సూచించారు.వారికి ప్రోత్సాహకంగా క్రీడాదుస్తులు పంపిణీ చేయటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు.జీఎం ఎం.రామ్మోహన్, (డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ) చీఫ్ కో-ఆర్డినేటర్, ఏజీఎం (పర్సనల్) సిహెచ్.లక్ష్మినారాయణ, ఎన్విరాన్మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, ఆర్జీ-1 ఏరియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్వైజర్ రమేష్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రాజయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏసిపి పింగళి నరేష్ రెడ్డిని వరించిన 'ఇండియన్ పోలీస్ మెడల్'

**హుజూరాబాద్, జనవరి 25 (జనంసాక్షి):** ముక్కుసూటి తనం ఆయన నైజం... నేరస్తులకు ఆయన పేరే సింహ స్వప్నం... దగ్గరుండి మరీ వి స్టరీలను ఛేదించడం, సిబ్బందిని క్రమశిక్షణ బాటలో నడిపించడం, సమస్యంటూ తన దగ్గరకు వచ్చే సామాన్యలకు స్వాంతన అవ్వడం ఇవన్నీ కలిసాయంటే ఆయనే అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పింగళి నరేష్ రెడ్డి.



ఎక్కడ పనిచేసినా తన పని తీరుతో అటు పోలీస్ శాఖలోనూ...ఇటు సామాన్య ప్రజల గుండెల్లోనూ సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో పింగళి పురుషోత్తం రెడ్డి-వసుమతి దంపతులకు జన్మించారు. నరేష్ రెడ్డి. అందరికీ ఒక్క అమ్మా నాన్న ప్రేమ దొరికితే తాను పింగిళి సుదర్శన్ రెడ్డి- పద్మావతి దంపతులకు దత్తపుత్రుడై ఇద్దరు అమ్మల, ఇద్దరు నాన్నల ప్రేమను అందిపుచ్చుకున్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యలను వంగపల్లిలో, జమ్మికుంట హనుమకొండలలో పూర్తి చేసారు. సమాజంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకోవాలని పోలీస్ శాఖ పై మక్కువతో ఇ 1991 జూలై 15న సబ్ ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు పింగళి నరేష్ రెడ్డి. 1993లో హైదరాబాద్ వాస్తవ్యురాలు వీణను వివాహమాడారు నరేష్ రెడ్డి. ఈ దంపతులకు కుమార్తె నివేదిత, కుమారుడు ఆకాష్ ఆణిముత్యాలు లాంటి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులకు తగ్గ తనయ, తనయులుగా పేరు తెచ్చుకున్నారు పిల్లలు.. కుమార్తె నివేదిత హైదరాబాదులో డాక్టర్గా సేవలందిస్తుండగా.. కుమారుడు ఆకాష్ యుఎస్లో ఎంఎస్ చేస్తున్నారు. సమాజ సేవలోనూ ముందున్న పింగళి కుటుంబం. వ్యవసాయ కుటుంబ నేపథ్యం కలిగిన పింగళి కుటుంబం సమాజ సేవలోనూ.. రాజకీయంగానూ..ఎప్పుడూ ముందే ఉంటుంది. పింగళి నరేష్ రెడ్డి తండ్రి 25 సంవత్సరాల పాటు సర్పంచ్గా తన ఊరికి సేవలందించారు. పింగళి బ్రదర్స్ క్రీడలను ప్రోత్సహిస్తూ.. యువతను ముందుకు నడిపించారు. పింగళి రమేష్ రెడ్డి, పింగళి సురేష్ రెడ్డి, పింగళి నరేష్ రెడ్డిలు క్రీడల పట్ల ఎంతో మక్కువతో క్రికెట్, అథ్లెటిక్స్లో రాణించారు. పింగళి నరేష్ రెడ్డి పని చేసిన చోటల్లా క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులకు అండగా నిలిచారు. ఆయన ప్రస్థానం పోలీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అనంతరం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండల ఎస్సైగా మొదటి పోస్టింగ్ పొందారు. పింగళి నరేష్రెడ్డి అప్పటికే కొనిజర్ల మండలంలో రాజకీయ కక్షలు పురివిప్పుకొని హత్యలు, ప్రతీకార హత్యలతో అట్టుడుకుతోంది. అలాంటి ఫ్యాక్షన్ పరిస్థితుల్లో మొదటి పోస్టింగ్ పొందిన పింగళి న రేష్ రెడ్డి తనదైన శైలిలో సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసి శాంతి భద్రతల పరిరక్షణకు బాటలు వేశారు. ఆయన వచ్చిన అనతి కాలంలోనే మండలంలో మళ్లీ సామాన్య పరిస్థితులు ఏర్పడి శాంతిభద్రతలు అదుపులోకి తీసుకురావడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని ఆ మండల ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటారు. మణుగూరు, మోతుగూడెం, ఇల్లందు ప్రాంతాలలో నరేష్ రెడ్డి పని చేసిన సమయంలో మావోయిస్టు కార్యకలాపాలు జోరుగా సాగుతుండేవి. ఇన్ఫార్మర్ల నెపంతో సామాన్యులను నక్సల్స్ మట్టు పెడుతుండడం, సామాన్య ప్రజా జీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో అప్పట్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు జిల్లా పోలీస్ శాఖలోనే మార్పులు తీసుకొచ్చాయి.

ఆట

## ఇంకో అడుగు

**ఆస్ట్రేలియా ఓపెన్ 2024 ఫైనల్ చేరిన బోపన్న జోడీ**

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2024 పురుషుల డబుల్స్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో, రోహన్ బోపన్న, అతని భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ అద్భుతమైన విజయం సాధించారు. దీంతో ఈ జోడీ ఫైనల్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 6-3, 3-6,7-6 (10-7)తో చైనాకు చెందిన జాంగ్ జిజెన్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన టోమస్ మచక్‌లపై అద్భుత విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయంతో బోపన్న తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. 43 ఏళ్ల రోహన్ బోపన్న తన తొలి గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకోవడానికి ఇప్పుడు కేవలం ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు. ఈ ఫైనల్ మ్యాచ్ కూడా బోపన్నకు ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది బోపన్న కెరీర్‌లో ఓవరాల్‌గా మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్. దీనికి ముందు, బోపన్న 2023, 2010 యూఎస్ ఓపెన్‌లలో కూడా ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అయితే, ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ బోపన్న ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి హ్యాట్రిక్ పరాజయాలను తప్పించుకుని తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించాలని బోపన్న భావిస్తున్నాడు.





# తొలిరోజే తిప్పేశారు

**తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 246 పరుగులకు ఆలౌట్**

**రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌కు తలో 3 వికెట్లు**

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 246 పరుగులకు కుప్పకూలింది. అనంతరం తొలిరోజు ముగిసే సరికి భారత జట్టు ఒక వికెట్ నష్టానికి 119 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 76 పరుగులతో, శుభ్‌మన్ గిల్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు. జైస్వాల్ తన టెస్టు కెరీర్‌లో రెండో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ప్రస్తుతం భారత్ ఇంగ్లండ్ కంటే 127 పరుగులు వెనుకంజలో నిలిచింది.



కెప్టెన్ రోహిత్ శర్మ (24 పరుగులు) జాక్ లీచ్ బౌలింగ్‌లో బెన్ స్టోక్స్ చేతికి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అంతకుముందు హైదరాబాద్‌లో ఇంగ్లండ్ తరపున కెప్టెన్ బెన్ స్టోక్స్ అత్యధికంగా 70 పరుగులు చేశాడు. జానీ బెయిర్‌స్టో 37 పరుగులు, బెన్ డకెట్ 35 పరుగులు చేశారు. భారత్ తరపున రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ తలో 3 వికెట్లు తీశారు. కాగా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ తలో 2 వికెట్లు తీశారు. దీంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 64.3 ఓవర్లలోనే ముగిసింది. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత స్పిన్నర్లు విజృంభించారు. ఎనిమిది వికెట్లు వారికే దక్కాయి. పర్యాటక జట్టు బ్యాటర్లలో కెప్టెన్ బెన్ స్టోక్స్ (70బీ 88 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. జానీ బెయిర్‌స్టో (37), బెన్ డకెట్ (35), జో రూట్ (29) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. అరంగేట్రం ఆటగాడు టామ్ హార్ట్‌లీ 24 బంతుల్లో 23 పరుగులు చేశాడు. తొలి సెషన్‌లో మూడు వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసిన ఇంగ్లాండ్.. రెండో సెషన్‌లో మరింత తడబడింది. లంచ్ బ్రేక్ అనంతరం ఐదు వికెట్లు నష్టపోయి 107 పరుగులు రాబట్టింది. 215/8 స్కోరుతో చివరి సెషన్‌ను ఆరంభించిన ఇంగ్లాండ్.. మరో 31 పరుగులు జోడించి చివరి రెండు వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లలో అశ్విన్ 3, జడేజా 3, అక్షర్ పటేల్ 2, జస్ప్రీత్ బుమ్రా 2 వికెట్ పడగొట్టారు.

ఇరుజట్ల ప్లేయింగ్ 11..

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రవీంద్ర జడేజా, శ్రీకర్ భరత్, రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్,

ఇంగ్లండ్: జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఆలీ పోప్, జో రూట్, జానీ బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ (కెప్టెన్), బెన్ ఫోక్స్, రెహాన్ అహ్మద్, టామ్ హార్ట్లీ, మార్క్ వుడ్, జాక్ లీచ్.

## కోహ్లి నామస్మరణతో మార్మోగిన ఉప్పల్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాల చేత ఈ మ్యాచ్‌కు దూరమైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కోహ్లి ఆడకపోయినా అతని నామస్మరణతో ఉప్పల్ స్టేడియం మార్మోగిపోతుంది. తమ ఆరాధ్య క్రికెటర్‌ను స్మరించుకుంటూ మ్యాచ్ చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు కేరింతలు కొడుతున్నారు. ముఖ్యంగా యువత అరుపులతో స్టేడియం దద్దరిల్లిపోతుంది. కోహ్లి ఫోటోలను పట్టుకుని ఫ్యాన్స్ హడావుడి చేస్తున్నారు. ఇవాళ వర్కింగ్ డే కావడంతో స్టేడియంలో జనాలు పలచగా కనిపించినా.. అక్కడున్న వారు మాత్రం కోహ్లి పేరును జపిస్తూ మ్యాచ్‌ను చూస్తున్నారు. ఓ పక్క భారత బౌలర్లు వికెట్లు తీస్తున్నా ప్రేక్షకులు వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. లోకల్ బాయ్ సిరాజ్ అద్భుతమైన క్యాచ్ పట్టినప్పుడు కూడా రెస్పాన్స్ అంతంత మాత్రంగానే వచ్చింది. కోహ్లికి అచ్చొచ్చిన ఉప్పల్.. డబుల్‌తో చెలరేగిన రన్ మెషీన్ 2017 ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఉప్పల్‌లో టెస్టు మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ 208 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. విరాట్ కోహ్లి (204బీ 24 ఫోర్లు) డబుల్ సెంచరీ... మురళీ విజయ్ (108బీ 12 ఫోర్లు, 1 సిక్స్), వృద్ధిమాన్ సాహా (106 నాటౌట్‌బీ 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. దాంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 166 ఓవర్లలో 6 వికెట్లకు 687 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 127.5 ఓవర్లలో 388 పరుగులకు ఆలౌటైంది. 299 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 4 వికెట్లకు 159 పరుగుల వద్ద డిక్లేర్ చేసి బంగ్లాదేశ్‌కు 459 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 100.3 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. అశ్విన్ (4/73), జడేజా (4/78) బంగ్లాదేశ్‌ను దెబ్బ కొట్టారు. భారత తుది జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, శ్రీకర్ భరత్, అక్షర్ పటేల్, రవిచంద్రన్ అశ్విన్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ఇంగ్లండ్ తుది జట్టు: జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, జానీ బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ (కెప్టెన్), బెన్ ఫోక్స్ (వికెట్ కీపర్), రెహాన్ అహ్మద్, టామ్ హార్ట్లీ, మార్క్ వుడ్, జాక్ లీచ్





## మరో తెలంగాణ నేపథ్య సినిమా కథ

### నానితో బలగం వేణు సినిమా

బలగం సినిమాతో అనూహ్య విజయాన్ని అందుకున్న జబర్దస్త్ వేణు ఇండస్ట్రీ మొత్తాన్ని ఒక్కసారిగా తనవైపుకు తిప్పుకున్నాడు. దాంతో జబర్దస్త్ వేణు కాస్త బలగం వేణుగా మారిపోయాడు. వేణు తన తరువాతి సినిమా కోసం నేచురల్ స్టార్ నానిని సెలెక్ట్ చేసుకున్నాడని టాక్. ఈ కాంబోని టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు సెట్ చేశారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కు సంబందించిన కథ చర్చలు పూర్తవగా.. నేరేషన్ కూడా కంప్లీట్ అయినట్లు సమాచారం. వేణు తన కెరీర్ ఫస్ట్ ఫిల్మ్ తోనే సినీ ఇండస్ట్రీని తనవైపు తిప్పుకున్నాడు. ప్రేక్షకులకు తన సహజ నటనతో దగ్గరైన నానితో..ఎలాంటి కథతో వస్తున్నాడనే ఉత్కంఠ కలుగుతోంది. ఇప్పుడు ఈ న్యాచురల్ కాంబో నుంచి ఆసక్తికర లీక్ బయటికి వచ్చింది. అదేంటంటే, ఈ సినిమా తెలంగాణ పల్లెటూరిలో జరిగే ఓ పీరియాడికల్ లవ్ స్టోరీ అని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.నాని కెరీర్‌లో ఇదివరకే శ్యామ్ సింగరాయ్‌తో పీరియాడిక్ కాన్సెప్ట్ టచ్ చేశాడు. ఇప్పుడు మళ్లీ నానితో కొత్తగా తెలంగాణ లవ్ స్టోరీతో..బలగం వేణు తనదైన పాత కాలానికి..ప్రేమలు హత్తుకునే సామ్రాజ్యానికి తీసుకెళ్తున్నాడు. త్వరలో ఈ సినిమా నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవలే నాని హాయ్ నాన్న సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఫాదర్ అండ్ డాటర్ ఎమోషనల్ కాన్సెప్ట్ తో వచ్చిన ఈ సినిమా డీసెంట్ హిట్ గా నిలిచింది. ప్రస్తుతం వివేక్ ఆత్రేయ డైరెక్షన్ లో సరిపోదా శనివారం మూవీలో నటిస్తున్నాడు.

## శరవేగంగా బాలయ్య సినిమా చిత్రీకరణ

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న బాలయ్య..తన తరువాత సినిమా పవర్ ఫుల్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ ఎన్‌బికె 109 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్నారు. వాల్తేరు వీరయ్యతో బిగ్గెస్ట్ హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. మొదటిసారి బాబీ బాలయ్య ఊరమాస్ కాంబోలో సినిమా రాబోతుండడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీలో 'యానిమల్'తో మెప్పించిన బాబీడియోల్ ఇందులో విలన్‌గా నటిస్తున్నాడు. ఇటీవలే తను ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. బాలకృష్ణ, బాబీడియోల్ మధ్య వచ్చే యాక్షన్ సీన్స్ పోటాపోటీగా ఉండబోతున్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఎలాంటి ప్రచారం లేకుండా సైలెంట్‌గా షూటింగ్ కానిచ్చేస్తున్న మేకర్స్..రిలీజ్ డేట్ విషయంలోనూ ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారట. ఈ సినిమా మొదలు పెట్టే ముందు దసరాకి రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యారు.




## దేవరపై పెరుగుతున్న అంచనాలు

### జాన్వీకి తెలుగులో తొలి సినిమా

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'దేవర' కొరటాల శివ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. 'జనతా గ్యారేజ్' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ÷ూజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరికొత్త గెటప్ లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంత రఫ్ లుక్ లో కనిపించబోతున్నారట. మాస్ లుక్ తో అందరినీ ఆశ్చర్యపరిచే అవకాశం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాదు, తారక్ రోల్ కు సంబంధించి ఓ కీలక ట్విస్ట్ ఉండబోతు న్నట్లు తెలుస్తోంది. ఆ ట్విస్ట్ సినిమా మొత్తానికి హైలెట్ గా నిలవబోతున్నట్లు సమాచారం. అటు త్వరలోనే ఈ మూవీకి సంబంధించి స్పెషల్ వీడియో గ్లింప్స్ రిలీజ్ కాబోతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇటు 'దేవర' సినిమా వేసవి కానుకగా ఏప్రిల్ 5న విడుదల అవుతుందని అందరూ భావించారు. కానీ, తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఇంకా కంప్లీట్ కాలేదు. రీసెంట్ గా ఈ సినిమాలో విలన్ రోల్ పోషిస్తున్న సైఫ్ అలీ ఖాన్ గాయపడ్డారు. ఆయన పార్ట్ షూటింగ్ పెండింగ్ లోనే ఉంది. అటు ఈ సినిమాకు పాటలు, నేపథ్య సంగీతాన్ని అందించేందుకు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవి చందర్ చాలా టైమ్ తీసుకుంటున్నారట. అటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ లోనే జరిగే అవకాశం ఉంది. మొత్తంగా పలు కారణాలతో ఈ సినిమా సమ్మర్ బరి నుంచి తప్పుకోబోతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా గురించి జాన్వీ రీసెంట్ గా కీలక విషయాలు వెల్లడించింది. 'నేను ఇప్పటి వరకు నటించిన సినిమాలు ఒక ఎత్తు, 'దేవర' సినిమా మరోఎత్తు. ఇప్పటి వరకు నేను నటించిన సినిమాలు ఓ వర్క్ షాప్ లా పనికి వచ్చాయి. ఈ సినిమాతో నాలోని నటిని పూర్తి స్థాయిలో చూడబోతున్నారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడుతున్నాం. ఈ సినిమా అనుభవాలను బేస్ చేసుకుని నా సినీ కెరీర్ ను నిర్మించుకునే ప్రయత్నం చేస్తాను' అని చెప్పింది. భారతదేశంలోని తీర ప్రాంతాల కథ నేపథ్యంలో రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. మొదటి పార్ట్‌ను ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. అయితే విజువల్ ఎఫెక్ట్స్ పనులు, విలన పాత్రధారి సైఫ్ అలీఖాన్ గాయపడటం తదితర కారణాలతో సినిమాని వాయిదా వేయాలనే నిర్ణయానికి చిత్రబృందం వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంత రఫ్ లుక్‌లో తారక్ కనిపించబోతున్నారని తెలుస్తోంది. అంతేకాదు ఎన్టీఆర్ రోల్‌కు సంబంధించి ఓ కీలక ట్విస్ట్ ఉండబోతున్నటు నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆ ట్విస్ట్ సినిమా మొత్తానికి హైలెట్‌గా నిలవబోతున్నట్లు సమాచారం. త్వరలోనే ఆ లుక్‌కు సంబంధించిన గ్లింప్స్ వదలబోతున్నారట. ఈ విషయం విన్న తారక్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పకులు.

జనంసాక్షి సినిమా

## ప్రశాంత్ వర్మ 'అధీర'



ప్రశాంత్ వర్మ.. ఇప్పుడిది పేరు కాదు ఒక బ్రాండ్. తీసింది నాలుగు సినిమాలు మాత్రమే. కానీ, ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యకమైన గుర్తింపును తెచ్చుకున్నాడు ఈ దర్శకుడు. ఇటీవల ఈ దర్శకుడి నుండి వచ్చిన మూవీ హనుమాన్. సూపర్ హీరో కాన్సెప్ట్ తో హనుమంతుని బ్యాక్డ్రాప్ లో వచ్చిన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. విడుదలైన 13 రోజుల్లోనే ఏకంగా రూ.230 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేసింది. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఇప్పటికే సూపర్ కలెక్షన్స్ రాబడుతూ దూసుకుపోతోంది. దీంతో ప్రశాంత్ వర్మ నుండి వస్తున్న తదుపరి సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోతున్నాయి. అంతేకాదు.. హనుమాన్ తరువాత ప్రశాంత్ ఎలాంటి సినిమా చేస్తున్నాడు? మళ్ళీ సూపర్ హీరో కాన్సెప్ట్ తోనే వస్తున్నాడా? అలా అయితే ఈసారి వస్తున్న సూపర్ హీరో ఎవరు? ఆ సినిమాలో హీరోగా ఎవరు చేస్తున్నారు? అంటూ తెగ సర్చింగ్ చేస్తున్నారు నెటిజన్స్. ఇక ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు.. ప్రశాంత్ వర్మ తరువాత సినిమాను కూడా సూపర్ హీరో కాన్సెప్ట్ తోనే తీయబోతున్నారట. ఆల్రెడీ ఈ సినిమాకు సంబందించిన అధికారిక ప్రకటన చాలా రోజుల కృతమే వచ్చింది. ఇంట్రో వీడియో కూడా రిలీజ్ అయ్యింది. ఆ సినిమానే అధీర. ఈ సినిమాతో ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య కొడుకు కళ్యాణ్ దాసరి హీరోగా పరిచయం అవుతున్నారు. అధీర సినిమా కోసం లైట్‌ను సూపర్ హీరో పవర్ గా తీసుకోనున్నారు ప్రశాంత్ వర్మ. తనకున్న లైటింగ్ పవర్ తో ఆ సూపర్ హీరో ఎం చేశాడు అనేది అధీర కథ. ఈ సినిమాకు సంబందించిన ఇప్పటికే షూటింగ్ మెదలైందని ప్రశాంత్ చెప్పారు. ఇక అధీర కి సంబంధించిన ఇంట్రో వీడియో చేశాక..ఈ సినిమా కూడా హనుమాన్ రేంజ్ లో ఆడియన్స్ ను మెస్మరైజ్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమా 2024 ఇయర్ ఎండింగ్ లో వచ్చే అవకాశం ఉంది. మరి మాములు బ్జడెట్ తోనే హనుమాన్ లాంటి గొప్ప సినిమా తీసిన ప్రశాంత్.. ఇప్పుడు ఏ రేంజ్ సినిమా తీస్తాడో అని ఆడియన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

## శేఖర్ కమ్ముల సినిమాలో నాగార్జున

**చంచల్‌గూడలో షూటింగ్ ప్రారంభం**

అక్కినేని నాగార్జున నటించిన 'నా సామి రంగ' సినిమా సంక్రాంతికి విడుదలైంది. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని ఈ సినిమాకి దర్శకుడు, ఇది అతనికి మొదటి సినిమా. ఇందులో అల్లరి నరేష్, రాజ్ తరుణ్ లు కూడా ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఘన విజయం సాధించటంతో, ఈ చిత్ర దర్శకుడి విజయ్ బిన్నిని కొరియోగ్రాఫర్స్, డాన్సర్స్ సంఘం సన్మానం చేసింది. నాగార్జున ఈ సినిమా విజయం పట్ల చాలా సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తన తదుపరి సినిమా షూటింగ్ కూడా మొదలెట్టేసానని చెపుతున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో ఒక సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అప్పుడే మొదలైంది, నాగార్జున మీద కొన్ని ప్రధాన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్టుగా తెలిసింది. దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా కోసమని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను హైదరాబాదు చంచల్ గూడా జైలులో చిత్రీకరిస్తున్నట్టుగా తెలిసింది. ఈ సినిమా షూటింగ్ రెండు రోజుల నుండి చంచల్ గూడా జైలులో అవుతోందని, ఇంకా ఒకటి రెండు రోజులు అక్కడే జరుగుతుందని కూడా తెలుస్తోంది.

# కాంగ్రెస్ రాజ్యమా! ఖాకీల రాజ్యమా ?

- అక్రమ కేసులు పెడితే సహించేదే లేదు..
- బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ఓర్వలేక కార్యకర్తలపై అక్రమ కేసులు
- కాంగ్రెస్ కక్షపూరిత వైఖరి ఎక్కువకాలం నిలబడదు
- బీఆర్ఎస్ హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ తో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నాం
- జగిత్యాల జైలులో ఉన్న బీఆర్ఎస్ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



**జగిత్యాల ప్రతినిధి, జనవరి 25 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ రాజ్యమా లేదా ఖాకీల రాజ్యమా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తే సహించేదే లేదని, చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన అక్రమ కేసులు ఎదుర్కొంటు అరెస్టయ్యి జగిత్యాల సబ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ నేత, హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డిని గురువారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఎమ్మెల్సీ కవిత వెంట మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కల్వకుంట్ల సంజయ్ కుమార్ ఉన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ... అధికారం మారగానే సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డిని కక్షపూరితంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అక్రమంగా సంబంధం లేని కేసులో ఇరికించి అరెస్టు చేయించి జైలులో పెట్టించారని తెలిపారు. గతంలో ఎప్పుడు జరగనంత బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ హయాంలో జగిత్యాల ప్రాంతం అభివృద్ధి చెందిందని, దాన్ని ఓర్వలేక తమ పార్టీ సర్పంచ్ ను జైలులో వేయడం దారుణమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కక్షపూరిత వైఖరితో తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించడాన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. చట్టపరంగానే కాకుండా వీధుల్లో, ప్రజాక్షేత్రంలో తాము ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నామని, ఏ పార్టీ కార్యకర్తలపై అయినా తాము రాజకీయంగా పోరాటం చేశాము తప్పా చట్టాన్ని, పోలీసులను వాడుకొని ఇలా కక్షపూరితంగా వ్యవహరించలేదని గుర్తు చేశారు. ఇది కాంగ్రెస్ రాజ్యమా... ఖాకీల రాజ్యమా అన్నట్లు రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఉన్నదని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత వైఖరిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఇటువంటి వైఖరి ఎక్కువ రోజులు నిలబడదని, ప్రజలు తిరగబడుతారని స్పష్టం చేశారు. అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలు కోసం పనిచేస్తూ హామీల అమలుకు ప్రయత్నం చేయాలని సూచించారు. యూనివర్సిటీలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థినులను మహిళా పోలీసులు జుట్టుపట్టి లాగి పడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ పోలీసులు ఈ రకంగా వ్యవహరించలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఒరవడి ప్రారంభమైందని, ఇలాంటి అధికారం పోలీసులకు ఇచ్చి ఇది కాంగ్రెస్ రాజ్యమా లేదా ఖాకీల రాజ్యమా అన్నట్లు చేస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. ఉద్యమాలు, పోరాటాలు చేసి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఇదే ఖాకీల మీద, కాంగ్రెస్ పార్టీ మీద ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నాము కాబట్టి అదే స్ఫూర్తితో ముందుకెళ్దామని అన్నారు. అంతిమంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# బాల్యంలో పిల్లలు క్రీడలపైనా దృష్టిపెట్టాలి

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర





**శేరిలింగంపల్లి, జనవరి 25 (జనంసాక్షి) :** పిల్లలను బాల్య దశలోనే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకునేలా తోడ్పాటు అందిస్తే వారు భవిష్యత్తులో క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దబడుతారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. నేడు రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యం గురువారం నిర్వహించిన ఆన్యువల్ స్పోర్ట్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా క్రీడల్లో గెలిచిన చిన్నారులకు రాజ్యసభ సభ్యులు రవిచంద్ర బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమానికి కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ ఫీజులతో, విద్యారంగంలో అద్భుత ఫలితాలను రాబట్టేందుకై ఎనలేని కృషి చేస్తున్న సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ పరిధిలో నెలకొని ఉన్న సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ స్థానికంగా నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మంచి పేరును ఆపాదించుకుందని, కొండాపూర్ డివిజన్ పరిధిలో మెరుగైన స్కూళ్లలో ఒకటిగా సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ క్రమంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి గెలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందనలు తెలియజేశారు. కబడ్డీ, కోకో, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, షాట్ పుట్, పలు ఆటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వద్దిరాజు రవిచంద్ర, హమీద్ పటేల్ బహుమతులను అందజేశారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినీవిద్యార్థులకు ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఆహుతులు, పెద్దలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా అలరించాయి.

## విద్యార్థి నాయకురాలును జుట్టుపట్టుకుని లాగడం పట్ల ఖండన



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** విద్యార్థి నాయకురాలును జుట్టు పట్టుకుని లాగడాన్ని ఖండిస్తున్నానని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి కుమారి ఝాన్సీ ని పోలీసులు నిరంకుశంగా వెహికల్ పై వెళ్తూ ప్రక్క నున్న నాయకురాలని కూడా చూడకుండా జుట్టుబట్టి లాగి కింద పడేయడం చాలా తీవ్రమైన విషయమని, చివరకు చేయి పై కూడా కాలు పెట్టి నిలబడడం సహించరానిదని అన్నారు. దీన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఆందోళనలు ధర్నాలు నిరసన కార్యక్రమాలు సహజమని, నిరసన కార్యక్రమాలు చేస్తున్నవారిని క్రిమినల్స్‌గా చూడకూడదన్నది రాష్ట్ర ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకం ఉందనేది స్పష్టం అవుతోందని, ఆందోళన కార్యక్రమాలను అణచాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం సరైనది కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఎవరి చేతుల్లోకి..?




**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** గత డిసెంబర్లో ఎన్నికల కారణంగా జరగాల్సిన హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జరగనున్నది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీలో సభ్యుడిగా ఉన్న బెజవాడ బుక్ ఫెయిర్ కీలక వ్యాపారి హైదరాబాద్ బుక్ సొసైటీలో తెర వెనుక, ముందు కీలక పాత్ర పోషించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇటీవల జరిగిన హైదరాబాద్ బుక్ ఫేర్ కార్య నిర్వాహక సమావేశానికి ఎగ్జిక్యూటివ్ సభ్యుడి కానప్పటికీ సమావేశానికి వచ్చి అన్నీ తానై కొత్తగా అయిన కార్యదర్శి ని డమ్మీ చేసే విధంగా వ్యవహరించారు. ఆయన ఈ సమావేశానికి హాజరు కావటాన్ని పలువురు సభ్యులు ప్రశ్నించినప్పటికీ సమావేశం నుండి వెళ్లిపోలేదు. ఇప్పటికే విజయవాడ బుక్ ఫెయిర్ లో ప్రజాశక్తి, విశాలాంధ్ర సంస్థల ప్రతినిధులైన అధ్యక్ష, కార్యదర్శులు ఆ ప్రముఖుడి చెప్పు చేతుల్లోనే పనిచేస్తున్నారు. నిర్వాహకులు పేరుకు వామపక్షవా దులైనప్పటికీ విజయవాడ బుక్ ఫేర్ చాగంటి కోటేశ్వరరావు వంటి వారి బొమ్మలతో నింపి బ్రాహ్మణీయ భావజా లాన్ని బహిరంగంగానే ప్రచారం చేసుకుంటున్నారని బెజవాడ పుస్తక ప్రదర్శన సందర్భంగా అభ్యుదయవాదులు, అంబేడ్కరిస్టులు బహిరంగంగానే విమర్శలు చేశారు. రచయితలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఒక మూలన పడేశారని సోషల్ మీడియాలో బహిరంగంగానే విమర్శలు వచ్చాయి.

తెలుగు రాష్ట్రాలలో పుస్తక రంగంలో కార్పొరేట్ శక్తిగా ఎదిగిన పెద్దమనిషికి ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ కి సభ్యుడిగా ఎన్నుకున్నారు. రెండు రాష్ట్రాలలో అనేకమంది ఉన్నతాధికారుల తో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా చక్రం తిప్పే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలోని మంత్రులతో ఉన్న సంబంధాల ఆధారంగా ఇటీవల జరిగిన విజయవాడ బుక్ ఫెస్టివల్ కు 30 లక్షల రూపాయలు ప్రభుత్వం నుండి ఇప్పించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం వలన ఏదో ఒక రకంగా ముఖ్యమంత్రి, మంత్రుల వద్దకు వెళ్లడం కోసం, తన ఇన్ఫ్లుయెన్స్ (ప్రభావం) పెంచుకునేందుకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను వేదికగా మలుచుకునేందుకే ఆ ప్రముఖుడి ప్రయత్నాలని బుక్ ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఒకరిద్దరు పాఠ్యపుస్తకాల వ్యాపారం ఉన్న దిగ్గజాల చేతుల్లోకి, ఆంధ్ర కార్పొరేట్ చేతుల్లోకి పోతదేమోనని కూడా తెలంగాణ వాదులు చర్చించుకుంటున్నారు.

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పనిచేసిన బుక్ సొసైటీ విస్మరించిన తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ప్రముఖులను గత పది ఏళ్లలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ వెలుగులోకి తెచ్చి కొత్త తరానికి పరిచయం చేసింది. మగ్దుమ్ మొహిద్దిన్, సుద్దాల హనుమంతు, అలిశెట్టి ప్రభాకర్, చిందు ఎల్లమ్మ, చుక్క సత్తయ్య వంటి అనేకమంది ప్రముఖుల పేర్లతో ప్రాంగణాలు, వేదికలు ఏర్పాటు చేసి పుస్తక ప్రదర్శన ఉత్సవం లాగా సాగింది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గత పదేళ్ల ట్రెండు కొనసాగుతుందో, లేదో చూడాలి.


## ఇండియా మిషన్ స్థిరాస్తులను అమ్మినా కొన్నా సహించేది లేదు

- ఇండియా ఫేల్లో షిప్ అఫ్ ఇవంజలికల్ చర్చస్ ప్రతినిధులు



**చేర్యాల, జనవరి 25 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలో ఇండియా మిషన్ ఆస్తులను అమ్మినా కొన్నా నేరం అవుతుందని ఇండియా మిషన్ ప్రతినిధులు తెలిపారు. చేర్యాల పట్టణం లో ఇండియా మిషన్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇండియా మిషన్ మరియు ఫేల్లో షిప్ అఫ్ ఇవంజలికల్ చర్చస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇటీవల చేర్యాల మండల కేంద్రంలో ఉన్న మిషన్ కాంపౌండ్ స్థలాన్ని గోపిజోనా మరియు అగ్రిప్పా అనే వ్యక్తులు అక్రమంగా నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముతున్నారని మా దృష్టికి వచ్చింది దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కాంపౌండ్ దాదాపు 90 సంవత్సరముల క్రితం ఏర్పడి ఈ ప్రాంత ప్రజలకు ఎంతోమందికి వైద్యాన్ని విద్యను అందిస్తూ మరియు ఆధ్యాత్మికంగా విలసిల్లుతూ చుట్టుప్రక్కల గ్రామాలకు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా ఉందని, ఈ స్థలాన్ని ఎవ్వరికి కుడా అమ్మడానికి కొనడానికి వీలులేదని తెలిపారు. ప్రజల, దైవాగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ స్థలమును అమ్మడానికి లేదా కొనడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవ శామ్యూల్ రెవ యం ఇస్సాకు టి డేవిడ్ టీ ప్రణబ్ కుమార్ పజాషువా జీవరత్నం పౌలు కే జాన్సన్ బాబు ప్రభాకర్ ప్రసాద్ కుమార్ శీను దేవదాస్ యాకోబు క్రిస్టఫర్ దినకర్ రాజు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును డబ్బు, మద్యానికి అమ్ముకోవద్దు



- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- గంగాపూర్ లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**కొమురంభీం ఆసిఫాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కును బీరు,బిర్యానీ,డబ్బులకు అమ్ముకోవద్దని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గంగాపూర్ లో భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అత్యంత విలువైనదని దాని ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. ఓటుహక్కును అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవడానికి మాత్రమే వాడాలని మద్యానికి బానిసై అమ్ముకోవద్దన్నారు. కానీ, దురదృష్టంకొద్దీ ఎన్నికల్లో ఓటును అమ్ముకునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. విగ్రహాలతోనే అగిపోవద్దన్న ఆయన విద్య ద్వారానే బహుజనుల బతుకులు మారుతాయని అన్నారు.దేశంలో ఆధిపత్య పాలకులు రాజ్యాంగం అమలు చేయకుండా 125 అడుగుల విగ్రహం పెడుతున్నారు కానీ, సంపద సృష్టించే మార్గం మాత్రం చూపించడంలేదన్నారు. 75 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆధిపత్య పాలకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు చేయకుండా, రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి నియంత పాలకులు రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని కూడా తాకే అర్హత లేదని హెచ్చరించారు. దేశంలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ బీఎస్పీనేనన్నారు.ఈ కార్యక్రమంలో బౌద్ధ బిక్కు బాధంత్ బుద్ధ శరణ్ తేరో వందన సమర్పణ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడెం గణపతి, నాయకులు దుర్గం మోతీరామ్,బండు పటేల్, విజయ నిర్మల, స్థానిక సర్పంచ్ గోమాస విలాస్, జనార్దన్,దుప్త సూరన్న, రాజేష్, శేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధంలాంటిది

- రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్
- జెఎన్‌టియు లో ఘనంగా ఓటర్ల దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, జనవరి 25 (జనంసాక్షి) :** ఓటు హక్కు ప్రజల చేతిలో ఆయుధం లాంటిదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కూకట్ పల్లి జె.ఎన్.టి.యు ఆడిటోరియంలో జరిగిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ మాట్లాడుతూ.... ఓటు అనేది ప్రజల చేతుల్లో ఆయుధమని దానిని తప్పకుండా వినియోగించుకోవాలని తెలిపారు. ఇలాంటి కార్యక్రమానికి హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఓటు వేసి మంచి భవిష్యత్తును నిర్ణయించడం అనేది మన చేతుల్లో ఉందన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కును మొదటిసారి వినియోగించుకున్న యువత ఎంతో ఆనందంగా ఓటు వేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా విజయవంతం అయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా 3.26 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా హెూం ఓటింగ్ దేశానికి రోల్ మోడల్ గా నిలిచాయి. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఓటింగ్ విషయంలో ముఖ్యంగా యువత ఓటింగ్ రోజు ను సెలవు రోజుగా కాకుండా తమ భవిష్యత్తును నిర్ణయించే రోజుగా భావించి తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గవర్నర్ కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ ఉందని ఓటు వినియోగించు కోకపోవడం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇతర దేశాలకు వెళ్లే సందర్భంలో మాత్రం విమానాశ్రయంలో గంటల తరబడి క్యూ లైన్ లో ఉంటారని అన్నారు. హైదరాబాద్ లోని ఐటీ కంపెనీలకు కూడా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యేకంగా ఓటు హక్కు ఉన్న వారిని వినియోగించుకునేలా సెలవులు ఇచ్చేలా సౌకర్యాలు కల్పించిందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రాధాన్యత ను ఆమె తెలిపారు. ఓటు అంటే బుల్లెట్ అని అనుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న వారు ఈ ఎన్నికల్లో ఎక్కువ సంఖ్యలో ఉండటం గర్వించదగిన విషయం అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఓటు హక్కు అనేది ఒక బాధ్యత గా భావించి యువత తప్పకుండా తమ ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు శాతం గ్రామీణ ప్రాంతాల్లో పెరగగా... హైదరాబాద్ వంటి పట్టణాల్లో తగ్గిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు మరింత కృషి చేయాలన్నారు. ఈ విషయంలో ముఖ్యంగా యువత ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన వికాస్ రాజ్ మాట్లాడుతూ 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. 2011 నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే కాకుండా కొత్త గా ఓటర్ల నమోదుకు ముఖ్య ఉద్దేశమన్నారు 2023 లో కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారు 9.99,667 ఓటర్లు నమోదైనట్లు వివరించారు. అలాగే 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు 7.50 లక్షల మంది ఓటర్లుగా నమోదు అయ్యారని, ఫిబ్రవరి 8వ తేదీ వరకు తుది ఓటరు జాబితా విడుదల సందర్భంగా మరింత పెరుగే అవకాశం ఉందని అర్హులైన వారు. ఆన్‌లైన్‌లో, బీఎల్ఓ ల ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని వికాస్ రాజ్ కోరారు. ఓటు హక్కు ఉన్నవారు ఓటరు జాబితాలో పేరును కూడా పరిశీలన చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా జరిగాయని, 80 సంవత్సరాలు నిండిన వారు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించుకొని ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కు అంతకు ముందుగా పోలీసులు గౌరవ వందనం చేయగా... రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి, సీఈవో వికాస్ రాజ్, అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, జిల్లా కలెక్టర్ గౌతమ్ తదితరులు పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అయా జిల్లా కలెక్టర్లు అధికారులు, ఆయా పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతలైన పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అధికారులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , జోనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, వెంకటేష్ దొత్రే రవి కిరణ్, పంకజ, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105